

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 20 పేజీలు: 8+4 వెల: 6.50



అన్నీ ఉచితంగా ఇచ్చేస్తారా? సుప్రీం కోర్టు ఆగ్రహం 2లో

అమెరికా చరిత్రలో వరస్ట్ అధ్యక్షుడు ట్రంప్! 5లో





గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఎఐ ఇంపాక్ట్ సదస్సులో వివిధ దేశాధినేతలు, సిఇఒలతో ప్రధాని మోడీ

# ఎఐ సక్సెస్‌కు 'మానవ్' మంత్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఎఐ అనేది కేవలం టెక్నాలజీ మాత్రమే కాదని, అది ఒక పరివర్తన, మానవ చరిత్ర గమనాన్ని మార్చే ఒక చారిత్రాత్మక మలుపు అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఎఐ అభివృద్ధికి భారత దేశమే సరైన వేదిక అని స్పష్టం చేశారు. ఎఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మోడీ కీలకోపన్యాసం ఇచ్చారు. 100కు పైగా దేశాల నుంచి వచ్చిన నాయకులు, టెక్ నిపుణులతో సదస్సు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎఐ టెక్నాలజీని చూసి కొందరు భయపడుతున్నారని, కానీ అందులో దేశ భవిష్యత్తును భారత్ చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. దేశ భవిష్యత్ వికాసంలో మైలురాయిలా ఏఐ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల, ఆశావాద దృక్పథంతో ఎఐ ఆవిష్కరణలను భారత్ స్వాగతిస్తోందన్నారు. ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ ప్రజాస్వామికీకరణ జరగాలని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి వెల్లడించారు. ప్రత్యేకించి గ్లోబల్‌సౌత్ దేశాలకూ ఎఐ ఫలాలు అందాలన్నారు. అందుకే సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం, అందరి సంతోషం) అనే థీమ్‌తో ఎఐ ఇంపాక్ట్ సదస్సును భారత్ నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక ఎఐ సదస్సును భారత్ నిర్వహిస్తుండటం >>2

- కృత్రిమ మేధలోనే ప్రపంచ భవిష్యత్తు
- వికసిత్ భారత్‌లో ఎఐదే కీలకపాత్ర, 'ఎఐ ఇంపాక్ట్' సమ్మిట్‌లో ప్రధాని మోడీ
- గ్లోబల్ సౌత్ ఈ సదస్సులను చూసి గర్విస్తోంది: ప్రధాని
- 100పైగా దేశాల నుంచి హాజరైన అధినేతలు, టెక్‌నిపుణులు

## త్వరలో డిఎస్సీ

# జాబ్ కేలండర్

### 3వేలు పైగా నియామకాలకు అవకాశం

### కర్నూలు క్లస్టర్ వర్సిటీ వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తి

### కస్తూరిబా స్కూళ్ల పనితీరు భేష్: అసెంబ్లీలో మంత్రి లోకేష్



**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీకి బ్యాలెన్స్ పనులు వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు ఇందుకు గంటను సమయాన్ని నిర్దేశించారు. ఈ సమయంలో కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల (శ్రీకాకుళం) ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి జీత భత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారధి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పని చేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు >>2

# శ్రీవారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీలేదు..



### హెరిటేజ్‌పై ఆరోపణలు అర్థరహితం: టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు


**తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాత వార్త ప్రతినిధి:** టీటీడీ ధార్మిక సంస్థపై అనేక కుట్రలు చేసి, హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్తీ నెయ్యి కేసులో పీకల్లోతు కూరుకుపోయారని, ఈ కారణంగా తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్ కంపెనీపై ఆరోపణలు చేయడం అర్థరహితమని టీటీడీ ఛైర్మన్ బి.ఆర్ నాయుడు ఒక ప్రకటనలో ఖండించారు. హెరిటేజ్ సంస్థ ఎప్పుడూ టీటీడీకి నెయ్యి సరఫరా చెయ్యలేదు. ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ టీటీడీకి నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదు. అబద్ధాన్ని పదే పదే చెబితే అది నిజమవుతుందనుకోవడం మీ భ్రమ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. హెరిటేజ్ కంపెనీ టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదనేది తెలుసుకుని, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ వాస్తవ విషయాలు తెలుసుకుని మాట్లాడాలనీ ఆ ప్రకటనలో బి.ఆర్ నాయుడు పేర్కొన్నారు. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్టు చూపించి నెయ్యి అని చెప్పి మీ పరువు పోగొట్టుకున్నారు. చీజ్ ప్యాకెట్ కి నెయ్యి ప్యాకెట్ కీ తేడా తెలియకుండా, వై.ఎస్.జగన్ చెప్పినట్లు గంగిరెద్దులా తల ఊపకుండా, జగన్ చెప్పినట్లు ఆడకుండా, మాట్లాడే ముందు విజ్ఞతతో ఆలోచించండి. అంటూ బొత్స సత్యనారాయణకు బి.ఆర్ నాయుడు హితవు పలికారు. నెయ్యి ధరలపైనా వైసీపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. టీటీడీ వైపు నుంచి ఓపెన్ టెండర్లలో పారదర్శకంగా వీటిని నిర్ణయించాం. మా పాలవర్గం రాగానే మొదటగా మేం స్వామి వారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీపడకూడదని నిర్ణయించుకున్నాం. ఆ మేరకే భక్తుల మన్ననలు >>2

### జనాభా లెక్కలపై

# నేడు కీలక సమావేశం



**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఈనెల 20వ తేది శుక్రవారం ఉ.10.30 గం.ల నుండి సా.4గం.ల వరకు ఎపి సచివాలయం 5వ భవనంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన జనాభా లెక్కల సేకరణ(సెన్సెస్ ఆఫ్ 2027)పై ఒకరోజు రాష్ట్రస్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో జనాభా లెక్కల సేకరణ2027 కు సంబంధించిన సన్నద్ధత ఇతర అంశాలపై చర్చించనున్నారు. అలాగే మాస్టర్ ట్రైనర్స్, ఫీల్డు ట్రైనర్ల ఖరారు, జిల్లా సెన్సస్ అధికారులు, చార్జి అధికారులకు మూడు రోజుల >>2



# విద్యుత్ ఖాళీలు త్వరలోనే భర్తీ

### మంత్రి గొట్టిపాటి రవికుమార్

**సచివాలయం,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరిల పోస్టు లను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటిం చారు. గురువారం అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. ఏపిఈపిడిసిఎల్ పరిధిలో మొత్తం 2,947పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటి వివరాలను మంత్రిసభకు వెల్లడించారు. ఎనర్జీ అసిస్టెంట్లు 581,జూనియర్ లైన్‌మెన్ 1260, అసిస్టెంట్ లైన్‌మెన్ 1084,లైన్ మెన్ 22పోస్టులను త్వరలోనే భర్తీచేస్తామని పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా >>2




గురువారం విశాఖలో జరిగిన 'మిలన్'2026'లో 9 ఆసియాన్ సభ్య దేశాల నుంచి వచ్చిన నేవీ చీఫ్‌లు, నావికా ప్రతినిధులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

## ఇండోపసిఫిక్ వ్యూహానికి

# 'ఆసియాన్' కీలకం

### భాగస్వామ్య భద్రత ప్రాంతీయ శ్రేయస్సుకు పునాది

### విశాఖలో జరిగిన 'మిలన్-2026'లో రక్షణమంత్రి రాజ్‌నాథ్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇండోపసిఫిక్ వ్యూహానికి ఆసియాన్ దేశాలు మూల స్తంభం వంటివని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. ముఖ్యంగా భాగస్వామ్య భద్రత ప్రాంతీయ శ్రేయస్సుకు పునాది అని ఆయన వివరించారు. గురువారం విశాఖలో మిలన్ 2026 నావికా విన్యాసాల సందర్భంగా ఆయన ఇక్కడ తొమ్మిది ఆసియాన్ సభ్య దేశాల నుంచి వచ్చిన నేవీ చీఫ్‌లు, నావికా ప్రతినిధులతో సంభాషించారు. భారతదేశం తన 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' పట్ల, ప్రాంతాల అంతటా భద్రత, వృద్ధి కోసం పరస్పర, సమగ్ర పురోగతి, వాటి దార్శనికతను (మహాసాగర్) ఈ సమావేశం స్పష్టం చేసింది. మిలాన్-2026లో ఆసియాన్ నావికాదళాలు గణనీయంగా పాల్గొనడాన్ని రక్షణ శాఖా మంత్రి స్వాగతించారు, 1995లో నాలుగు విదేశీ నావికాదళాలతో ప్రారంభమైన ఈ వ్యాయామం ఫిబ్రవరి 2026లో 74 దేశాలతో జరిగిన అతిపెద్ద ఎడిషన్‌గా మారిందని ఆయన వివరించారు. ఇండోపసిఫిక్ భాగస్వాముల మధ్య విశ్వాసం, కార్యాచరణ పరిచయాన్ని పెంపొందించడంలో హిందూ మహాసముద్ర నావికా సింపోజియం కాన్క్లేవ్ ఆఫ్ చీఫ్స్, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) 2026 ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. ఈ చర్చలు మిలాన్-2026 యొక్క కొనసాగుతున్న సముద్ర దశను కూడా కవర్ చేశాయని, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం, వైమానిక రక్షణ, శోధన, >>2

# చంద్రబాబు సర్కార్ అప్పుల్లో రికార్డు



### అతీగతీలేని మూడు ప్రధాన హామీలు

### పెన్షన్లు యేటా కట్ చేస్తున్నారు

### సూపర్ ఫ్లాప్ సినిమాను సూపర్‌హిట్ అంటారా?: మీడియాతో మాజీ సీఎం జగన్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టేసిందని మాజీ సీఎం జగన్ ఆరోపించారు. చంద్రబాబు 2014లో అధికారం చేపట్టే నాటికి అప్పులు రూ. రూ. 47 వేల 717 కోట్లని అని తెలిపారు. 2019లో బాబు దిగిపోయే నాటికి రూ.3 లక్షల 90 వేల 247 కోట్ల అప్పులు చేశారనిఅన్నారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.7 లక్షల 21 వేల 918 కోట్లని తెలిపారు.అయితే రూ.9లక్షల 74వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇలా తప్పుడు ప్రచారాలు చేయవచ్చా? అని ప్రశ్నిం చారు. వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మా ట్లాడుతూ 50 ఏళ్లకే పెన్షన్ అని మరొక హామీ ఇచ్చారని రాష్ట్రంలో 50 నుంచి 59 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ మూడు బడ్జెట్లలో మూడు ప్రధాన హామీలకు అతీగతీ లేదన్నారు. సూపర్ ఫ్లాప్ అయిన సినిమా చూపించి సూపర్ హిట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. ప్రతి నెల పబ్లిక్ మీటింగ్ పెట్టి ప్రతీ మీటింగ్‌కి 25 వేల పెన్షన్లు కట్ చేస్తున్నారు. 2024 మార్చి నాటికి రాష్ట్రంలో పెన్షన్లు 66,34,372 . ఈ నెల చంద్రబాబు ఇచ్చిన పెన్షన్లు 60,96,108 ఐదు లక్షలకు పైగా పెన్షన్లు కట్ చేశారు. ఈనెల ఇచ్చిన మొత్తం 2,632 కోట్లు. ఏడాదికి కావాల్సింది 31,584 కోట్లు. ఈ ఏడాది బడ్జెట్ పెన్షన్ కోసం చేస్తున్న ఖర్చు 27,719 కోట్లు. ఈ డబ్బు మొత్తం 53,50,115 పెన్షన్లకు మాత్రమే సరిపోతుంది. మరి మిగతావాళ్ళవి ఏం చేస్తారు. దాదాపు ఏడు లక్షల పెన్షన్లకు కేటాయింపులు ఎలా చేస్తారు. తల్లికి వందనం పేరిట మరో మోసం రాష్ట్రంలో యుడిఐఎస్ఇ డేటా ప్రకారం మా హయాంలో బడికిపోయే పిల్లలు 87,41,885 పిల్లలు, ఒక్కొక్కరికీ 15వేల చొప్పున ఇస్తే 13,112 కోట్లుఖర్చు అవుతుంది. ఇప్పటివరకు >>2



గురువారం భేటీ అయిన మంత్రివర్గ ఉపసంఘం

## అమరావతిలో 7 సంస్థలకు

# భూ కేటాయింపులు

### మంత్రి నారాయణ వెల్లడి

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో గతంలో వివిధ సంస్థల ఏర్పాటుకు భూములు కేటాయిస్తే వైఎస్సార్సీపీ ప్రభుత్వం చాలా ఇబ్బందులు పెట్టిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమరావతిలోని అనేక సంస్థలను ఇబ్బంది పెట్టిందన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల అనేక సంస్థలు పనులు ప్రారంభించలేదన్నారు. ఆయా కంపెనీల భూ అవసరాలు గుర్తించి అనుమతులు ఇచ్చామన్నారు. ఈకేటాయింపుల్లో ప్రధానంగా బ్యాంకులు, వివిధ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలకు చెందినవి ఉన్నాయి. సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. భూ సమస్యల పరిశీలన, రాజధానిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్తగా వచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురావడం తదితర అంశాలపై చర్చించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రారంభించలేని సంస్థలు, అదనపు స్పేస్ కోరిన వాటిని పరిశీలించి వాటికి క్లియరెన్స్‌లు ఇచ్చామని తెలిపారు. >>2



# ఢిల్లీ ఎఐ సదస్సుకు సిఎం

### నేడు పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి భేటీ

**విజయవాడ.ఫిబ్రవరి 19:** అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కు ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు హాజరు కానున్నారు. ఏపీని సాంకేతిక హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో పాల్గొనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్నారు. రేపు ఉదయం జైపూర్ నుంచి ఢిల్లీకి చేరుకోనున్న సీఎం భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ సమ్మిట్ వేదికకు వెళ్లనున్నారు. 9.30 గంటలకు ఏఐ యాక్సిలరేటర్స్, ఫ్యూయలింగ్ ఇండియాస్ ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొనున్నారు. అనంతరం రాష్ట్రంలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించిన కొన్ని ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. క్వాంటంతో పాటు ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతోనూ ఒప్పందం జరుగనుంది. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ తోనూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ఏర్పాటు కోసం ఐఐటీ మద్రాస్ కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన చేయనున్నారు. అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ >>2



### మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణా రెడ్డికి

# ఎసిబి కోర్టు నోటీసులు

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఇన్నర్ రింగ్‌రోడ్డు అక్రమాల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఏసీబీ కోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది.ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరి నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎంఎల్ఏగా గెలుపు పొందారు.ఆ సమయంలో ఆయన ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై అప్పటికి మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబుపై పలు ఆరోపణలు చేసారు. ఆ క్రమంలోనే ఆయన కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసారు. ఇన్నర్ రింగ్ >>2



గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఎఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరైన ప్రతినిధులతో ప్రధాని మోడీ

# ఎఐ సక్సెస్‌కు 'మానవ్' మంత్రం

>> యావత్ గ్లోబల్ సౌత్‌కు గర్వకారణమన్నారు. కొత్త టెక్నాలజీని తయారు చేయడంతో పాటు దాన్ని అందిపుచ్చుకోవడంలోనూ భారత్ ముందుంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా టెక్ నిపుణులు లభించే కేంద్ర బిందువుగా భారత్ ఎదిగిందన్నారు. నైతికత, జవాబుదారీతనం, మానవ హక్కులే కేంద్రంగా సాగాల్సిన ఎంఎఎన్ఎవి (మానవ్) దార్శనికతను ఆయన ప్రపంచం ముందుంచారు. ఏఐ అభివృద్ధిలో భారత్ అనుసరించబోయే ఐదు సూత్రాల విధానాన్ని ప్రధాని మోడీ వివరించారు. ఎంఎఎన్ఎవి అనే పదానికి ఆయన ఇచ్చిన నిర్వచనం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎం –మోరల్ అండ్ ఎథికల్: నైతిక విలువలతో కూడిన వ్యవస్థ, ఎ – అకౌంటబుల్ గవర్నెన్స్: జవాబుదారీతనంతో కూడిన పాలన, ఎన్ –నేషనల్ సావర్నిటీ: జాతీయ సార్వభౌమాధికారం, ఎ – యాక్సెస్‌బుల్ టెక్నాలజీ: అందరికీ అందుబాటులో ఉండే సమ్మిళిత సాంకేతికత, వి – వాలిడేటెడ్ సిస్టమ్ : చట్టబద్ధమైన, చెల్లుబాటు అయ్యే వ్యవస్థలు అని ప్రధాని మోడీ వివరించారు.

**ఎఐకు సరైన దిశ లేకుంటే విధ్వంసమే:** 'ఎఐ అనేది విప్లవాత్మక శక్తి. దానికి సరైన దిశ అనేది లేకుంటే, అదొక విధ్వంసంలా పరిణమిస్తుంది. అందరి సంక్షేమం, అందరి సంతోషం అనే థీమ్‌తో ఈ సదస్సును మేం నిర్వహిస్తున్నాం. దీన్నిబట్టి ఏఐను భారత్ ఎలా చూస్తోందో అందరూ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మేం అందరి సంక్షేమం, అందరి సంతోషం కోసమే ఏఐను వినియోగిస్తాం" అని ప్రధాని మోడీ వెల్లడించారు. "ఎఐ టెక్నాలజీ అనేది మానవ సామర్థ్యాలను పెంచుతుంది. దీన్ని అందిపుచ్చుకునేందుకు మనం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. ఇప్పటికే ఉన్న స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవాలి. జీవితాంతం కొత్తకొత్త అంశాలను నేర్చుకుంటూ ముందుకుసాగాలి. తద్వారా మానవ కేంద్రిత ఎఐ సాకారం అవుతుంది. ఎఐ దృష్టిలో మనుషులు కేవలం డేటా పాయింట్స్ లాంటివారు. అందుకే ఎఐ టెక్నాలజీని ప్రపంచంలో అందరికీ అందుబాటులోకి తేవాలి. ఆకాశమే హద్దుగా వ్యాపించే అవకాశాన్ని ఎఐకు మనం ఇవ్వాలి. కాకపోతే, జిపిఎస్‌లా దాని కమాండ్‌ను మన చేతుల్లోనే పెట్టుకోవాలి. మనకు అవసరమైనప్పుడే జిపిఎస్‌ను వినియోగిస్తాం. లేదంటే వినియోగించం. డీప్ ఫేక్స్ కట్టడి, ఎఐ జనరేటెడ్ కంటెంట్‌పై మార్గదర్శకాలు వంటి విషయాల్లో వెంటనే అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పన జరగాలి. డీప్ ఫేక్స్, ఎఐ జనరేటెడ్ కంటెంట్‌తో సామాజిక అస్థిరతను క్రియేట్ చేసే ముప్పు ఉంటుంది. అందుకే ప్రజలు అసలైన కంటెంట్‌ను, ఎఐ కంటెంట్‌ను నిర్దిష్టంగా గుర్తించేలా ప్రత్యేక లేబుల్స్‌ను తప్పక వినియోగించాలి" అని ప్రధాని మోడీ చెప్పారు.

**ఏఐకి భారత్ సరైన వేదిక:** ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, అత్యధిక టెక్ టాలెంట్ కలిగిన భారత్.. ఏఐ అభివృద్ధికి బలమైన కేంద్రంగా నిలుస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. "అందరి సంక్షేమం కోసం, అందరి శ్రేయస్సు కోసం అనే థీమ్‌తో భారత్ అడుగులు వేస్తోంది. మనం భవిష్యత్ తరాలకు ఎలాంటి ఎఐని వదిలి వెళ్తున్నామనేదే నేటి అసలు బాధ్యత" అని ఆయన అన్నారు. ఎఐ గతంలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ మొదలైనప్పుడు ప్రపంచం ఇంతలా అనుసంధానమవుతుందని ఎవరూ ఊహించలేదని, ఇప్పుడు ఎఐ కూడా అటువంటి పరివర్తననే తీసుకువస్తుందని ప్రధాని మోడీ అన్నారు. "యంత్రాలు తెలివైనవిగా మారుతున్నాయి. ఇది మానవ సామర్థ్యాలను కొన్ని వందల రెట్లు పెంచుతుంది. అయితే మానవులు కేవలం డేటా పాయింట్లుగా మిగిలిపోకూడదు.. వారి సాధికారతే లక్ష్యం గా ఎఐ ఉండాలి" అని మోడీ స్పష్టం చేశారు. ఈ సదస్సుకు 100 కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా, అబుదాబి క్రౌన్ ప్రిన్స్, శ్రీలంక అధ్యక్షుడు, మారిషస్ ప్రధాని సహా పలువురు ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# ఢిల్లీ ఎఐ సదస్సుకు సిఎం

>> గాంధీతోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అనే అంశంపై నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సదస్సులో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండే తో కలిసి ముఖ్యమంత్రి చర్చించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యునైటెడ్ కింగ్ డమ్ కు చెందిన ప్రతినిధి బృందంతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. బ్రిటన్ ఏఐ, ఆన్ లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, భారత్ లో యూకే హై కమిషనర్ లిండి కెమరాన్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శాలీ టేలర్ తదితరులతో ముఖ్యమంత్రి సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అరామ్కో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ అయితుకైర్, అడోబ్ సీఈఓ శాంతనూ నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే తో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశం కానున్నారు. అనంతరం ఢిల్లీ నుంచి బయల్దేరి రానున్నారు. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరయ్యేందుకు ఇవాళ సాయంత్రం సీఎం జైపూర్ కు బయల్దేరి వెళ్ళారు. సాయంత్రం 5 గంటలకు విజయవాడ నుంచి జైపూర్ కు బయలుదేరి వెళ్ళారు.. జైపూర్ లోని వృందావన్ ప్యాలెస్ లో జరిగే వివాహానికి హాజరై రాత్రికి అక్కడే బస చేస్తున్నారు.. శుక్రవారంఉదయం జైపూర్ నుంచి బయల్దేరి ఢిల్లీలో జరిగే ఇండియా ఇంపాక్ట్ ఏఐ సదస్సుకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు.



# అబ్బురపరిచిన నావికాదళ విన్యాసాలు

**ప్రభాతవార్త,విశాఖపట్నం:** ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) 2026లో భాగంగా గురువారం ఆర్కే బీచ్‌లో జరిగిన నావికాదళ విన్యాసాలు అబ్బురపరిచాయి. వివిధ రకాలు విన్యాసాలు అక్కడున్న ప్రజలతో పాటు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కట్టిపడేశాయి. అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కోస్ (అత్యున్నత శిక్షణ పొందిన మెరైన్ కమాండోలు) హెలికాప్టర్ల నుంచి సముద్రంలోకి దిగడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆయిల్ రిగ్ పేల్చివేత, యుద్ధ విమానాల నుంచి శత్రువులపైకి బాంబులు జారవిడిచే ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. యుద్ధనౌకల నుంచి హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు ఎగరడం, కచ్చితంగా ల్యాండ్ అవ్వడం వంటివి 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు. తీరంలో మోహరించిన యుద్ధనౌకలు, 19 విదేశీ నౌకలు విద్యుత్తు దీపాల వెలుగులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వివిధ దేశాల నావికా దళ సిబ్బంది వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బ్యాండ్లతో బీచ్ రోడ్డులో కవాతు నిర్వహించారు. ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్ కంటిన్యూటీ డ్రిల్, ఎస్ సీసీ క్యాడెట్లు నృత్యం ప్రదర్శించారు. అనంతరం మిరుమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్ళు, లేజర్, డ్రోన్ షోలు తీరాన్ని వర్ణరంజితం చేశాయి.



గురువారం విశాఖలో జరిగిన నావికా విన్యాసాలను తిలకిస్తున్న గవర్నర్ నజీర్

# చేనేత స్టాళ్లను సందర్శించిన హోంమంత్రి అనిత

**సచివాలయం,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (ఆప్కో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్ళను గురువారం హోంమంత్రి అనిత సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల చేనేత కళాకారుల నైపుణ్యానికి ప్రతిరూపాలుగా నిలిచే ఉత్పత్తులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని మంత్రి అనిత పేర్కొన్నారు. పొందూరు ఖాదీ, వెంకటగిరి, ధర్మవరం పట్టుచీరల నుండి మంగళగిరి, బందరు, మాధవరం చేనేత వస్త్రాల వరకు అద్భుతమైన కలెక్షన్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.చేనేత రంగాన్ని ప్రోత్సహించడం, మన నేతన్నల శ్రమకు తగిన గుర్తింపు నివ్వడం మనందరి బాధ్యత అని మంత్రి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం,ఉత్పత్తుల ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని ఆమె స్పష్టంచేశారు. ఈ స్టాళ్ళు బడ్జెట్ సమావేశాలకు హాజరైన ప్రజాప్రతి నిధులు,అధికారులు మరియు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ని పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

# త్వరలో డిఎస్సీ జాబ్ కేలండర్

>> ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

**ఉగాది కానుకగా డీఎస్సీ నియామకాల ప్రకటన:** తెలుగు సంవత్సరాది ఉగాది పండగ సందర్భంగా ఉపాధ్యాయ నియామకాలకు ప్రకటన విడుదల చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి ఖాళీల వివరాలను పాఠశాల విద్యాశాఖ సేకరించింది. అన్ని రకాల పోస్టులు కలిపి 3 వేల 600 వరకు ఉండే అవకాశం ఉండనుంది. ఇందుకుగానూ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్లు, ఆదర్శ పాఠశాలలు, సంక్షేమ శాఖలకు చెందిన పాఠశాలల నుంచి ప్రాథమికంగా వివరాలు సేకరించారు. వీటి అన్నింటిలో కలిపి 1,200 వరకు ఖాళీలు రానున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీరాజ్, పురపాలక పాఠశాలల్లో 1,700 పోస్టులు ఉంటాయి. 700 వరకు ప్రత్యేక విద్యా పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. గతేడాది ఏప్రిల్ లో 16,347 పోస్టులకు ప్రకటన ఇచ్చారు. వీటిలో 15,941 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. కొన్ని పోస్టులకు రిజర్వేషన్ల అభ్యర్థులు లేకపోడం వల్ల అవి మిగిలి పోయాయి. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీని జాబ్ క్యాలెండర్ కింద విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

**పాలస్తీనా యుద్ధం కారణంగా జెరుసులెం యాత్రకు ఆస్కారం లేదు**

గతంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు ఎమ్మెల్యే. దీనిపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమాధానం ఇస్తూ.. క్రైస్తవ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని అనుకుంటున్నానని... ఎందుకు ఐదేళ్ల పాటు ఆ క్రైస్తవ భవన్ పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఆయన తనహయంలో నిధులు ఇవ్వలేదని అడిగారు. ఇప్పుడు కూటమి వచ్చింది కనుక త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం జరుగుతున్నందున జెరుసలేం యాత్రకు ఆస్కారం లేకుండా ఉందని మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

# అమరావతిలో 7 సంస్థలకు భూ కేటాయింపులు

>>ఈ కేటాయింపుల్లో ప్రధానంగా బ్యాంకులు, వివిధ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలకు చెందినవి ఉన్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో మొత్తం 22 అంశాలపై చర్చ జరిగిందని వీటిలో 7 కొత్త ప్రతిపాదనలు ఉన్నాయని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. మరో 11 ప్రతిపాదనల్లో మార్పులు చేయడం జరిగిందన్నారు. బ్యాంకులు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కోసం వారు భూమిని కొంత అడిగారు. అడిగిన వాటిని క్లియర్ చేశాం. అదే విధంగా ఇప్పటి వరకు కేటాయించిన భూముల్లో ఆయా సంస్థలు ఎంత వరకు పని మొదలు పెట్టారు అవి ఎక్కడి వరకు వచ్చాయి అనే దానిపై ఈ రోజు మంత్రులందరం చర్చించడం జరిగింది. 11 ప్రతిపాదనల్లో మార్పులు తెచ్చామని స్పష్టం చేశారు. బ్యాంకులు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కోసం అడిగిన వాటిని క్లియర్ చేశామని అన్నారు.సీఆర్డీఏ పరిధిలో భూకేటాయింపులపై ఈ భేటీలో చర్చించడం జరిగింది. మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యా రాణిలు ఈ భేటీలో పాల్గొన్నారు.

## శ్రీవారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీలేదు..

>> పొందేలా చర్యలు తీసుకున్నాం. తక్కువ ధరలకు సరుకులు కొని స్వామి వారికి నాణ్యత లేని నైవేద్యాలు, భక్తులకు అన్న ప్రసాదాలు అందించడం ఏంటి? అలాంటి ఆరోపణలు అసత్యాలని ప్రతి ఒక్కరికి అర్థం అవుతున్నాయి. ఈ విషయంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు. నెయ్యి ఒక్కటే కాదు అన్ని రకాల పదార్థాల్లోను నాణ్యతా ప్రమాణాలు పెంచాం.స్వామివారికి సమర్పించే వాటిలో శ్రీవారి భక్తులకు అందించే సౌకర్యాలలో డబ్బు ఎంత ఖర్చు అవుతుందనీ లెక్కలు వేసుకోవడం, వెనకడుగు వేసే ఆలోచన ఉండదు. అయినా ఇదంతా వెంకటేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన సొమ్మే.. ఆ దేవదేవుని సొమ్ముని నైవేద్యాలకు, అన్న ప్రసాదాలకు వాడే అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదని టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## జనాభా లెక్కలపై నేడు కీలక సమావేశం

>> శిక్షణ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈసమావేశంలో రాష్ట్ర స్థాయి సెన్సస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు,జిల్లా సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు వారితో పాటు ప్రతి జిల్లా నుండి జెసి లేదా డిఆర్ఓ స్థాయి అధికారులతో హాజరు కావాల్సిందిగా సిఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.అదే విధంగా వివిధ మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమీషనర్లు వారితో పాటు ఒక అదనపు కమీషనర్ లేదా డిప్యూటీ కమీషనర్ స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉంటుందని ఆదేశించారు.అంతేగాక సంబంధిత శాఖల కార్యదర్శులు,రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సస్ కమీషనర్ కార్యాలయ అధికారులు ఈసమావేశంలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు.ఈసమావేశానికి అన్ని జిల్లాల కలక్టర్లు రానున్న జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఆయా జిల్లాలకు సంబంధించిన ప్రాథమిక సన్నద్ధత వివరాలతో కూడిన పూర్తి సమాచారంతో హాజరు కావాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నడుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సచివాలయంలో అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సాయంత్రం 3గంటల నుంచి 6 గంటల వరకూ సచివాలయంలోనే కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశిస్తూ బుధవారం సీఎస్ విజయానంద్ ప్రత్యేక మెమో జారీ చేశారు.

## విద్యుత్ ఖాళీలు త్వరలోనే భర్తీ

>> 8770మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఏఈలు,లైన్ మెన్ల కొరత లేకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు లోవోల్టేజ్ సమస్యలు లేకుండా, నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.ఆ లక్ష్యానికి అనుగుణంగానే ఇంధనశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు.విద్యుత్ లోడ్ ఆధారంగా అవసరమైన చోట కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తున్నామని,అదేవిధంగా ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయాలను కూడాఏర్పాటు చేస్తున్నామని శాసనసభలో సభ్యులకు మంత్రి తెలిపారు.

## హెరిటేజ్‌పై ప్రచురించిన వ్యతిరేక కథనాలను వెంటనే తొలగించండి: ఢిల్లీ హైకోర్టు

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి చెందిన ఒక మీడియా సంస్థపై హెరిటేజ్ ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వైసింది. ఆ మీడియాపై రూ.వంద కోట్లకు హెరిటేజ్ సంస్థ దావా వేసింది. హెరిటేజ్‌పై ప్రచురించిన వ్యతిరేక కథనాలను వెంటనే తొలగించాలని కోర్టు ఆ వార్తా సంస్థకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కథనాలతో పాటు ప్రసారాల వీడియో లింక్‌లను కూడా తొలగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది. హెరిటేజ్‌కు వ్యతిరేకంగా ఎవరైనా రాసి ఉంటే.. వాటినీ తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

## ఇండోపసిఫిక్ వ్యూహానికి 'ఆసియాన్' కీలకం

>> రక్షణ కార్యకలాపాలతో సహా సంక్లిష్టమైన సముద్ర విన్యాసాలపై దృష్టి సారించాయన్నారు. ఆసియాన్‌ను భారతదేశం యొక్క ఇండోపసిఫిక్ వ్యూహానికి కేంద్ర స్తంభంగా అభివర్ణించిన రాజ్‌నాథ్ సింగ్, భాగస్వామ్య భద్రత ప్రాంతీయ శ్రేయస్సుకు పునాది అని మరోమారు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన 'ఆత్మనిర్భర్ భారత' ప్రయత్నాల కారణంగా పరిణతి చెందిన భారతదేశ రక్షణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ నుంచి ప్రయోజనం పొందాలని ఆయన అసియాన్ భాగస్వాములను ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. భారతదేశం 'బిల్డర్స్ నేవీ'గా పరివర్తన చెందడానికి చిహ్నాలుగా ఐఎనఎస్ విక్రాంత్, విశాఖపట్నంక్లాస్ డిస్ట్రాయర్లను ఆయన హైలైట్ చేశారు. 2025 చివరలో జరిగిన ఇండియాఆసియాన్ అనధికారిక సమావేశం నుంచి వచ్చిన భావాలను పునరుద్ఘాటిస్తూ, ఈ ప్రాంతంలో మొదటి ప్రతిస్పందనదారుగా భారతదేశం పాత్రను ఆసియాన్ ప్రతినిధులు ప్రశంసించారు. దీర్ఘకాలిక సముద్ర స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఆసియాన్ ఇండియా డిఫెన్స్ థింక్‌ట్యాంక్ ఇంటరాక్షన్ మరియు యువ తరాల నావికా అధికారులను పాల్గొనే చొరవల ద్వారా ఉమ్మడి కార్యకలాపాలను విస్తరించాలని రక్షా మంత్రి ప్రతిపాదించారు. 'సాహసం, సహకారం, సహకారం' అనే స్ఫూర్తితో, స్వేచ్ఛాయుతమైన, బహిరంగమైన, సమ్మిళితమైన ఇండోపసిఫిక్‌కు ఉమ్మడి నిబద్ధతతో ఈ సంభాషణ ముగిసింది.

# అన్నీ ఉచితంగా ఇచ్చేస్తారా?

## ఇదేం సంస్కృతి! నిధులు ఎలా?

## 'ఉచితా'లపై సుప్రీంకోర్టు ఆందోళన

## తమిళనాడులో ఉచిత విద్యుత్‌పై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఉచితాల తాయిలాలు ప్రకటనలు, హామీలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఉచిత ఆహారం, ఉచిత విద్యుత్తును అందించడం కొనసాగిస్తే రాష్ట్రాలు వాస్తవ అభివృద్ధికి ఎలా నిధులు సమకూర్చుకుంటాయో చెప్పాలని కోర్టు డిమాండ్ చేసింది. దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని వ్యాఖ్యనించింది. రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్నవారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సిజెఐ ప్రశ్నించారు. ఉచితాలను విచక్షణారహితంగా పంపిణీ చేయడం, ముఖ్యంగా యుటిలిటీలు, సేవలకు చెల్లించగలిగే వారికి, పని చేయకపోవడానికి ప్రతిఫలంగా కనిపించే సంస్కృతిని సృష్టించిందని కోర్టు హెచ్చరించింది. ఈ పథకాన్ని "చివరి నిమిషంలో" ఎందుకు ప్రకటించారో వివరించాలని కూడా కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విద్యుత్ పంపిణీ కంపెనీలు సుంకాలు, బడ్జెట్ లెక్కలను సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. "మనం దేశమంతటా ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాము?" "మీరు ఉదయం నుండి ఉచిత ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తే... తర్వాత ఉచిత సైకిల్... ఆపై ఉచిత విద్యుత్... ఇప్పుడు మనం ప్రజల ఖాతాలోకి నేరుగా నగదును బదిలీ చేసే దశకు చేరుకున్నాము... ఊహించుకోండి" అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. "సంక్షేమ వ్యవస్థలో భాగంగా, చెల్లించలేని వారికి అందించడం అర్థమయ్యేదే. కానీ మీరు ఆర్థిక స్థోమత ఉన్నవారు. ఆర్థిక స్థోమత లేనివారు అనే తేడా లేకుండా పంపిణీ చేస్తే... "విద్యను భరించలేని పిల్లలు ఉన్నారు. అప్పుడు రాష్ట్రం అందించాలి... అది రాష్ట్ర విధి. కానీ సంపన్నులు (కానీ ఇప్పటికీ) ఉన్నవారు ఏదైనా రకమైన ఉచితాన్ని ముందుగా వారి జేబులోకి తీసుకుంటారు. రాష్ట్రాలు ఈ విధాన చట్రాలను పునఃసమీక్షించాల్సిన సమయం కాదా?" అని ప్రధాన న్యాయమూర్తి అడిగారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## ఎసిబి కోర్టు నోటీసులు

>> రోడ్డు కేసులో నిందితులుగా అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ తదితరులు ఉన్నారు. ఈ కేసు మూసివేస్తున్నట్లు ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా కేసులో ఫిర్యాదుదారుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఈ కేసులో ఆయనకి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని నోటీసుల్లో ఏసీబీ కోర్టు తెలిపింది.

## చంద్రబాబు సర్కార్ అప్పుల్లో రికార్డు

>> ఇచ్చింది కేవలం 8,456 కోట్లు. దాదాపు 20 లక్షల మంది పిల్లలకు ఎగగొట్టారు. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడకు అయినా వెళ్లవచ్చు అని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉంటే 5 సర్వీసు లకు పరిమితం చేశారు. ఉచిత గ్యాస్ అని మరో మోసం రాష్ట్రంలో మొత్తంగా గ్యాస్ కనెక్షన్స్ 1.59 కోట్లు ఒక్కొక్కరికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు. ఏడాదికి మొత్తంగాను నాలుగు వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా బడ్జెట్‌లో కేటాయించింది 2600 కోట్లు. గ్యాస్‌లో కూడా బాకీ పెట్టారు.వ్యవసాయ రంగానికి అన్నదాత సుఖీభవ అన్నారు. మా హయాంలో చెప్పిన దాని కన్నా పెంచి ఇచ్చాం. కేంద్రం ఇచ్చేదికాకుండా మేమే 20వేలు ఇస్తామని చెప్పారు. 10,717 కోట్లు ఏడాదికి రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి ఇవ్వాలి. మొత్తం రెండేళ్లకు ఒక్కొక్కరికీ 40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 10వేల ఇచ్చారు. చాలా మందికి పథకంఎగరగొట్టారు. వ్యవసాయ మంత్రి 6300కోట్లు ఇచ్చామని అబద్దాలు చెప్తున్నారు. 21వేలు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు ఇచ్చారు.వరుసగా మూడవ బడ్జెట్‌లో కూడా కౌలు రైతుకు సున్నా. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 17 సార్లు విపత్తులు సంభవించాయి. చంద్రబాబు పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అందుబాటులో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వైసీపీ హయాంలో క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించడం వల్ల 54.55 లక్షల మంది రైతులకు జరిగిన మేలు 7802 కోట్లు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏ పంటకు ధర లేకపోయినా ప్రభుత్వం చేసింది శూన్యం. మా హయాంలో 3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి తెచ్చాం. ప్రతీ పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాం అని మాజీ సీఎం జగన్ అన్నారు.

## వారం - వర్జ్యం

20-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
తదియ మ.2.36
ఉత్తరాభాద్ర రా.8.05
వర్జ్యం : ఉ.7.35-9.07
దు.ఉ.8.52-9.39, 2) మ.12.46-1.33
శుభసమయం: ఉ.8.00-9.00, సా.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలోనివారి ఆరోగ్య విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. ఆర్థిక సర్దుబాట్లలో మీ వ్యూహాలు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**వృషభం:** ప్రజాసంబంధాలు మెరుగ్గా ఉంటాయి. నిర్మాణాత్మకమైన నిర్ణయాలను అమలు చేయుటకు తగిన వ్యక్తులను కలుస్తారు.

**మిథునం:** బరువైన కొన్ని బాధ్యతలను దించుకుంటారు. వెనువెంటనే కాకపోయినా మీ నిజాయితీ శ్రమ గుర్తింపుకు వస్తాయి.

**కర్కాటకం:** వ్యక్తిగత అవసరాలకు, సదుపాయాలకు ధనం అధికంగా ఖర్చు చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు రావచ్చు.

**సింహం:** కుటుంబసభ్యుల సహాయ సహకారాలను అందుకుంటారు. ప్రేమ విషయాలలో పురోగతి సాధిస్తారు.

**కన్య :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. మీరంటే ఓర్చుకోలేనివారితో ఈ రోజు కొంత ఇబ్బందికి గురవుతారు.

**తుల :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. వ్యాపారంలో ఆశ్చర్యకరమైన మలుపులు.

**వృశ్చికం:** ప్రభుత్వపరంగా రావలసిన ఆర్డర్స్ చేతికందుతాయి. కుటుంబ బరువు బాధ్యతలు అధికం అవుతాయి.

**ధనుస్సు:** మధ్యవర్తి వ్యవహారాలు లాభించవు. గతంలో సహాయం చేసిన ఒకరికి తిరిగి మీరు ప్రత్యుపకారం చేస్తారు.

**మకరం:** ప్రత్యర్థి వర్గంలో గ్రూపు రాజకీయాలను మీకు అనుకూలముగా మార్చుకోవడానికి వ్యూహాలను పన్నుతారు.

**కుంభం:** మీ స్వయంకృషి వల్ల, శక్తి సామర్థ్యాల వల్ల కార్యాలయంలో ప్రతిష్టాత్మకమైన ఒక ఉన్నత స్థానాన్ని సంపాదించుకోంటారు.

**మీనం:** మానవత్వం అక్కడక్కడా మిగిలి ఉందని ఋజువుచేసే విధంగా కొన్ని సంఘటనలు జరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అమరావతిలో క్యాట్ శాశ్వత బెంచ్ రాష్ట్ర ప్రభుత్వ చర్యలు

విజయవాడ, ఫిబ్రవరి 18 ప్రభాత వార్త ప్రతినిధి: అమరావతిలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ సర్క్యూటివ్ శాశ్వత బెంచ్ ఏర్పాటుకు భూ కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ఆ సంస్థ తెలిపింది. విజవయాడలోని క్యాట్ బెంచ్ ఏర్పాటు చేసిన ఏడాది కాలంలో 1420 కేసులు పరిష్కరించినట్లు పేర్కొంది. 50 రోజుల సిట్టంగ్‌లో కేసుల పరిష్కారం 146 శాతంగా నమోదైనట్లు వివరించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అమరావతిలో శాశ్వత బెంచ్ ఏర్పాటు చేస్తే కేసుల పరిష్కారం మరింత సులభతరం అవుతుంది. ఏపీ పరిధిలోని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రభుత్వ పింఛన్‌దారులు తమ సేవలకు సంబంధించిన వివాదాల్లో విజయవాడ బెంచ్ ద్వారా సత్వర న్యాయం పొందుతున్నారు. ప్రతి నెల మూడో వారంలో ఏడు రోజుల పాటు ఇక్కడ విచారణ జరుగుతోంది.

హైదరాబాద్ బెంచ్ నుంచి సభ్యులు, సిబ్బంది వస్తున్నారు అని క్యాట్ ప్రస్తావించింది. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ మెంబర్లు వీఎస్‌కే కౌముది, ఆన్‌లైన్ ద్వారా శాలిని మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2027కి రాజధానిలోని ప్రధాన రహదారులు పూర్తి

## అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించిన మంత్రి నారాయణ



విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధానిలోని ప్రధాన రహదారులు (ట్రంక్ రోడ్లు) ఏప్రిల్ 2027కి పూర్తి చేసేందుకు ప్రణాళిక చేశామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మొదటి దశలో 67.6 కిలోమీటర్ల నిర్మాణం, గుంటూరు జిల్లాలో 14, పల్నాడులో 3, కృష్ణాలో 6, ఎన్టీఆర్‌లో జిల్లాలో 3 గ్రామాలు, మొత్తం 26 గ్రామాల ద్వారా నిర్మాణం జరుగుతుంది. దీనికోసం డీపీఆర్ కూడా సిద్ధమయ్యింది. ఈ నిర్మాణానికి భూ సమీకరణ కూడా ప్రారంభించాం. ఆరు నెలల్లో భూ సమీకరణ పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. 2027 నాటికి ట్రంక్ రోడ్ల నిర్మాణం పూర్తవుతుందన్నారు. శాసనసభలో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులో 96.2. కి.మీ పొడవు, 75 మీటర్ల వెడల్పుతో 8+4 వరసల రోడ్డు నిర్మాణానికి డిజైన్ చేశామని మంత్రి తెలిపారు. దీని నిర్మాణం రెండు ఫేజ్‌లలో జరుగుతుందని, అది పీపీపీ విధానంలో చేపట్టినట్లు తెలిపారు. రాజధానిలోని ట్రంక్ రోడ్ల మౌలిక సదుపాయాలు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్, వివిధ సంస్థల ద్వారా రూ. 40,847 కోట్లు సమకూర్చామని మంత్రి వివరించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం భూ సమీకరణ అయ్యాక అభివృద్ధి కోసం కనీసం 24 నుంచి 30 నెలల సమయం పడుతుందన్నారు. మొదటి ఫేజ్‌లో కేతనకొండ నున్న వరకు, రెండో ఫేజ్‌లో నున్నకేతనకొండ వరకు నిర్మాణం జరుగుతుందని మంత్రి నారాయణ వివరించారు.

### వ్యవసాయానికి 200-500 యూనిట్లు ఉచితం

రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 22,30,703 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు డిస్కంల పరిధిలో 1,02,538 కనెక్షన్లు ఇచ్చామన్నారు. వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న 46 వేల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు ఉచిత వ్యవసాయ కనెక్షన్ల కోసం రూ. 839.44 కోట్లు ఖర్చు చేశామన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో 2,61,481 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామని వివరించారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వానికి రూ. 1,059 కోట్లు ఆదా అవుతుందన్నారు. ఏప్రిల్ నుంచి వీవర్స్‌కు 200 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్‌ల కొరతపై బండారు సత్యానందరావు అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇస్తూ ఆ పోస్టుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్‌లు 581, జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 260, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు 1084, లైన్‌మెన్ పోస్టుల్లో 22 ఖాళీలు ఉన్నాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవల కోసం త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం అవుట్ సోర్సింగ్ విధానంలో 8770 మంది పని చేస్తున్నారన్నారు. లోడ్ ఆధారంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

### బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు

ఈ బడ్జెట్ ప్రతిపాదనలు చంద్రబాబు విజనరీ, పవన్‌కల్యాణ్ స్ఫూర్తిని రంగరించుకుని చేసినట్లు ఉందని బడ్జెట్‌పై చర్చలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. వైద్యారోగ్య రంగంలో గతంలో ఎన్నడూలేనంత అభివృద్ధి చేశారన్నారు. విద్యారంగంలో మంత్రి లోకేష్ చేస్తున్న కృషి మరువలేనిదని, ఇదొక సువర్ణ అధ్యాయం అని తెలిపారు. సామాన్యుడికి విద్యా విధానం, ప్రతి మండలంలోనూ ఒక డిగ్రీ కళాశాల ఉండేలా చూడాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. వెనుకబడి తరగతుల వారికి, గిరిజనులకు బడ్జెట్ కేటాయింపులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ.. జలవనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్రం ముందుకెళుతుందని, అయితే అదే సందర్భంలో జలవనరులశాఖలో పూర్తికాని ప్రాజెక్టులు చాలా ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేయడం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వాడుకోవడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. పెట్టుబడి ఖర్చును రూ.48 వేల కోట్లని చెప్పి రూ.33 వేల కోట్లకు సవరించారని అన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దెబ్బతీసిందని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాలనలో రాష్ట్రం ముందుకెళుతోందని అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గత పాలన మొత్తం అప్పులతో సాగిందని, దివాళా తీసిందని అన్నారు. బంగారు బాతులాంటి అమరావతిని సర్వనాశనం చేశారని తెలిపారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలే లేకండా నెయ్యి తయారు చేశారని, దేవుడికి చేసిన తప్పుకు అధికారం కోల్పోయారని అన్నారు. ధాన్యంకూడా సరైన రీతిలో కొనుగోలు చేయకుండా రైతులను వైసిపి పాలకులు మోసం చేశారని అన్నారు. కొవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ద్వారా విద్యార్థులకు కడుపునిండా అన్నం పెడుతున్నామని అన్నారు. ఇటువంటి పాలన గతంలో ఎన్నడూ జరగలేదని తెలిపారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆరోగ్యం కూడా సమాజానికి అవసరమని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన విద్యార్థులకు ఆరోగ్యం, విద్య అత్యంత అవసరమని అన్నారు. సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రతి మహిళా అభివృద్ధి చెందేందుకు వీలుగా ఉందని అన్నారు.

## తిరుమల సమాచారం



### మార్చి 3వరకు పుష్కరిణిలో స్నానాలు రద్దు

#### - భక్తులు టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి

తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని తెప్పోత్సవాలు ఆరంభానికి ముందే నేటి నుండి మార్చి 3వతేదీ వరకు స్వామిపుష్కరిణిలో భక్తులకు స్నానాలు టిటిడి రద్దుచేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 26నుండి జరిగే తిరుమలేశుని తెప్పోత్సవాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నందున, పుష్కరిణిలో తెప్ప సిద్ధమవడంతో పవిత్రంగా భావించేందుకు పుష్కరిణిలో స్నానాలు రద్దుచేశారు. తెప్పోత్సవాలకు పుష్కరిణీ, తెప్పలకు ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణ, వరహా స్వామి ఆలయం, నాలుగు మాడ వీధుల్లో పందిళ్ల ఏర్పాటు. భక్తులకు సూచనలు అందించేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.



### అంతా మంచి జరగాలనివేడుకున్నాం

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచిజరగాలని, భక్తులకు సకల సౌకర్యాలు టిటిడి అధికారులు కల్పించారని పలువురు ప్రముఖులు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో తిరుమలలో సౌకర్యాలు మెరుగుపడ్డాయని సినీనటుడు చరణ్‌రాజ్ తెలిపారు. గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో తెలంగాణ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, సినీనటుడు చరన్‌రాజ్, సంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణి, సినీనటి రమ్యశ్రీ,సినీనటి త్రిషవేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం లోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా వేకువజామున తోమాలసేవలో సినీనటి శ్రియాశరణ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల వీరిని చూడటానికి, ఫోటోలు దిగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

## స్వార్థ రాజకీయాల కోసమే హెరిటేజ్‌పై వైకాపా తప్పుడు ఆరోపణలు

### - మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: వైకాపా నేతలు హెరిటేజ్ సంస్థపై బురద చల్లుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శాసన మండలిలో ప్రజా సమస్యలు గురించి చర్చించాల్సిన సమయాన్ని స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. శ్రీవారి లడ్డూ కల్తీ పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేసేవారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణ పనుల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బిసి(శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) సొరంగ నిర్మాణ పనుల పునః ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో ట్రయల్‌రన్ కూడా విజయవంతంగా పూర్తయింది. మన్నెవారిపల్లి ఔట్‌లెట్ నుంచి సొరంగంలోపల 20 కిలోమీటర్లు దాటిన తర్వాత బ్లాస్టింగ్ చేపట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 5 మీటర్ల మేర విజయవంతంగా బ్లాస్టింగ్‌ను అధికారులు పూర్తి చేశారు. టన్నెల్‌లోపల బ్లాస్టింగ్ ద్వారా వచ్చే మట్టి, రాళ్లను బయటకు తీసుకురావడంపై అధ్యయనం కొనసాగుతోంది. ఏడాది క్రితం ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ఘోర ప్రమాదం మిగిల్చిన చేదు ఘటనను అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ కొత్త వ్యూహంతో సొరంగ నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది.

# చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా?: మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా? అంటూ శాసన మండలిలో వైసీపీ సభ్యుల వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దురుద్దేశంతో వైసీపీ సభ్యులు ఆందోళనలు చేపడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్‌కు ఎక్కడా ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా స్పష్టంగా సమాధానం ఇచ్చినప్పటికీ, అదే అంశాన్ని మళ్లీ మళ్లీ తీసుకొచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు.

**ఆధారాలుంటే చూపండి:** ఇందాపూర్‌కు హెరిటేజ్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు, ఒక్క చిన్న ఆధారం అయినా చూపించాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. కానీ ఆధారాలు చూపకపోగా, బయట ప్రెస్‌మీట్లు పెట్టి చీజ్ ప్యాకెట్లు చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చీజ్,నెయ్యి మధ్య తేడా కూడా తెలియకుండా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఈ తప్పుడు ప్రచారంపై హెరిటేజ్ సంస్థ బొత్సకు లీగల్ నోటీసులు ఇచ్చిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆధారాలుంటే చర్చిద్దాం, లేకపోతే అసత్య ప్రచారాన్ని ఆపాలని హెచ్చరించారు. హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని వ్యాపార లావాదేవీలు జరపకూడదని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు.

ప్రభుత్వాల పేరుతో డబ్బులు దోచుకునే సంస్కృతి హెరిటేజ్‌ది కాదని, గతంలో ప్రభుత్వ ధనాన్ని భారతి సిమెంట్ పేరుతో దోచుకున్న చరిత్ర వైసీపీకి మాత్రమే ఉందని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నేతల చర్యలు ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్‌ను ఎలా అరికట్టామో అలాగే ఇప్పుడు కూడా ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ప్రయత్నాలను సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. చీని తోటలు కట్ చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి పాత పద్ధతులే ఇప్పుడు సంస్థలపై బదనాం చేయడంగా మారాయని మండిపడ్డారు. శాసనమండలిలో ప్రతిరోజూ ఒకే అంశాన్ని తీసుకొచ్చి వాయిదా తీర్మానాలతో సభను ఇబ్బందికి గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి హెచ్చరించారు. ఆధారాలుంటే టేబుల్‌పై పెట్టండి, లేదంటే అసత్య ప్రచారం మానేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## 200 మందికి ఉచితంగా మూడేళ్లపాటు సివిల్స్‌లో శిక్షణ

విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల స్వీకరణ బ్రోచరు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార శాఖ మంత్రి పార్థసారధి సచివాలయంలో గురువారం విడుదల చేశారు. మంత్రి సత్యకుమార్ చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. చలసాని బలరామప్రసాద్ అకాడమీ ద్వారా ఎంపిక కాబోయే 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు ఉచిత వసతి, శిక్షణ ఇవ్వడాన్ని మంత్రులు స్వాగతించారు. యుపిపిఎస్‌సి, ఎపిపిఎస్‌సి ఇతర ఉద్యోగ నియామకాలకు అభ్యర్థులను సన్నద్ధం చేస్తామని డాక్టర్ లక్ష్మయ్య వెల్లడించారు. 200 మందిలో వంద మంది అమ్మాయిలు ఉంటారన్నారు. వచ్చే నెల 15న అమ్మాయిలు, ఏప్రిల్ 5న యువకులకు రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

## నాలుగు కార్మిక కోడ్‌ల అమలుపై అభిప్రాయాలను ఆహ్వానించిన కార్మిక శాఖ

విజయవాడ, ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌ల అమలు ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించింది. ఈ సంస్కరణలు కార్మిక చట్టాలను సరళీకరించి ఆధునీకీకరించడం లక్ష్యంగా చేపట్టినవని శాఖ తెలిపింది. కార్మికుల హక్కులను రక్షిస్తూ, పరిశ్రమలకు సులభతరమైన వాతావరణం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సమీకరించింది. అవి- కోడ్ ఆన్ వేజెస్, 2019: ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020: కోడ్‌ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020: ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్, 2020: ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక మార్పులు, మారుతున్న ఉపాధి విధానాలకు అనుగుణంగా ఈ కోడ్‌లు రూపొందించబడ్డాయి. అనేక చట్టాలను నాలుగు సమగ్ర కోడ్‌లుగా మార్చడం, సింగిల్ రిజిస్ట్రేషన్, సింగిల్ లైసెన్స్, సింగిల్ రిటర్న్ విధానం ద్వారా అనుసరణ భారాన్ని తగ్గించడం ముఖ్య లక్ష్యాలు. కనీస వేతనాలను అందరికీ వర్తింపజేయడం, వేతన రక్షణను బలోపేతం చేయడం, అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు సామాజిక భద్రత విస్తరించడం కూడా ఈ సంస్కరణల భాగం. డిజిటల్ వ్యవస్థలు, వెబ్ ఆధారిత తనిఖీలు ద్వారా పారదర్శకత పెంపు, కొన్ని నేరాలకు శిక్షణ సరళీకరణ, వివాదాల పరిష్కారానికి వ్యవస్థీకృత విధానాలు, కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమానికి మెరుగైన నిబంధనలు ఈ కోడ్‌లలో ఉన్నాయి. 2025 డిసెంబర్ 30న కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ రూల్స్‌ను విడుదల చేసింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020, కోడ్ ఆన్ వేజెస్, 2019 కింద ప్రాథమకి నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్లు కార్మిక శాఖఅధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగులు, కార్మికులు, యజమానులు, ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమ సంఘాలు, వృత్తి సంఘాలు, పౌర సమాజ సంస్థలు, సాధారణ ప్రజలు డ్రాఫ్ట్ నిబంధనలను పరిశీలించి, సూచించిన గడువులోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కార్మిక శాఖ కోరింది. అభ్యంతరాలు, సూచనలు లిఖితపూర్వకంగా కమిషనర్ ఆఫ్ లేబర్‌కు లేదా నోటిఫికేషన్ పేర్కొన్న అధికార ఇమెయిల్/ పోర్టల్ ద్వారా పంపవచ్చు. గడువులోగా వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి తుది నియమాలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు. కార్మికులు, పరిశ్రమలు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్యంగా అమలు చేయడమే ఈ సంప్రదింపుల లక్ష్యమని శాఖ స్పష్టం చేసింది. సూచనలు సమర్పించేందుకు చివరి తేదీ 15 మార్చి 2026 కాగా, కోడ్ ఆన్ వేజెస్, 2019కు సంబంధించిన సూచనలు సమర్పించేందుకు 30 మార్చి 2026ను గడువుగా నిర్ణయించారు.




## 28న టిటిడి బోర్డు సమావేశం

**ఖరారైన ముహూర్తం!**

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాత వార్త ప్రతినిధి: ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కీలకమైన అభివృద్ధిపనులు చేపట్టేందుకు, అవసరమైన ముడిసరుకులు కొనుగోళ్ళకు అనుసరించాల్సిన విధానం, టెండర్ల ఆమోదం వంటి అంశాలు చర్చించేందుకు ఈనెల 28న శనివారం టిటిడి బోర్డు సమావేశం కానుంది. ఈ సమావేశంలో వేదాశీర్వచనం భక్తులకు అందించే మేల్‌ఛాట్ వస్త్రాలు కొనుగోలు, మార్కెటింగ్ విభాగంలో ముడిసరుకుల కొనుగోలుకు టెండర్లుతోబాటు రానున్న విద్యాసంవత్సరంలో టిటిడి విద్యాసంస్థల్లో విద్యాబోధన, హాస్టల్స్ భవనాల నిర్మాణం, మరింత మెరుగ్గా మధ్యాహ్న భోజనం అమలు వంటి కీలక అజెండా చర్చించే అవకాశం ఉంది. టిటిడి బోర్డు సమావేశంలో ఇప్పటికే రెండు దఫాలు వాయిదాపడింది. సాధారణంగా ఫిబ్రవరి/ మార్చిలో జరిగే టిటిడి బోర్డు సమావేశం వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ప్రతిపాదనలు, ఆమోదం తోబాటు పలు కీలక నిర్ణయాలు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరుపై చర్చించడం జరుగుతుంది. ఈనెల 3వ తేదీ టిటిడి బోర్డు సమావేశం జరగాల్సి ఉండగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ బదలీతో వాయిదా పడింది. మళ్ళీ 23న జరిగేలా అజెండా రూపొందించారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో చివరకు 28వ తేదీకి మార్పుచేశారు. మరీ 2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు ఉంటాయా, ఉద్యోగాల భర్తీ, టెండరు ప్రక్రియ వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. మేల్‌ఛాట్ వస్త్రాల కొనుగోళ్ళకు టెండర్ల అమోదం తెలపనున్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

T.N.No.01/2025-26/CE/SE(WSM)/EE(WSM-II), Dt: 12.02.2026 (2nd Call)
Number of Works : 01 (One), Value of Works : Rs.389.90 Crores
Downloading starting Date : 13.02.2026 @ 5.00 PM
Last date for Submission of bid : 05.03.2026 @4.00 PM
Further Details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (WSM-II) Division.
Cell No.: 81878 98428.
For Commissioner

**బహిరంగ ప్రకటన**

మహీంద్రా & మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (MMFSL) వారు ఇందుమూలముగా ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, MMFSLచే 1,583 వాహనాలు (వెబ్‌సైట్ లింక్: కస్టమర్ డిస్‌క్లోజర్స్ మహీంద్రా ఫైనాన్స్ వద్ద పూర్తి జాబితా అందుబాటులో) పోర్టల్ (eDIIG) ద్వారా మరియు ఆఫ్‌లైన్ పద్ధతిలో MMFSLచే వేలం వేయబడినది. మరియు అవి మహీంద్రా ఫస్ట్ ఛాయిస్ వీల్స్ లిమిటెడ్ (MFCWL) ("Vehicles") యొక్క వివిధ యార్డ్‌ల వద్ద ప్రస్తుతం పార్క్ చేయబడి ఉన్నవి. ఆ ప్రకారంగా, MFCWLకు చెల్లించవలసిన పార్కింగ్ ఛార్జ్‌లు, ఆ సంబంధిత తిరిగి పొందబడిన/ వేలం వేయబడిన వాహనం(లు) యొక్క పార్కింగ్ తేదీ నుండి పోగుపడుతున్నాయి. వేలం అయినప్పటికీ కొనుగోలుదారులు MMFSL నుండి క్రింది వాటికి పరిమితి లేని కలిసివున్న కారణాల వలన వాహనాలను స్వాధీనం చేసుకోవటంలో విఫలమైనారు.

- వేలానికి అనుసరించిన పూర్తి పరిగణన చెల్లింపు చేయకపోవడం
- పార్కింగ్ ఛార్జ్‌లు చెల్లించకపోవడం
- చెల్లింపు తర్వాత కూడా డెలివరీ తీసుకోవడంలో వైఫల్యం
- కొనుగోలుదారుడు లేదా ఇతర సంబంధీకులు మరణించడం

ఆ ప్రకారంగా వాహనం(లు)కు సంబంధించి టైటిల్ (యజమానత్వం) లేదా ఏదైనా అందులోని భాగం క్లెయిమ్ చేసే సంబంధిత కొనుగోలుదారులు అందరికీ ఈ ప్రకటన యొక్క తేదీ నుండి 15 (పదిహేను) రోజులలోపుగా సంబంధిత వారి వాహనం(లు) వేలానికి పూర్తి పరిగణనను చెల్లించడం ద్వారా (వర్తించినట్లయితే) వారి వాహనాలను స్వాధీనం చేసుకోవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది మరియు MMFSLకు చెల్లించవలసిన ఇతర ఏవైనా బకాయిలు మరియు పార్కింగ్ ఛార్జ్‌లు ఈ క్రింద పేర్కొన్న డాక్యుమెంట్లు దాఖలు చేయటంచే చెల్లించవలెను.

- చెల్లింపు యొక్క రుజువు మరియు సంబంధిత డాక్యుమెంట్లు
- స్వయం-ధృవీకరణ KYC (ఆధార్, పాన్ వగైరా)
- MMFSLచే అభ్యర్థన ప్రకారం వాహనం(లు)కు సంబంధించిన టైటిల్‌కు చెందిన డాక్యుమెంట్లు
- MMFSLకు పార్కింగ్ ఛార్జ్ సంబంధిత చెల్లింపు రసీదు

అన్ని క్లెయిమ్‌లు మరియు డాక్యుమెంట్లు ఇక్కడ పేర్కొనబడిన విధంగా సమయ వ్యవధిలోగా MMFSLకు దాఖలు చేయవలెను.

ఇందులో పైన పేర్కొనబడిన సూచనలను నిర్దేశిత సమయంలో అమలు చేయటంలో విఫలమైతే MMFSL ఎటువంటి తదుపరి నోటీస్ లేకుండా సదరు వాహనాలు లేదా వాటిలో ఏదైనా భాగం తిరిగి వేలం వేసే హక్కు వినియోగించుకుంటుంది. మరియు సదరు వ్యక్తులకు ఆ తర్వాత ఎటువంటి హక్కు మరియు/వాహనం(లు) సంబంధించిన టైటిల్ లేదా మరియు హక్కు ఉండదు.


తిరిగి వేలం వేయటం వలన వచ్చే ప్రొసీడ్స్ పేరుకుపోయిన యార్డ్ పార్కింగ్ ఛార్జ్‌లు మరియు MFCWLకు లేదా ఏదైనా థర్డ్ పార్టీకి చెల్లించవలసిన బకాయిలకు ఆ సొమ్ము మొదట వినియోగించబడుతుంది. వాహనం(లు)కు సంబంధించి ఆపై MMFSLకు చెల్లించవలసిన, పరిగణన బకాయి సొమ్ముగా తీసుకోబడుతుంది. ఏదైనా మిగులు సొమ్ము ఉంటే చట్టబద్ధమైన యజమానికి, డాక్యుమెంటరీ నిరూపణ స్వీకరించి రిఫండ్ ఇవ్వబడుతుంది. మరియు MMFSL లేదా దాని ప్రతినిధులచే శ్రద్ధా పూర్వక ప్రయత్నంతో నిర్వర్తించబడుతుంది. ఒకవేళ చెల్లింపుకు సొమ్ము తక్కువైతే సంబంధిత వ్యక్తి(లు) నుండి ఆ మొత్తం రికవరీ చేయబడుతుంది. ఎటువంటి పరిస్థితులలోను పైన పేర్కొనబడిన నిర్దేశిత సమయం తర్వాత ఎటువంటి క్లెయిమ్‌లు పరిగణించబడవు.

ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ Prafull.Ruke1@mahindrafinance.com వద్ద Long parked vehicle: సబ్జెక్ట్‌తో చేయవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

మహీంద్రా & మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కొరకు మరియు తరపున

# వేదాశీర్వచనానికి మేల్‌ఛాట్ వస్త్రాల కొరత!

## - వేదపండితుల ఆశీర్వచనం కోసం ప్రముఖుల తాకిడి



తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుంటున్న ప్రముఖులు, విఐపి బ్రేక్ ప్రోటోకాల్ ముఖ్యులు అందుకునే వేదపండితుల ఆశీర్వచనాలకు మేల్‌ఛాట్ వస్త్రాల కొరత కనిపిస్తోంది. ప్రతిరోజూ ప్రోటోకాల్ విఐపి బ్రేక్‌లో పదిమంది వరకు ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితుల వేదాశీర్వచనం అందుకోవడం జరుగుతుంది. ఇందుకు రూ 3వేలు వేదాశీర్వచనం సేవా టిక్కెట్ ముందుగానే కొనుగోలుచేస్తారు. ఈ టిక్కెట్లను తిరుమలలో బ్రేక్ టిక్కెట్లతోబాటు అదనపు ఇఒ కార్యాలయంలో జారీచేస్తారు. రోజువారీగా ఇరవైవరకు వేదాశీర్వచనం టిక్కెట్లు జారా అవుతున్నా రెండురోజులు మేల్‌ఛాట్‌వస్త్రాలు కొరతతో ఈ సంఖ్య కుదించినట్లు ఆలయ వర్గాల సమాచారం. బుధవారం కేవలం ఐదు టిక్కెట్లు మాత్రమే వేదాశీర్వచనం మంజూరైందనేది తెలుస్తోంది. ఇందుకు ఈ సేవా భక్తులకు అందజేసే పట్టువస్త్రాలు అవసరమైన మేరకు నిల్వలేకపోవడమే కారణమనేది చెబుతున్నారు. గతంలో ఈ వస్త్రాల కొనుగోళ్ళలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని, తక్కువ ధరకే కొనుగోలుచేయాల్సిన మేల్‌ఛాట్‌వస్త్రాలను అధిక ధరకు టెండర్‌లు ఇచ్చినా నాసిరకం వస్త్రాలు అనేది భక్తుల్లో ఆరోపణలు. దీంతో గత టెండర్లను ఇప్పుడు టిటిడి బోర్డు రద్దుచేసిన విషయం తెలిసిందే.

ప్రతిరోజూ తిరుమలకు పెద్దసంఖ్యలోనే ప్రోటోకాల్ ప్రముఖులు, ప్రముఖులు వస్తుంటారు. తిరుమలకు వచ్చిన సందర్భంలో వారికి మర్యాదపూర్వక స్వాగతం పలకడంతోబాటు వేదాశీర్వచనం చేసుకుంటే మేల్‌ఛాట్ వస్త్రాలను బహుమానంగా అందిస్తారు. మార్కెట్లో నాణ్యమైనవి కూడా 300-350రూపాయలు ఉండగా ఈ శాలువలను గత టిటిడి బోర్డులోని పెద్దలు, ప్రొక్యూర్‌మెంట్‌సెల్ కమిటీలోని అధికారులు ఏకంగా నాలుగురెట్లు పెంచి 1,300రూపాయలు వెచ్చించి కొనుగోలుచేశారనేది ఇటీవల ప్రస్తుత బోర్డు తేల్చిన లెక్కలు. ఈ నేపథ్యంలో టెండర్లను రద్దుచేయడంలో శాలువాల కొరత ఏర్పడింది. ఇప్పటికే ఈ టెండర్లు ఆమోదించాల్సి ఉండగా బోర్డు సమావేశం జాప్యం కారణంగా మేల్‌ఛాట్‌వస్త్రాల కొనుగోళ్ళ టెండర్లకు కాలయాపన జరిగింది. ఈనెల 28వతేదీ జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ అంశంచర్చకు రానుంది.

# త్వరలో ఔటర్ రింగ్ రోడ్డు

## స్థానిక నాయకులతో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: హిందూపురంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్నందున ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని బాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఉదయం క్యాంపు కార్యాలయంలో స్థానిక టిడిపి నాయకులు కలిసి మాట్లాడారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా బాలయ్య వివరాలు వెల్లడించారు. ఇప్పటికే తాను కేంద్ర మంత్రి గడ్కరీ తో మాట్లాడానని డిపిఆర్ రూపొందించి పంపాలని అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు వచ్చాయన్నారు. అభివృద్ధిలో ఏపీలో హిందూపురానికి ఐదవ స్థానం రావడా నికి నాయకులు కార్యకర్తలు అధికారుల కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే అభినందించారు. దాదాపు అన్నిచోట్ల రహదారులు డ్రైనేజీలు నీటి వసతి మొదలగు అన్ని సదుపాయాలను కల్పిస్తూ శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొ న్నారు. నాయకులు మంగేష్, జిల్లా మాజీ అధ్యక్షులు అంజనప్ప, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాగరాజు, ఆనంద్ కుమార్, అమర్నాథ్, చంద్రమోహన్ యాదవ్, అబూ బకర్, రాఘవేంద్ర, యుగంధర్ ఉన్నారు.

అసాధారణం
పార్ట్-II-సెక్షన్ 3-సబ్-సెక్షన్ (ii)
**రైల్వేల మంత్రిత్వ శాఖ**
(దక్షిణ మధ్య రైల్వే)
**సవరణ**
సికింద్రాబాద్, తేది 5వ ఫిబ్రవరి, 2026

PUB/1984/26

S.O. 663 (E)."ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడ జిల్లాలో లెవెల్ క్రాసింగ్స్ బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి యొక్క నిర్మాణం" S.O. 2731 (E) ప్రకారం S.O 1548 (E) & తేదీ 19వ జూన్ 2025 ప్రకారం 1వ ఏప్రిల్ 2025 తేదీ సబ్-సెక్షన్ (ii), సెక్షన్-3, పార్ట్-II, గెజిట్ ఆఫ్ ఇండియా అసాధారణలో ప్రచురితమైన రైల్వేల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క ప్రకటనలో. ఇందుమూలముగా రైల్వేల మంత్రిత్వ శాఖ క్రింద వివరింపబడిన విధంగా క్రింది సవరణ చేస్తోంది.

ఈ విధంగా ప్రచురితం :

| క్ర. సం. | ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ | రాష్ట్రం | జిల్లా | భూసేకరణ కొరకు సమర్థ ప్రాధికారి |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1 | మేడుపాడు స్టేషన్ యార్డ్ మధ్యలో 619/20-22 కిమీ. వద్ద లెవెల్ క్రాసింగ్ నం. 422 బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి యొక్క నిర్మాణం | ఆంధ్రప్రదేశ్ | కాకినాడ | రెవెన్యూ డివిజనల్ అధికారి, కాకినాడ |
| 2 | సామర్లకోట జంక్షన్ యార్డ్ వద్ద 629/1-3 కిమీ. వద్ద నం.426 లెవెల్ క్రాసింగ్ బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి యొక్క నిర్మాణం | ఆంధ్రప్రదేశ్ | కాకినాడ | రెవెన్యూ డివిజనల్ అధికారి, కాకినాడ |

ఈ విధంగా చదవాలి :

| క్ర. సం. | ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ | రాష్ట్రం | జిల్లా | భూసేకరణ కొరకు సమర్థ ప్రాధికారి |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1 | మేడుపాడు స్టేషన్ యార్డ్ మధ్యలో 619/20-22 కిమీ. వద్ద లెవెల్ క్రాసింగ్ నం. 422 బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి యొక్క నిర్మాణం | ఆంధ్రప్రదేశ్ | కాకినాడ | రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దాపురం |
| 2 | సామర్లకోట జంక్షన్ యార్డ్ వద్ద 629/1-3 కిమీ. వద్ద నం.426 లెవెల్ క్రాసింగ్ బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి యొక్క నిర్మాణం | ఆంధ్రప్రదేశ్ | కాకినాడ | రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దాపురం |

[F.No. RSP/SC/Gazette/7A/BZA-VSKP/BZA/Corr/01]
మనోజ్ కుమార్, చీఫ్ ఇంజనీర్/C/RSP
A2519

# వార్త

తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మాత్రమే మూర్ఖులు చేస్తుంటారు.

-విలియం కాంటన్

## తరలిపోతున్న ఎర్ర చందనం!

ఎన్ని చట్టాలు చేసినా, ఎంతమంది అధికారులను నియమించినా, మరెన్నిసార్లు హెచ్చరించినా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎర్రచందనం తరలిపోతూనే ఉన్నది. పట్టుబడిన స్మగ్లర్లపై కేసు నమోదు చేస్తూనే ఉన్నారు. జైళ్లకు పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్పులకు కూడా వెనుకాడడం లేదు. అయినా ఇవేమీ ఈ స్మగ్లింగును ఆపలేకపోతున్నాయి. అరుదైన ఎర్రచందనం వృక్షసంపదను కాపాడేందుకు ఏకంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని హంగులు కూడా కల్పించారు. ప్రాణాలకు తెగించి సిబ్బంది కూడా రాత్రింబవళ్లు శక్తిమేరకు కృషి చేస్తూనే ఉన్నారు. ఏకంగా పదుల సంఖ్యలోస్మగ్లర్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేతిలో గతంలో మరణించినా ఏ మాత్రం వెరవడం లేదు. అప్పుడప్పుడు తాత్కాలికంగా ఆగినట్లు కన్పించినా ఏదో ఒక దారిలో కళ్లుగప్పి తరలిపోతూనే ఉన్నది. ఇటీవల దాడుల్లో బయటపడుతున్న ఎర్రచందనం దుంగలు, పట్టుబడుతున్న స్మగ్లర్లు ఈ విషయం చెప్పకనే చెబుతున్నాయి. గత రెండు, మూడు దశాబ్దాలుగా అత్యంత విలువైన ఈ వృక్ష సంపదను తరలిస్తూనే ఉన్నారు. అయితే కూలీ కోసం వచ్చి ఎర్రచందనం చెట్లను కూలగొడుతున్న తమిళనాడుకు చెందిన కూలీలే పట్టుబడుతున్నారు తప్ప వారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగు చూడడం లేదు. ఆయా ప్రాంతాల్లో ఎవరిని అడిగినా ఈ ఎర్ర చందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరిది ఉందో కథలు కథలుగా చెప్తున్నారు. అయినా పాలక పెద్దలు ఆవైపు దృష్టి సారించకుండా మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ప్రయత్నాలు చేయడం ప్రయోజనం లేకుండాపోతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే ఈ ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయి. వీటిని 1973లో అరుదైన వృక్షజాతుల జాబితాలో సైడ్స్ (కన్వెన్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎన్ డేంజర్డ్ స్పెసీస్)లోకి చేర్చారు. దీనివల్ల ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో పరిమితంగా ఉన్న ఈ వృక్షాలను రక్షించేందుకే వెసులుబాటు కల్పించారు. వాస్తవంగా చూస్తే ఇప్పటికీ ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్దగా గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదనే చెప్పొచ్చు. కానీ చైనా, జపాన్ దేశాల్లో మాత్రం ఊహించని డిమాండ్ ఉంది. అంతకంతకు పెరుగుతుండడంతో కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడంతో ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రాల ద్వారా సరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త వ్యూహాలను అమలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే వ్యవసాయోత్పత్తుల పేరుతో బోగస్ అనుమతులు కూడా పొందుతున్నారు. చెన్నై, ముంబయి, కొచ్చి తదితర రేవుల నుంచి సరుకు రవాణా ఓడల ద్వారా తరలిపోతున్నది. రోడ్డు మార్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండిగఢ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రవాణా చేస్తున్నారు. ఇదే కాదు మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నది. అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. ఈ వృక్షాలు వెలుగొండ అడవుల్లో మాత్రమే పెరగడానికి కారణాలు ఏవో ఇప్పటికీ మన శాస్త్రజ్ఞులు కనుక్కోలేకపోతున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా వృక్షశాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నా తెలియడం లేదు. పదిహేడువందల సంవత్సరంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఎర్రచందనం చెట్లకు దేశంలోని వివిధ ప్రాంతాలకు, తమ దేశాలకు కూడా తీసుకువెళ్లి పరీక్షలు జరిపారు. అక్కడ కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. చెట్లు పెరగడం లేదు. పెరిగిన అందులో కావలసిన నాణ్యత లభించడం లేదు. ఇక ఈ చెట్లకు ఇంత విలువ ఎందుకు వస్తున్నది? ఎందుకు ఉపయోగిస్తున్నారన్నా విషయాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదని ప్రచారం జరిగినా ఆ తర్వాత ఇది తప్పని తేలింది. అణుఇంధనం తయారీలోనూ, శృంగార సామర్థ్యం పెంచే మందుల్లోనూ వీటిని వాడుతున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. జపాన్ కానీ, చైనా కానీ వీటిని తాము ఎందుకు కొంటున్నాము? ఎందుకు ఉపయోగిస్తున్నామనేది ఏమాత్రం బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. బయోడైవర్‌సిటీ సంస్థ అధ్యయనం ప్రకారం ఒక టన్ను ఎర్రచందనం కోట్లల్లో ధర పలుకుతున్నది. అందుకే రాయలసీమలోని మాఫియా ముఠాలు కొందరు ఫ్యాక్షన్ నేతలు, ఇంకొందరు రాజకీయ వాదులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. దీనికితోడు అటవీ, పోలీసు శాఖ సిబ్బంది అధికారుల్లో కొందరు స్మగ్లర్లతో కుమ్మక్కు అవుతున్నారు. చట్టాల్లోని లొసుగులుకూడా స్మగ్లర్ల పాలిట వరాలుగా మారుతున్నాయి. వారిపై పెట్టిన కేసులను తిరుగులేని సాక్ష్యాలతో రుజువు చేయడంలో కొందరు అధికారులు విఫలమవుతున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించేందుకు గతంలో ప్రత్యేకంగా తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ విభాగం రకరకాల సమస్యలతో కుదేలవుతున్నది. గతంలో ఇచ్చిన ప్రాధాన్యత పాలకులు నేడు అంతగా పట్టించుకోకపోవడం ఆ సిబ్బంది నిరుత్సాహంతో నీరసించిపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అరుదైన ఈ వృక్షసంపదను సంరక్షించేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి.

మీ గౌరవ మర్యాదలు పెరగాలంటే, మంచి గుణాలున్న వారి సాంగత్యాన్ని పెంచుకోండి. చెడు సహవాసం చేయడం కంటే, ఒంటరిగా ఉండటం మేలు.



స్వామి వివేకానంద

సంపదను సరిగ్గా వాడుకోవడం తెలీని ధనవంతుల్ని సంపద దుర్వినియోగదారులుగా తయారు చేస్తుంది.



థామస్ ఫుల్లర్

## ప్రజావాక్కు



### పెన్షన్లు రద్దు చేయాలి

అనేక సంవత్సరాల నుండి పార్లమెంటు, అసెంబ్లీ సభ్యుల పెన్షన్లనురద్దుచేయాలని ప్రజలు అనేకవిన్నపాలు చేసుకున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. వీరందరూఇంచుమించుకోటీశ్వరులు. పైగాఎన్నిసార్లు ఎన్నికయితే అన్ని పెన్షన్లు వస్తాయట. ఇదేమి విచిత్రమో. మన దేశంలో చాలామంది ప్రభుత్వ, ప్రయివేటుఉద్యోగులకు పెన్షన్లు రావు. ఉన్నవి పెరగవు. ఉదహరణకు ఇ.పి.ఎస్. 1995 అన్కేవరమ అక్రమస్కీంలో రిటైరైన ఉద్యోగులకు కొంచెం అటు ఇటుగా దశాబ్దం పైగా వెయ్యి రూపాయల పెన్షను వస్తోంది. దానిని కనీసం 9000 చేయమని కేంద్రంలోని బిజెపి గవర్నమెంటు వారికినోళ్ళు చించుకుని ఎన్నిసార్లు విన్నపాలు చేసినా వారు విననట్లే ప్రవర్తిస్తున్నారు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### విజయయాత్రలు చేపట్టకూడదు

రెండేళ్లక్రితం జరిగిన జెంజీ ఉద్యమ పలితంగా రాజకీయాలలో పాలనపద్ధతిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి అనడంలో సందేహం లేదు. జులై చార్టర్ ప్రధాన కారణంగాతోస్తోంది. అందులో ప్రతిపాదించిన ఆరు అంశాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అందులో ఉన్న పోలీస్ సంస్కరణలు, పాలన సంస్కరణలున్యాయ సంస్కరణలు లాంటివి అందులో ఉన్నాయి. ఇంకా ముఖ్యమైన మార్పు ఏమిటి మైనారిటీలా మీద దాడులవల్లభారత్, బాంగ్లాదేశ్ మధ్య చెడిపోయిన సంబంధాలు ఇప్పుడు ఇద్దరు మైనారిటీలను మంత్రివర్గంలో చేర్చుకోవడం ద్వారా మైనారిటీల కుఅండగా నిలబడుతాం అనిసందేశంఇచ్చినట్టు అయింది.

- భారత అవినాష్,జనగామ

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో నిత్యమూ బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి. ఏడాదిపాటు ట్రాఫిక్ ఉంటుంది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం గానీ, ప్రమాదం గానీతప్పవచ్చు. ట్రాఫిక్ సరిచేయడంఎక్కడైనా ఉంటుంది. దశాబ్దకాలం నుండి ఈఘాట్‌రోడ్, పైన కొండలు, మలుపులు పూర్తిగాచూసి దేశంలోనిఅత్యంత ప్రతిష్ఠాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణుల అభిప్రాయం. నిపుణులు సూచించే రక్షణ మార్గాలు పక్కగా ఇంజనీరింగ్ విభాగం చర్యలు చేపట్టాలి.

- బి. మేఘానథం, విశాఖపట్నం

### విస్తరిస్తున్న కేన్సర్ వ్యాధి

క్యాన్సర్ వ్యాధివిస్తృతి పెరుగుతున్ననేపథ్యంలో, ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికల ప్రకారం, క్యాన్సర్ మరణాలలో అధికశాతం తక్కువమధ్య ఆదాయదేశాల్లోనే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అత్యాధునిక చికిత్సా సౌకర్యాలు అందరికీ అందుబాటులో లేకపోవడం. ప్రభుత్వాలు కేవలం వ్యాధి సోకిన తర్వాత చికిత్స అందించడంపైనే కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై కూడా దృష్టి సారించాలి. ముందుగా, ప్రతి జిల్లా స్థాయిలో అత్యాధునిక రోగ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరం. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించడంవల్ల మారుమూల ప్రజలకు వైద్యసేవలు అందుతాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో రేడియేషన్, కిమోథెరపీవంటి ఖరీదైన చికిత్సలను ఉచితంగా, తక్కువ ధరకే అందుబాటులోకి తేవాలి.

-సి.హెచ్.ప్రతాప్,శ్రీకాకుళం

### వైట్ పాపులేషన్ లెక్కించాలి

ప్రపంచంలో వైట్‌పాపులేషన్ రోజురోజుకుపెరుగుతుంది. యూఎస్‌ఏలో 2000 సంవత్సరం నుండి 2025 సంవత్సరం వరకు 25 సంవత్సరాలలో వైట్ పాపులేషన్ జనాభా లెక్కలు సేకరించడం జరిగింది. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలోని 12.769గ్రామాలలో ప్రతి గ్రామంలో ఈ మధ్యకాలంలో ప్రభుత్వం చేపట్టేజనాభా లెక్కలసేకరణలో వైట్ పాపులేషన్ వివరాలు కూడా సేకరించాలి. వీరు చాలామంది పుట్టుకతో దృష్టిలోపంతోఎండ, వాన, చలి వాతావరణానికి తట్టుకోలేకపోతున్నారు. శారీరక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుంది. ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించాలి. తక్కువ జనాభా కలిగిన మైనారిటీ వర్గంగా గుర్తించి వారి సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### కఠిన శిక్షలు పడాలి

అవినీతి నిరోధక శాఖ కేసులు ఏళ్ళుగడుస్తున్నా కొలిక్కి రావటంలేదు. ఇదే అలుసుగా లంచాల బాటలో నడుస్తున్న అధికారులు మళ్ళీ తిరిగి అదే బాటలో నడుస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. లంచావతారులపై కఠిన చర్యలు తీసుకొని, వారికి కఠిన శిక్షలు పడేలా చేయాలి.

-మా.శ్రీ. రాజు, పాల్వంచ

## భారతదేశంవైపు అగ్రరాజ్యాల చూపు!

**ప్రపంచంలో వివిధ దేశాలపై ఎగుమతులు, దిగుమతులపై అసమతుల్యమైన టారిఫ్ విధానాన్ని వివిధ దేశాల మధ్య అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా తెర వెనుక అత్యంత శక్తివంతమైన దక్షిణాసియా దేశాలైన చైనా రష్యా, భారత్ లాంటి దేశాలు ఏకమైతే అగ్రరాజ్యమైన అమెరికా పరిస్థితి ఎలా ఉంటుందో అమెరికా ఊహించుకుందేమోకానీ ఇక లాభం లేదు అనుకునే రీతిలో భారతదేశంపై అనవసరంగా అధిక సుంకాలను విధించడం అమెరికా తమ దేశ ప్రయోజనాలకు మంచిది కాదని భావించి ఉండవచ్చు. ఇదే రీతిలో భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానం ప్రపంచ శాంతి సౌభాగ్యం సద్భావన మంచి స్నేహ సంబంధాలు ప్రజల మధ్య సఖ్యత పరస్పర సహకారం అహింసావాదం లాంటి నిర్దిష్టమైన విధానాలు అనుసరిస్తున్న తరుణంలో అమెరికా, రష్యా లాంటి దేశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు భారత దేశంతో కలిసి వాణిజ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుచుకోగలవని ఆశించడంలో సందేహంలేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశం ప్రపంచ దేశాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా గోచరిస్తుందా అంటే అవును నిజమే అనిపిస్తుంది. ప్రపంచంలో అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా ,యూరప్ యూనియన్ లాంటి దేశాలు భారతదేశంతో వ్యాపార వాణిజ్య తదితర అంశాలలో మంచి సంబంధాలు కలిగి ఉంటున్నా, ఎన్నడూ లేని విధంగా భారత్ ప్రత్యక్షంగా రష్యా నుండి అధిక మొత్తంలో క్రూడ్‌ఆయిల్ దిగుమతి చేసుకుంటుందనే నెపంతో భారతదేశ వాణిజ్య వ్యాపారంపై అమెరికా అత్యధిక టారిఫ్ అంటే సుంకం విధానాన్ని అమలు చేసి రష్యా నుండి క్రూడాయిల్ దిగుమతి చేసుకోకుండా భారతదేశంపై ఒత్తిడి పెంచాలని ప్రయత్నాలు చేసినా చివరకు కారణాలేవైనా భారతదేశంపై విధించిన సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటించడం, ఈ క్రమంలో అమెరికా చేసిన ప్రకటనపై భిన్న వాదనలు తెరపైకి వచ్చాయి. భారతదేశం రష్యాతో పాటు యూరోపియన్ దేశాలతో అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానంతో భారతదేశం ఎప్పుడూ శాంతి పక్షాన ఉంటుందని ప్రపంచంలో శాంతియుత జీవనవిధానాలకు అనుగుణంగా ఉంటామని చెప్పిన మాటకు కట్టుబడి ఉండి ఆ దిశగా పురోగమిస్తున్న తరుణంలో అమెరికా అధిక టారిఫ్ విధించి రష్యాతో భారత్‌కు ఉన్న వ్యాపార వాణిజ్యాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేసింది. తద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థను బలహీన పరచటాడానికి అనేక రకాలుగా విశ్వప్రయత్నం చేసింది. ఎగుమతులు దిగుమతుల వస్తువులపై అత్యధిక సుంకాలను విధించినప్పటికీ, భారత్ కొంచెం కూడా ఆందోళన చెందక ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపే దృష్టి సారించింది. భారతదేశం దేశ ప్రజల ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచించింది తప్ప ఇతర దేశాల పెత్తనాన్ని భారత్ ఎప్పుడూ సహించలేదు. ఇటీవల కాలంలో ఇండియా, రష్యా, వార్షిక శిఖరాగ్ర సభ కూడా జరగడం, భారతదేశానికి రష్యా అధ్యక్షుడు విచ్చేయడం వాణిజ్య వ్యాపార సంబంధాలు రక్షణ విషయంలో రష్యా మరింత దగ్గర కావడం అమెరికాకు అంతగా నచ్చలేదేమో కానీ, రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకే భారత్ క్రూడ్‌ఆయిల్‌ను రష్యా నుండి ఎన్నడూ లేని విధంగా అధికంగా దిగుమతి చేసుకోవడం, వ్యాపార వాణిజ్య సంబంధాలు సైతం రష్యాతో జోరుగా సాగిస్తుంది అనే అమెరికా ఊహాజనితమైన వాదనలే ప్రత్యక్షంగా పరోక్షంగా భారతదేశం ఎగుమతులు, దిగుమతులపై సుంకాలను పెంపునకు కారణం కావచ్చు అనే భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. భారత్ యూరోప్ యూనియన్ దేశాలతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలతో ప్రత్యామ్నాయంగా వాణిజ్య వ్యాపార సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నంలో ఉండగా ఎక్కడ భారతదేశంతో సత్సంబంధాలు తెగిపోతాయేమోనని



కావచ్చు. తిరిగి భారత్‌తో వాణిజ్య వ్యాపార సంబంధం మెరుగుపరచుకోవడానికి ఇటీవల భారతదేశంపై విధించిన సుంకాలను తగ్గిస్తున్నట్టు ఒప్పందం జరిగిందని ప్రకటించింది. కానీ ఒప్పందంలో ఇరుదేశాల అగ్రనేతలు ఎక్కడ పాల్గొన్నట్లు కనిపించలేదు. కాకపోతే అమెరికా భారత్‌పై సుంకాలు తగ్గించినట్లు వచ్చిన వార్త నిజమే అన్నట్టు భారత దేశ సంబంధిత శాఖ కేంద్ర మంత్రి సూచప్రాయంగా తెలపడంతో ఈ క్రమంలో ఒప్పందం వల్ల ప్రయోజనాల కన్నా ఏమైనా నష్టాలున్నాయా తెలుపమని దేశంలోని ప్రతిపక్ష నాయకులు కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తడం తీవ్ర చర్చాంశంగా మారింది. గతం కంటే భారతదేశం అంతరిక్ష శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచంలో తిరుగులేని శక్తిగా మారుతుంది. విప్లవాత్మకమైన మార్పులతో వ్యాపార వాణిజ్య పరంగా అత్యధికంగా స్వయం శక్తితో ముందుకు పురోగమిస్తుంది. ప్రపంచ శాంతి సద్భావనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ప్రత్యక్షంగా పరోక్షంగా టెర్రరిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్న అత్యంత శక్తివంతమైన భారతదేశం ఇప్పుడు ప్రపంచ స్థాయిలోనే అగ్రరాజ్యాలను సైతం అహింసా విధానాలతో సై అంటే సై అని ఢీకొట్టే దమ్మున్న భారతదేశం వైపు ప్రపంచ దేశాలు దృష్టి సారిస్తుండడం గమనార్హం. అయితే అమెరికా నుండి భారతదేశంపై అధిక సుంకాలను తగ్గిస్తున్నట్టు ప్రకటన రాకముందు కొన్ని యూరోపియన్ దేశాల నేతలు అమెరికా భారత్ పైఅనుసరిస్తున్న విధానాన్ని పక్కనపెట్టి భారత దేశంతో వ్యాపార వాణిజ్యాలు చేసుకునేందుకు ముందుకు రావడం విశేషం. యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఇటీవల భారతదేశాన్ని సందర్శించడంతో పాటు భారతదేశం గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ప్రపంచదృష్టిని ఆకర్షించింది. పరోక్షంగా నైనా భారతదేశం రష్యా స్నేహబంధం మధ్య దూరాన్ని తగ్గించాలనుకోవడం అంత సులువు కాదేమో అని అమెరికా గ్రహించింది కావచ్చు. అమెరికా కూడా చివరకు భారతదేశంతో సత్సంబంధాలు వదులుకోవడానికి సాహసించలేదు అనే రీతిలో భారతదేశ వాణిజ్య వ్యాపారలపై ఎగుమతులు దిగుమతులపై సుంకాలను తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఏది ఏమైనప్పటికీ ప్రపంచంలో వివిధ దేశాలపై ఎగుమతులు, దిగుమతులపై అసమతుల్యమైన టారిఫ్ విధానాన్ని వివిధ దేశాల మధ్య అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా తెర వెనుక అత్యంత శక్తివంతమైన దక్షిణాసియా దేశాలైన చైనా రష్యా, భారత్ లాంటి దేశాలు ఏకమైతే అగ్రరాజ్యమైన అమెరికా పరిస్థితి ఎలా ఉంటుందో అమెరికా ఊహించుకుందేమోకానీ ఇక లాభం లేదు అనుకునే రీతిలో భారతదేశంపై అనవసరంగా అధిక సుంకాలను విధించడం అమెరికా తమ దేశ ప్రయోజనాలకు మంచిది కాదని భావించి ఉండవచ్చు. ఇదే రీతిలో భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానం ప్రపంచ శాంతి సౌభాగ్యం సద్భావన మంచి స్నేహ సంబంధాలు ప్రజల మధ్య సఖ్యత పరస్పర సహకారం అహింసావాదం లాంటి నిర్దిష్టమైన విధానాలు అనుసరిస్తున్న తరుణంలో అమెరికా, రష్యా లాంటి దేశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు భారత దేశంతో కలిసి వాణిజ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుచుకోగలవని ఆశించడంలో సందేహంలేదు. ●

## పరీక్షలు యుద్ధంలా కాదు..పండుగలా జరుపుకుందాం

నల్ల రవికుమార్

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి చదువుతున్న లక్షలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఇళ్లలో ప్రస్తుతం ఒకే చర్చ నడుస్తోంది. అది '100 రోజుల యాక్షన్ ప్లాన్' విద్యా సంవత్సరం ప్రారంభంలో నెమ్మదిగా సాగే పాఠశాల వాతావరణం డిసెంబర్ వచ్చేసరికి ఒక్కసారిగా యుద్ధ ప్రాతిపదికన మారిపోయింది. ఫిబ్రవరి నాటికి పూర్తి కావాల్సిన సిలబస్‌ను డిసెంబర్ నాటికే ముగించాలన్న అధికారుల ఆదేశాలతో తరగతి గదుల్లో బోధన వేగం పుంజుకుంది. అయితే, ఈ వేగం వెనుక విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న ఆందోళన కంటే, రాష్ట్ర స్థాయిలో ఉత్తీర్ణతాశాతం పెంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్న ప్రభుత్వ లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు విద్యా రంగ నిపుణుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఏటా నిర్వహించే 'పరీక్షా పే చర్చా' కార్యక్రమ ఉద్దేశాలకు, ఏపీలో అమలవుతున్న ఈ యాక్షన్ ప్లాన్కు మధ్య ఉన్న స్పష్టమైన వైరుధ్యం చర్చనీయాంశంగా మారింది. నిజానికి ప్రధాని మోడీ 'పరీక్షా పే చర్చా' ద్వారా ప్రపంచానికి ఒక సందేశాన్ని ఇస్తున్నారు. పరీక్షలు అనేవి కేవలం విద్యార్థుల జ్ఞాపకశక్తిని కొలిచే సాధనాలు కాకూడదని, వాటిని పండుగలా (ఎగ్జామ్స్ యాజ్ ఫెస్టివల్) ఆనందంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో కలిగే ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ కార్యక్రమంపరమార్థం. కానీ, ఏపీలో అమలవుతున్న వంద రోజుల ప్రణాళిక దీనికి భిన్నంగా, విద్యార్థులను నిరంతర ఒత్తిడికి గురిచేసేలా ఉందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతర బోధన, ఆపై ప్రత్యేక తరగతులు, ఆదివారాలు కూడా మాక్ టెస్టులు నిర్వహించడం వంటి చర్యలు విద్యార్థులను మానసిక అలసటకు గురిచేస్తున్నాయి. శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా, పిల్లల అభ్యాస ప్రక్రియ అనేది ఒక సహజ వృద్ధి విధానం. దానిని అర్థం చేసుకునే సమయం, పునశ్చరణ, స్వేచ్ఛగా ప్రశ్నలు అడిగే వాతావరణం అవసరం. వేగంగా సిలబస్ పూర్తి చేయాలన్న ఆరాటంలో ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి కఠినమైన సబ్జెక్టుల్లో మూలభూత సూత్రాలు అర్థం కాకుండానే తదుపరి పాఠాలకు వెళ్లడం వల్ల విద్యార్థులకు సమాచారం చేరుతోంది కానీ జ్ఞానం కలగడం లేదు.




ప్రధాని మోడీ సైతం తన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలో మార్కుల కంటే అవగాహనకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 'జ్ఞాపకశక్తి కంటే భావనాత్మక స్పష్టత మిమ్మల్ని జీవితంలో గొప్పవారిని చేస్తుంది' అన్న ఆయన మాటలకు, కేవలం పరీక్షా ఫలితాలకోసం చేస్తున్న ఈ'యుద్ధ సన్నద్ధత' వ్యతిరేక దిశలో ప్రయాణిస్తోంది. మరోవైపు, ప్రతి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించి వాటి మార్కులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్న నిబంధన ఉపాధ్యాయులను డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మారుస్తోంది. బోధన నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన గురువులు, మార్కుల నమోదు, అటెండెన్స్ వివరాల సేకరణలో సమయం వృథా చేయాల్సి వస్తోంది. ఇది ఉపాధ్యాయుల్లో కూడా అసహనాన్ని, అలసటను పెంచుతోంది. 'మూల్యాంకనం అనేది విద్యార్థి లోపాలను సరిదిద్దే ఆలోచనాత్మక ప్రక్రియ కావాలి కానీ, అది యాంత్రికంగా మారకూడదు' అని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పండుగల సెలవుల్లో కూడా విద్యార్థులను బడికి రప్పించడం వల్ల వారు కుటుంబంతో గడిపే సమయాన్ని కోల్పోతున్నారు. ఇది వారి భావోద్వేగ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ఏపీలోని పదో తరగతిగదుల్లో ప్రతి విద్యార్థి ఒక సంఖ్యగా మారిపోతున్నాడనే విమర్శ వినిపిస్తోంది. చైల్డ్ సైకాలజీ ప్రకారం,14-15 ఏళ్ల వయసులో ఉన్న పిల్లలకు శారీరక, మానసిక మార్పులు సంభవిస్తున్న తరుణంలో అధిక ఒత్తిడి కలిగించడం వల్ల వారిలో నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. పరీక్షా ఫలితాలు రాష్ట్ర విజయ సూచిక కావచ్చు కానీ, అది విద్యార్థుల సృజనాత్మకతను బాల్యాన్ని బలితీసుకునేదిగా ఉండకూడదు. 'ఫలితాలు ముఖ్యమే కానీ, ఆ ఫలితాల వైపు సాగే ప్రయాణం కూడా అంతే ముఖ్యమని' ప్రధాని పదేపదే చెబుతుంటారు. అంతిమంగా, విద్యా సంస్కరణలు అనేవి విద్యార్థిని మానసిక దృఢత్వం కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దాలి. 100 రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరీక్షల ప్రిపరేషనను ఒక సహజ అభ్యాస ప్రక్రియగా మార్చి, స్లిప్ టెస్టుల మోత తగ్గించి, విద్యార్థులకు తగినంత విశ్రాంతిని కల్పించినప్పుడే అది నిజమైన విద్యా సాధన అవుతుంది. పరీక్షలు జీవితంలో ఒక మలుపు మాత్రమే తప్ప, అవే జీవితం కాదన్న వాస్తవాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పడమే 'పరీక్షా పే చర్చా' అసలు ఉద్దేశ్యం. ఆ స్ఫూర్తితోనే రాష్ట్రస్థాయి ప్రణాళికలు కూడా రూపొందితే విద్యార్థులు ఎగ్జామ్ వారియర్లుగా మారి విజయం సాధిస్తారు. ●

## ఎఐపై నియంత్రణ లేకపోతే వినాశనమే!

మేకిరి దామోదర్

ఆధునిక సాంకేతిక విప్లవానికి భారత్ వేదిక ఈ నెల 16నుంచి 20 తేదీల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో కృత్రిమ మేధపై అంతర్జాతీయ స్థాయి ఏఐ ఎక్స్‌పో 2026 ఇంపాక్ట్ సమ్మిట్ జరుగుతుంది. విద్యుత్ ఆవిష్కరణ ప్రపంచాన్ని ఎలా మారుస్తుందో, 21వ శతాబ్దంలో కృత్రిమ మేధ కూడా అంతే స్థాయిలో మానవ జీవన విధానాలను, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, వ్యాపారం, ఆర్థిక వ్యవస్థలను,రాజకీయ నిర్మాణాలను ప్రభావితం చేస్తున్నదనే అభిప్రాయం ప్రపంచవ్యాప్తంగా బలపడుతోంది. ఈ సదస్సులో ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతలు, పరిశ్రమల అగ్రగాములు, ప్రముఖ టెక్నాలజీ సంస్థల సీఈఓలు, శాస్త్రవేత్తలు, విధాననిర్ణేతలు పాల్గొననున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరవుతారు. సుమారు 700కి పైగా వివిధ అంశాలపై సెషన్లు నిర్వహించనున్న ఈ సమ్మిట్, కేవలం సాంకేతిక ప్రదర్శన వేదికగా కాకుండా, భవిష్యత్ మానవ సమాజ దిశను నిర్ణయించే విధాన చర్చలకు కేంద్రమవుతోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థల విస్తరణ, గ్లోబల్ కనెక్టివిటీ వంటి అంశాల నేపథ్యంలో భారత్ ఈ వేదికను వినియోగించుకోవడం ఒక వ్యూహాత్మక అడుగు. ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారతదేశం కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ చర్చలు సాగనున్నాయి. ఇప్పుడు ఏఐ ప్రతిరోజు జీవనంలో అంతర్భాగమై పోయింది. ఆరోగ్య రంగంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ, వైద్యచిత్రాల విశ్లేషణ, వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, పంటలనిర్వహణ, విద్యారంగంలో వ్యక్తిగతీకరించిన అభ్యాస పద్ధతులు, పరిశ్రమల్లో ఆటోమేషన్ సరఫరా గొలుసు నిర్వహణ - ఇవన్నీ ఏఐ ఆధారిత మార్పులే. 2023-24 కాలంలో ఏఐపై అనేక భయాలు వ్యక్తమయ్యాయి. ఉద్యోగాలు కోల్పోతాం, మనిషిని భర్తీ చేస్తుంది, నియంత్రణ తప్పుతుంది వంటి చర్చలు జోరుగా సాగాయి. అయితే 2025-26 నాటికి ప్రపంచ రాజకీయ చర్చలు అవకాశాల వైపు మళ్లాయి. పెట్టుబడులు పెరిగాయి. దేశాలు ఏఐలో ఆధిపత్యం సాధించడానికి పోటీ పడుతున్నాయి. అయితే భయం తగ్గిందని ప్రమాదం కూడా తగ్గిందని భావించడం పొరపాటు. వాస్తవానికి సాంకేతిక సామర్థ్యం పెరిగిన కొద్దీ దాని ప్రభావం మరింత విస్తరిస్తుంది. అణుశక్తి విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడినట్టే వినాశనానికి కారణమైందని చరిత్ర చెబుతోంది. అలాగే కృత్రిమ మేధ కూడా ద్విముఖ కత్తి లాంటిది. ఏఐ ద్వారా ఉత్పాదకత పెరిగి ఆర్థిక వృద్ధి వేగవంతమవుతుంది. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, అవినీతి నియంత్రణకు సాంకేతిక సహకారం లభిస్తుంది. పేదరిక నిర్మూలనలో డేటా ఆధారిత నిర్ణయాలు సహకరిస్తాయి. ప్రకృతి విపత్తుల ముందస్తు హెచ్చరికలు, వాతావరణ మార్పుల అంచనాలు వంటి అంశాల్లో కూడా ఏఐ కీలక పాత్ర పోషిస్తుంది.



భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి ఇది ఒక చారిత్రాత్మక అవకాశం. యువ జనాభా, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్టార్టప్ సంస్కృతి - ఇవన్నీ కలిసి ఏఐ విప్లవంలో భారత్‌ను ముందుకు తీసుకెళ్లగలవు. అయితే ఈ అభివృద్ధి సమగ్రతతో కూడి ఉండాలి. నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూరాలి. ఏఐ శక్తి అపారమైనది. ఒక దేశం లేదా కార్పొరేట్ సంస్థ చేతుల్లో కేంద్రీకృతమైతే అనేక రకాల ముప్పులు తలెత్తవచ్చు. స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరిన ఏఐ వ్యవస్థలు రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించవచ్చు. కానీ అదే సమయంలో సైబర్ యుద్ధాలు, స్వయంచాలిత ఆయుధ వ్యవస్థలు వంటి అంశాల్లో నియంత్రణ తప్పితే జాతీయ భద్రతకు ప్రమాదం. దుష్ట శక్తులు, ఉగ్రవాద గుంపులు ఏఐని సైబర్ దాడులు, దుష్ప్రచారం, జీవ ఆయుధాల రూపకల్పన వంటి కార్యకలాపాలకు వాడితే ప్రపంచ భద్రతకు తీవ్ర సవాలు. ఏఐ ఆధిపత్యం కొద్ది కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. డేటా, నీరు, విద్యుత్, నైపుణ్య మానవ వనరులు - ఇవన్నీ కొందరి నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఏఐ ఉత్పాదకతను పెంచినా, అనేక సంప్రదాయ ఉద్యోగాలు నశించే అవకాశం ఉంది. కొత్త నైపుణ్యాల కోసం పెద్ద ఎత్తున శిక్షణ అవసరం. లేకపోతే నిరుద్యోగం, సామాజిక అస్థిరత పెరుగుతాయి. పౌరహక్కులు, గోప్యత, వివక్ష వంటి అంశాలు కీలకం. ఏఐ మోడళ్లలో పక్షపాత వైఖరులు నిక్షిప్తమైతే సామాజిక అన్యాయం పెరుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలపై దుష్ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఖచ్చితమైన నియంత్రణా చట్టాలు రూపొందించాలి. ఆవిష్కరణలను అడ్డుకోకుండా, ప్రమాదాలను మాత్రమే కట్టడి చేసే విధానాలు అవసరం. కంపెనీలు స్వచ్ఛందంగా బాధ్యత వహించాలి. అంతర్జాతీయ స్థాయిలో పర్యవేక్షణ, పారదర్శకత, డేటా రక్షణ ప్రమాణాలు రూపొందించాలి. భారత్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్ ఈ దిశగా మార్గదర్శకంగా నిలవాలి. ప్రపంచ దేశాలు కలిసి ఒక సాధారణ నైతిక చట్టం రూపొందించగలిగితేనే ఏఐ ప్రయోజనాలు సమానంగా పంచబడతాయి. సాంకేతికత స్వతహాగా తటస్థం. దాని వినియోగమే దాని స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. కృత్రిమ మేధ మానవ వికాసానికి అపార అవకాశాలను అందిస్తోంది. అదే సమయంలో నియంత్రణ లేకపోతే వినాశనానికి దారితీసే శక్తి కూడా ఉంది. అందువల్ల ఈ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కేవలం పెట్టుబడుల వేదికగా కాకుండా, మానవీయ విలువలకు కట్టుబడి ఉండే గ్లోబల్ ఒప్పందానికి దారితీయాలి. సామ్రాజ్యవాద స్వార్థాలు, కార్పొరేట్ ఆధిపత్యం, డేటా దోపిడీ వంటి అంశాలను నియంత్రించేందుకు అంతర్జాతీయ సహకారం అవసరం. పారదర్శకత, బాధ్యత, సమానత్వం, సౌభ్రాతృత్వం ఈ నాలుగు స్తంభాలపై ఏఐ భవిష్యత్తు నిర్మితమవ్వాలి. అభివృద్ధి, ప్రగతి, శాంతిఇవే సాంకేతిక ప్రయాణానికి పరమావధిగా నిలవాలి. ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభమైన చర్చలు ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం ఇవ్వాలి. కృత్రిమ మేధ మనిషిని భర్తీ చేయడానికి కాదు, మానవ వికాసాన్ని వేగవంతం చేయడానికి. ఈ అగ్ని పరీక్షలో మానవీయ విలువలు గెలవాలి. ప్రపంచ శాంతి, సమగ్ర అభివృద్ధి, బాధ్యతాయుత సాంకేతిక యుగానికి భారత్ మార్గదర్శకంగా నిలవాలి. ఆధునిక సాంకేతికత సమాజ ప్రగతికి, వికాసానికి, విశ్వశాంతికి తోడ్పడాలని విశ్వమానవాళి ఆకాంక్షిస్తోంది. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు..

## ఇరాన్‌ను చుట్టుముడుతున్న వార్‌షిప్‌లు, విమానాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడి జరగవచ్చన్న ఆందోళన పెరుగుతోంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో గడచిన 24 గంటల్లో 50కిపైగా యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు అమెరికా తరలించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ సరిహద్దుకు సమీపంలోని తన వైమానిక, నౌకాదళ సామర్థ్యాన్ని బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా 50కిపైగా ఎఫ్16, ఎఫ్22, ఎఫ్35 యుద్ధ విమానాలను మోహరించినట్లు అమెరికన్ మీడియా ప్రకటించింది. పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు పశ్చిమాసియా దిశగా పయనిస్తున్నట్లు స్వతంత్ర విమాన ట్రాకింగ్ డాటా సూచించింది. ఇరాన్ అణు కార్యకలాపాలపై అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య పరోక్ష చర్చలు సాగుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ అణుకార్యక్రమంపై ఆందోళనలు కొనసాగుతూ ప్రత్యక్ష పోరు అనివార్యంగా కనిపిస్తున్నప్పటికీ దౌత్యపరమైన ప్రయత్నాలు మాత్రం ఇటీవల కొన్ని వారాలుగా జరుగుతున్నాయి. తన బలాన్ని మరింత ప్రదర్శించేందుకు అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌ను పశ్చిమాసియాకు తరలిస్తోంది. కరీబియన్‌లో ఉన్న ఈ యుద్ధ నౌకకు గతవారం అమెరికా కొత్త బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ త్వరలోనే సైనిక చర్యను ప్రారంభించే అవకాశం ఉందని యాక్సియోస్ వార్తాసంస్థ వెల్లడించింది. గత ఏడాది జరిగిన 12 రోజుల ఘర్షణలతో పోలిస్తే రానున్న దాడి విస్తృతి చాలా పెద్దదని, కొన్ని వారాలపాటు ఘర్షణలు కొనసాగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ యాక్సియోస్ ప్రత్యేక కథనం ప్రచురించింది. చిన్నపాటి కార్యాచరణలతో కూడిన దాడికి ట్రంప్ ప్రభుత్వం సన్నాహాలుచేస్తున్నా పూర్తి స్థాయి సైనిక చర్యగా మారుతుందని యాక్సియోస్ తెలిపింది. ఇజ్రాయెల్‌తో కలసి అమెరికా సైనిక చర్యకు దిగవచ్చుని, ఇది ప్రాంతీయ సైనిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని వార్తాసంస్థ పేర్కొన్నది. జెనీవాలో జరిగిన తాజా అణు చర్చలుసహా దౌత్య స్థాయి చర్చలు కొనసాగుతున్నప్పటికీ అవి ఫలప్రదమయ్యే అవకాశాలు కనపడడం లేదన్న అంచనాలున్నాయి. మీ యుద్ధనౌక కన్నా మా ఆయుధం ప్రమాదకరమని ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ అమెరికాకు ప్రత్యక్ష హెచ్చరికలు జారీచేశారు. అమెరికన్ యుద్ధ నౌకలను సముద్రం అడుగుభాగానికి పంపగల ఆయుధాలు ఇరాన్ వద్ద ఉన్నాయని ఖమేనీ తెలిపారు. ఇరు దేశాల మధ్య జెనీవాలో అణు చర్చలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఖమేనీ నుంచి ఈ హెచ్చరికలు జారీ కావడం గమనార్హం. అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు, సముద్రంలో మునిగిపోతున్నట్లు చూపించే ఏఐ ఫొటోను ఖమేనీ షేర్ చేశారు. ఇరాన్ వైపు ఓ యుద్ధ నౌకను పంపినట్లు అమెరికన్లు నిరంతరం చెబుతుంటారని ఎక్స్‌లో ఖమేనీ చెపుతూ ఆ నౌకను సముద్రం అడుగుకు పంపగల ఆయుధం మరింత ప్రమాదకరం అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయుధ సంపత్తిలో తమకు ఎవరూ సాటిలేరంటూ అమెరికా చెబుతున్న మాటలను ఆయన కొట్టివేశారు. తన దేశానికి ప్రపంచంలోనే అత్యంత బలమైన సైన్యం ఉందని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారని అత్యంత బలమైన సైన్యం కూడా కొన్ని సార్లు తన కాళ్లపై నిలబడలేనంతగా దెబ్బలు తింటుంది అని ఖమేనీ వ్యాఖ్యానించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ ప్రావిన్సులో బుధవారం మంటలు చెలరేగాయి. పరంద్ నగరంలోని ఓ భవనం పైనుంచి దట్టమైన పొగలు కమ్ముకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కనిపించాయి. ఆ ప్రదేశంలో పేలుడు సంభవించినట్లు ప్రాథమిక ఆన్‌లైన్ నివేదికలు పేర్కొన్నాయి. భవనం సమీపంలోని నది ఒడ్డున రెల్లు గడ్డి అంటుకోవడం వల్ల పొగ ఏర్పడిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ ఐఆర్ఐబీ తర్వాత తెలిపింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పుతున్నట్లు ప్రసార సంస్థ పేర్కొంది. షిరాజ్ ప్రావిన్సులో పేలుడు సంభవించినట్లు తెలుస్తున్నది. నగర శివార్లలోని పర్వత ప్రాంతంలో పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు.



### అమెరికా చరిత్రలో వరస్ట్ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్!

#### భారీస్థాయిలో పతమైన అధ్యక్షుడి ఆమోద రేటింగ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికా 48వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రేటింగ్ భారీగా పడిపోయింది. బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే ఆయన రేటింగ్ అత్యంత దారుణంగా పడిపోయింది. తాజాగా యాహూ/యుగోవ్ నిర్వహించిన సర్వేలో 40 శాతం మంది అమెరికన్లు ట్రంప్‌ను అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడ్మగా పేర్కొన్నారు. గతంలో అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన ఎవరికీ ఈ స్థాయిలో వ్యతిరేకత ఎదురుకాలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం 12 శాతం మంది మాత్రమే ట్రంప్‌ను అద్భుతమైన అధ్యక్షుడుగా భావిస్తుండగా 53 మంది ఆయనను విఫల అధ్యక్షుడుగా ముద్ర వేశారు. ట్రంప్ ఆమోదం రేటింగ్ 39 శాతానికి పడిపోగా వ్యతిరేకత 58 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వలస వ్యతిరేక విధానాలు, హెచ్1బీ వీసా నిబంధనల కఠినత, మరియు వాణిజ్య యుద్ధం వంటి నిర్ణయాలపై అమెరికన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది లిబరేషన్ డే పేరుతో వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు వికటించాయి. స్వదేశంలోనూ దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతిపక్ష డెమొక్రాట్ల నియంత్రణలో ఉన్న నగరాల్లో నేషనల్ గార్డ్స్‌ను మోహరించడం వంటి నిర్ణయాలు ప్రజా వ్యతిరేకతను మరింత పెంచాయి. ప్రజాదరణ పడిపోతుండటంతో 2026లో జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఓటమి తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెనేట్ డెమొక్రాట్ల వశమైతే తనపై అభిశంసన వేటు పడే అవకాశం ఉందని ట్రంప్ స్వయంగా తన మద్దతుదారులను హెచ్చరించడం అక్కడి రాజకీయ వేడిని సూచిస్తోంది. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని గమనించిన ట్రంప్ యంత్రాంగం ఇప్పుడు వ్యూహాలు మారుస్తోంది. మిన్నెసోటాలో వలసదారులపై అణిచివేతను ఆపడం, ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను తగ్గించడం వంటి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని, ఈ చర్యలు ఓటర్ల మనసు మార్చలేవని తాజా పోల్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.



### అణుస్థావరాల రక్షణకు ఇరాన్ చర్యలు!

**టెహ్రాన్, ఫిబ్రవరి 19:** అణు ఒప్పందానికి సంబంధించి ఇరాన్-అమెరికాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని మోహరిస్తున్న నేపథ్యంలో ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకవేళ యుఎస్ దాడులకు పాల్పడినా వాటిని తట్టుకుని నిలబడేలా అణుస్థావరాలపై గట్టి బంకర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వాషింగ్టన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. గత రెండు వారాల్లో ఇరాన్‌న మిలిటరీ కాంప్లెక్స్‌లోని న్యూ తలేఘాన్-2 కేంద్రంపై కాంక్రీటుతో ఓలేయర్‌ను ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. ఈ తలేఘాన్-2 టెహ్రాన్‌కు 30 కి.మీ.ల దూరంలో ఉంది. ఈ నెల 13నాటి శాటిలైట్ చిత్రాల ప్రకారం.. అణుస్థావరం మొత్తాన్ని పూర్తిగా కాంక్రీట్‌తో కప్పేశారు. ఇప్పుడు దానిపై మట్టి పోస్తున్నారు. ఇది త్వరలోనే పూర్తి బంకర్‌గా మారిపోతుందని, వైమానిక దాడుల నుంచి దీనికి రక్షణ లభిస్తుందని ఐఎస్ఐఎస్ అధ్యక్షుడు డేవిడ్ అల్‌బ్రైట్ పేర్కొన్నారు. కోలాంగ్-గాజ్‌లా పర్వతం కింద సొరంగ మార్గాలను తవ్వినట్లు ఈ నెల 10నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. నటాంజ్ అణుశుద్ధి కేంద్రం నుంచి ఇది దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రయత్నాలన్నీ సొరంగంపై జరిగే వైమానిక దాడుల నుంచి రక్షణ కల్పించేందుకేనని సంస్థపేర్కొంది. ఈ ప్రాంతంలో కొన్ని వాహనాల కదలికలను గుర్తించింది. లోపల ఇరాన్ ఎఒ కార్యకలాపాలు చేపడుతున్నట్లు సంస్థ అనుమానిస్తోంది. ఎస్ఫహాన్ అణు కేంద్రం వద్ద కూడా రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ నెల 8నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి.



### విషవాయువులు పీల్చి 37 మంది మృతి 26 మందికి తీవ్ర అస్వస్థత

**లాగోస్, ఫిబ్రవరి 19:** నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఈ విషవాయువులు పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ కావడంతో ప్రమాదం జరిగిందని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ గ్యాస్‌లు మానవాలికి చాలా విషపూరితమైనవని, ముఖ్యంగా తక్కువ వెంటిలేషన్ ఉన్న ఏరియాల్లో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికారులు తెలిపారు. నైజీరియా సర్కారు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. మృతదేహాలను అంతిమ సంస్కారాల కోసం కుటుంబసభ్యులకు అప్పగించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో ముందుగానే అవగాహన లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమ మైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తులో తేలుతుందని నైజీరియా మంత్రి తెలిపారు. నైజీరియాలో బంగారం కోసం పలు ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ గనుల్లో ఎంతోమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.



### 122 సంవత్సరాల తర్వాత కోణార్క్ పునరుద్ధరణ

**కోణార్క్, ఫిబ్రవరి 19:** ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయ గర్భ గుడిలోకి త్వరలో భక్తులు ప్రవేశించే అవకాశం రానున్నది. ప్రస్తుతం ఆ స్థలం ఇసుకతో నిండి ఉంది. దాన్ని ఇప్పుడు తొలగిస్తున్నారు. ఆలయం వెనుక ఉన్న 15 అడుగుల ఎత్తయిన గోడ కూలిపోకుండా నిరోధించడానికి బ్రిటిష్ పాలకులు 1903-04లో గర్భ గుడిని వేల టన్నుల ఇసుకతో నింపారు. జగ్‌మోహన్ హాల్‌గా పిలిచే ఈ ప్రాంతంలోకి శతాబ్దం పాటు ఎవరూ ప్రవేశించలేదు. తాజాగా భారత పురావస్తు శాఖ, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన బృందం ఈ ఇసుకను తొలగించే పని చేపట్టింది. మొత్తం 122 సంవత్సరాల తర్వాత ఇపుడు ఈ పురాతన దేవాలయం ఉనికిలోకి వస్తోంది. మొత్తం ఇసుకను తరలించడానికి మూడు నెలలు పడుతుందని ఓ పురావస్తు శాఖ అధికారి తెలిపారు. ఇసుకను తరలించిన తర్వాత లోపలి గోడల పటిష్ఠతను పరిశీలించి గుడి పునర్ నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. పురావస్తుశాఖ, ఐఐటి మద్రాసు నిపుణులతో ఉన్న 30 మంది బృందం శాస్త్రీయపద్ధతిలో నిర్వహిస్తోంది. నిర్మాణంపై ఒత్తిడిని పర్యవేక్షించేందుకు 40 హైప్రెసిషన్ సెన్సార్లు కూడా ఏర్పాటుచేసారు. తాజ్‌మహల్ తర్వాత దేశంలో అత్యధికంగా సందర్శకులను ఆకర్షిస్తున్న స్మారకాల్లో కోణార్క్ రెండోది.

### బోగస్, నకిలీ హెచ్‌ఆర్‌సిలపై కమిషన్ సీరియస్

#### కఠిన చర్యలు తీసుకోండి: రాష్ట్రాలకు ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** మానవహక్కుల కమిషన్ తరహాలోనే గుర్తుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నకిలీ సంస్థలు, వ్యక్తులను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి సంస్థలపై దేశ వ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని గురువారం స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వంతో 2022లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) పేరుతో ఓ ఎన్జీవో రిజిస్టర్ అయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ సంస్థ తమకు నీతి ఆయోగ్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖల గుర్తింపు ఉందని ప్రచారం చేసుకుంటోందని పేర్కొంది. కర్ణాటకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఈ సంస్థకు స్టేట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఈ వ్యవహారం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఇలాంటి మోసపూరిత పేర్లు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయని, ఈ సంస్థలు ఎన్‌హెచ్ ఆర్‌సీలో భాగమని లేదా తమచే గుర్తింపు పొందాయని భ్రమ కల్పిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇది ప్రజల్లో కమిషన్ పట్ల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిధుల దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో పలుమార్లు హెచ్చరించినా, ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఎన్‌హెచ్ ఆర్‌సీ పేరును దుర్వినియోగం చేస్తున్న సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రత్యేకించి, ఢిల్లీలో రిజిస్టరై కర్ణాటకలో కార్యకలాపాలు సాగిస్తున్న సదరు నకిలీ సంస్థపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల ఉన్నతాధికారులను ఆదేశించింది.

### వెనిజులా చమురు కొనుగోలుచేస్తున్న బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ కంపెనీలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారత్ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో రష్యా నుంచి దిగుమతులు తగ్గించి, వెనిజులా వైపు మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తొలిసారిగా వెనిజులా నుంచి ముడిచమురు కొనుగోలు చేయగా, ప్రైవేటు సంస్థ హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్‌ఎంఈఎల్) రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ అక్కడి నుంచి దిగుమతులు చేపట్టింది. ఈ రెండు రిఫైనరీలు చెరో 1 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ప్రముఖ గ్లోబల్ ట్రేడర్ విటోల్ ద్వారా ఈ ఒప్పందం కుదిరింది. షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ రెండు ఆర్డర్లను ఒకే భారీ నౌక (వీఎల్ సీసీ) ద్వారా భారత్‌కు తరలించనున్నారు. బీపీసీఎల్ ఈ చమురును కేరళలోని కొచ్చి మరియు గుజరాత్‌లోని బీనా రిఫైనరీలకు తరలించనుంది. హెచ్‌ఎంఈఎల్ దీనిని గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్ ద్వారా పంజాబ్‌లోని బటిండా రిఫైనరీకి పంపనుంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందని, దానికి బదులుగా అమెరికా మరియు వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు పెంచుతుందని ట్రంప్ ప్రకటించారు. తాజా కొనుగోళ్లు ఈ ఒప్పందంలో భాగంగానే జరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వెనిజులా నుంచి లభించే మెరీ గ్రేడ్ ముడిచమురుపై భారీగా డిస్కౌంట్లు లభించే అవకాశం ఉంది. రష్యాపై ఆధారపడటం తగ్గించి, చమురు వనరులను వైవిధ్యం చేసుకోవడం వల్ల దేశ ఇంధన భద్రత మరింత బలపడుతుంది. అమెరికా నేరుగా వెనిజులా చమురు విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, భారతీయ రిఫైనరీలకు ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు లేకుండా తక్కువ ధరకు చమురు లభిస్తోంది. గతంలో 2019 వరకు వెనెజువెలా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసేది. అయితే అమెరికా ఆంక్షల వల్ల అది నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఈ వాణిజ్యం పుంజుకుంటోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఇప్పటికే వెనెజువెలా నుంచి నేరుగా చమురు దిగుమతి చేసుకునేందుకు అమెరికా నుంచి లైసెన్స్ పొందినట్లు సమాచారం.

#### అందరూ సమష్టిగా చేతులు పైకెత్తినా..

### ఓపెన్ ఎఐ, ఆంత్రోపిక్ సిఇఒలు విరుద్ధ ధోరణులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశ రాజధానిలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో ఓ అనూహ్య సన్నివేశం చోటుచేసుకున్నది. రెండు దిగ్గజ ఏఐ కంపెనీల మధ్య ఉన్న విభేదాలు స్పష్టంగా కనిపించాయి. గ్రూప్ ఫోటో కోసం వేదికపై నిలుచున్న ఏఐ ప్రతినిధులు చేతులు జోడించే సమయంలో రెండు కంపెనీలకు చెందిన లీడర్లు తమ చేతులను ఒకర్ని ఒకరు పట్టుకోలేదు. ప్రపంచ మీడియా ముందే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రధాని మోదీ చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మ్యాన్, ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ పక్కపక్కనే నిలుచున్నా ఆ ఇద్దరూ తమ చేతులను పట్టుకోలేదు. దీనికి బదులుగా ఆ ఇద్దరూ పిడికిలి బిగించి చేతులను పైకి ఎత్తారు. ఏఐ లీడర్లు అందరూ వరుసగా నిలబడ్డా ఆ ఇద్దరూ అయిష్టంగానే పక్కపక్కనే నిలుచున్నారు. కానీ చేతులను కలపడానికి వ్యతిరేకించారు. వరుస క్రమాన్ని బ్రేక్ చేసి కేవలం పిడికిలి మాత్రమే బిగించారు. దీంతో ఆ ఘటనకు చెందిన పిక్స్, వీడియోలు వైరల్ అవుతున్నాయి. కృత్రిమ మేధపై పనిచేస్తున్న ఓపెన్ ఏఐ కంపెనీ నుంచి అమడీ ఎప్పుడో వెళ్లిపోయారు. ఏఐని కమర్షలైజ్ చేస్తున్నట్లు ఆరోపించారు. భద్రతపై ఫోకస్ చేయడం లేదన్న ఉద్దేశంతో ఆ కంపెనీ వీడారు. అయితే సేఫ్టీ ముఖ్యమన్న లక్ష్యంతో ఆంత్రోపిక్ కంపెనీ పెట్టారు అమోడీ. ఏఐ టెక్నాలజీ అనేది కోట్లాది మంది ప్రజలకు చేరాలని ఆల్ట్‌మ్యాన్ భావిస్తున్నారు. ఇది సాధ్యం కావాలంటే ఓపెన్ ఏఐ తమ ఉత్పత్తులను ఎక్కువగా కమర్షలైజ్ చేయాలని ఆల్ట్‌మ్యాన్ ప్రయత్నిస్తున్నారు. సర్వీసులు అందుబాటులో ఉండాలంటే అడ్వర్టైజింగ్ అవసరమని అన్నారు. అయితే ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ మధ్య ఉన్న శత్రుత్వం ఇవాళ భారత మండపం వేదికపై స్పష్టంగా కనిపించింది. ఏఐపై తీవ్ర పోటీపడుతున్న ఈ రెండు కంపెనీలు ఇటీవల కోడింగ్ టూల్స్‌ను ఆవిష్క రించాయి. కొన్ని క్షణాల వ్యవధి తేడాలోనే ఆ టూల్స్‌ను రిలీజ్ చేశాయి. తమ పోరాటం కేవలం ఐడియాలకు మాత్రమే కాదు అని, ఉత్తమ ఉత్పత్తులను నిర్మించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు ఆ కంపెనీలు పేర్కొన్నాయి. అయితే ఏఐ భవిష్యత్తు కోసం కలిసి దిగ్గజ నేతలు ఒకరి చేతులను ఒకరు పట్టుకోకపోవడం శోచనీయమే అవుతుంది. ఐకమత్యానికి సంకేతంగా చేయి, చేయి పట్టుకోవాలని మోదీ కోరగా, ఏఐ లీడర్ల మధ్య ఉన్న విబేధాలు బయటపడ్డాయి.

తాజాగా ఆంత్రోపిక్ క్లాడ్ ఓపెన్ 4.6 ప్రొడెక్ట్‌ను లాంచ్ చేసింది. అయితే 20 నిమిషాల తేడాలోనే ఓపెన్‌ఏఐ సంస్థ జీపీటీ5.3 కోడెక్స్‌ను ఆవిష్కరించింది. రెండు కంపెనీల మధ్య ఉన్న వైరానికి ఢిల్లీ వేదికైంది.

## సంక్షిప్తంగా..

### ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం.. బ్రిటన్ రాజు ఛార్లెస్ సోదరుడి అరెస్టు



**లండన్, ఫిబ్రవరి 19:** ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వాటిల్లో పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆఫైళ్లలో బ్రిటన్‌రాజు సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ పేరు కూడాఉండటంతో రాజకీయంగా దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టుచేసినట్లు గురువారం యుకె పోలీసులు వెల్లడించారు. పదవీ దుర్వినియోగం ఆరోపణల కింద ఒక వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. మాజీ యువరాజు పేరు చెప్పకుండా ఈ అరెస్టు గురించి ప్రకటించారు. ఆండ్రూ బ్రిటన్‌రాజు ఛార్లెస్‌కు స్వయానసోదరుడు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో పేరువెలువడినప్పటినుంచి ఆండ్రూ తీవ్రఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అమెరికాకు చెందిన ఓ బాధితురాలు ఆయనపై లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

### ద.కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు



**సియోల్, ఫిబ్రవరి 19:** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో మార్షల్‌లా విధించిన కేసులో తీర్పు వెలువడింది. చట్ట విరుద్ధంగా పార్లమెంట్‌ను తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిక అధికారాన్ని చెలాయించేందుకు సైన్యం, పోలీసు బలగాలను సమీకరించినందుకు గానూ తిరుగుబాటు కింద ఆయనను దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి జీ కుయ్-యోన్ తెలిపారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవి కోల్పోయారు.

### కాలువలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు దుర్మరణం



**లక్నో, ఫిబ్రవరి 19:** కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో మధుర జిల్లాలోని మాగోర్రా పోలీసుస్టేషన్ పరిధిలో ఈ విషాదఘటన చోటు చేసుకుంది. అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు అక్కడికక్కడే ప్రాణాలుకోల్పోయారు. మృతులు రాహుల్ (23), అమిత్ (22), మోహిత్ (22)గా గుర్తించారు. మరో వ్యక్తిని వారి స్నేహితుడిగా గుర్తించినట్లు తెలిపారు. వారంతా రాజస్థాన్‌లోని డీగ్‌కు ఓ వివాహావేడుకలో పాల్గొనేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారమందుకున్నపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీయించి పోస్టుమార్టానికి పంపించారు.

### కరాచి బిల్డింగ్‌లో గ్యాస్‌లీకేజితో పేలుడు: 16 మంది మృతి



**కరాచీ, ఫిబ్రవరి 19:** పాకిస్థాన్‌లోని కరాచీలోని ఒక రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో గ్యాస్ లీకేజీ వల్ల పేలుడు జరిగింది. ఆ ప్రమాదంలో 16 మంది మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. కరాచీలోని సోల్జర్ బజార్ ఏరియాలో దుర్ఘటన జరిగింది. గుల్ రాణా కాలనీ ఏరియాలో ఉన్న ఓ బిల్డింగ్‌లో ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. గాయపడ్డవారిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 4.15 నిమిషాలకు బిల్డింగ్ తొలి ఫ్లోర్‌లో గ్యాస్ లీకేజీ పేలుడు ఘటన జరిగినట్లు తెలుస్తోందని ఏఎస్పీ జెంషెడ్ అఫేర్ తెలిపారు. గ్యాస్ పేలుడు వల్ల బిల్డింగ్‌లో కొంత భాగం కూలినట్లు రెస్క్యూ టీమ్ ఆఫీసర్ డాక్టర్ అబిద్ జలాలుద్దిన్ షేక్ తెలిపారు. మృతుల్లో 8 మంది మైనర్లు, నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. గాయపడ్డవారిలో ఏడు మంది మైనర్లు ఉన్నారు.

### సాంకేతిక లోపంతో విమానసర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** నెవిటేర్ వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా యూరప్‌తోపాటు ఢిల్లీ, ముంబై సహా దేశంలోని ఎయిర్‌పోర్టుల లో విమాన సర్వీసుల కు అంతరాయం ఏర్పడింది. నెవిటేర్‌వ్యవస్థలో దాదాపుగా 45 నిమిషాలపాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్‌ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. కానీ ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్‌ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది.



గిరిప్రదక్షిణకు హాజరైన జనం

## బంధుగణానికి శివపార్వతుల వీడ్కోలు

# గిరి ప్రదక్షిణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో జరిగింది. ముక్కంటీశుడు తన కల్యాణానికి పిలుచుకొని వచ్చిన కైలాసగిరుల్లోని ముక్కోటిదేవతలను మళ్ళీ వదిలిపెట్టడానికి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను ఎంతో ముచ్చటగా అలంకరించి రుద్రాక్ష పల్లకిలో ప్రతిష్ఠించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, బోర్డు సభ్యులు హాజరై స్వామి అమ్మవార్లకు పూజలు జరిపి హారతులిచ్చి గిరి ప్రదక్షిణకు సిద్ధం చేసారు. బోయిలు మోసుకుంటు, మేళాతాళాలు, తప్పెట్ల మోతతో గిరిప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ఆయన కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, సూపరిం టెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి పర్యవేక్షించారు. సాయంత్రం వరకు గిరిప్రదక్షిణం సాగి రాత్రి శ్రీకాళహస్తి చేరుకున్నారు.

# పుష్పాలంకార ప్రియుడికి రోజూ 300 కిలోల పుష్పాలు

## ఏడుకొండల స్వామికి పూల పరిమళం



తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు.. ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి ప్రతిరోజూ సగటున 300కిలోల సువాసనల పుష్పాలు వినియోగిస్తున్నారు. నిత్య ధూపదీప నైవేద్యాలకు సగటున 300 కిలోల పుష్పాలు వినియోగిస్తుండగా, తిరుపతిలోని స్థానిక ఆలయాలు, ఇతర దేవాలయాల అవసరాలకు అదనంగా సంవత్సరానికి సుమారు మూడు లక్షల కిలోల పుష్పాలు సరఫరా జరుగుతోంది. ఏటా 2.70 లక్షల కిలోల పుష్పాల వినియోగి స్తున్నారు. శేషాచలం కొండల్లో ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంతో 61 ఎకరాల్లో టిటిడి ఉద్యాన వనాలు విస్తరించాయి. శ్రీవారి పుష్ప కైంకర్యానికి టిటిడి ఉద్యానవన విభాగం దాతల సహకారం తో పుష్పోత్పత్తి, ఉద్యానవన సంరక్షపురాణాల్లో పుష్ప మండపంకు ప్రాధాన్యత ఉంది. ప్రపంచం లో ఎక్కడాలేని విధంగా నభూతో న భవిష్యత్ అన్న రీతిలో తిరుమలలో స్వామివారికి నిత్యం పుష్ప కైంకర్యాలు నిర్వహిస్తుంటారు. పుష్ప కైంకర్యాలకు నిర్విఘ్నంగా పుష్పాలను సరఫరా చేస్తూ స్వామివారి పుష్ప కైంకర్యాలకు టిటిడి ఉద్యానవన విభాగం వెన్నుముకగా నిలుస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యానవన విభాగం 1991 నుండి తిరుమల, తిరుపతిలోని ఉద్యానవనాల అభివృద్ధి, సంరక్షణతోపాటు శ్రీవారి ఆలయానికి అవసరమైన పుష్పాల సరఫరాలో కీలక పాత్ర పోషిస్తోంది. 54 ఎకరాలు అలంకార ఉద్యానవనాలు, మిగిలిన ఏడు ఎకరాలు పుష్పోత్పత్తి తోటలుగా వినియోగంలో ఉన్నాయి.

తిరుమలలో ఏడాదికి దాదాపు 450కు పైగా ఉత్సవాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, పుష్పాల అవసరం భారీ స్థాయిలో ఉంటుంది. శ్రీవారి ఆలయం, ఉప ఆలయాలకు సంవత్సరానికి సుమారు 2.60లక్షల నుంచి 2.70లక్షల కిలోల పుష్పాలు అవసరమవుతుండగా, ప్రతిరోజూ ఈ నేపథ్యంలో దేశ, విదేశాల నుండి పుష్పాలను సేకరించడంతోపాటు ఎప్పటికప్పుడు పుష్పాలను సరఫరా చేసేందుకు శ్రీవారి పుష్ప కైంకర్యంలో ఉద్యానవన విభాగం విశేష కృషి చేస్తోంది. బ్యాంకాక్, మలేషియా, ఇంగ్లాండ్, అమెరికా వంటి దేశాల నుండి కూడా నాణ్యమైన పుష్పాలను సేకరిస్తూ ఉద్యానవన విభాగం స్వామివారి కైంకర్యాలకు పుష్పాలను సరఫరా చేయిస్తోంది. ప్రతి ఏడాది కార్తీక మాసంలో వచ్చే శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున నిర్వహించే పుష్పయాగ మహోత్సవానికి 16 నుండి 18 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలను సేకరిస్తారు. ఆ రోజున స్వామివారికి ప్రతిరోజూ సమర్పించే అన్ని రకాల పుష్పాలు, పత్రాలను దాదాపు 10 టన్నులు సేకరించి పుష్పకైంకర్యం చేసేందుకు టిటిడి ఉద్యానవన విభాగం కీలకపాత్ర పోషిస్తోంది. తిరుమలకొండపై, తిరుపతి నగరం పరిసరాల్లోని అలంకార ఉద్యానవనాలు, సర్కిళ్ళ సంరక్షణలో దాతల పాత్ర విశేషం. మొత్తం 20ప్రాంతాల్లో దాతల సహకారంతో ఉద్యాన వనాల సంరక్షణ జరుగుతుండగా, ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో మరో 16 ప్రాంతాల్లో ప్రత్యక్షంగా నిర్వహణ చేపడుతున్నారు. కొండపై గీతోపదేశం పార్క్, నామాల పార్క్, గరుడ సర్కిల్, లేపాక్షి సర్కిల్, శ్రీవారి పుష్ప ఉద్యానవనం వంటి ప్రాంతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రకృతి అందాలతో కూడిన ఉద్యానవనాలను పరిరక్షిస్తూ, భక్తులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తోంది.





# నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

## పద్మావతీ మహిళ డిగ్రీ కళాశాలలో మరింత మెరుగైన ఫలితాలు: టిటిడి జెఇఒ డాక్టర్ శరత్

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో నడుస్తున్న పద్మావతి మహిళ డిగ్రీకళాశాలలో నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా సేవలందించాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ సూచించారు. మహిళా డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం జెఇఒ డాక్టర్ శరత్ డిగ్రీ కళాశాల, హాస్టల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జెఇఒ శరత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి విద్యా సంస్థలలో సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. టిటిడి పాలక మండలి సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం 3,106 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తుండగా, వారిలో 2,350 మంది హాస్టల్ వసతి పొందుతున్నారని తెలిపారు. కళాశాల ప్రతిష్టను మరింత పెంపొందించేలా నాణ్యమైన విద్య అందించడమే ప్రధాన లక్ష్యమని, అందుకు అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి జెఇఒ హాస్టల్‌లో భోజనం చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భద్రమణి, వార్డెన్ డాక్టర్ మల్లీశ్వరి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# 21, 22న నాదోపాసన

## పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పిడిసిఎల్

తిరుపతి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: వాగ్దేవి కళా సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధక్షేత్రాలైన ఒంటిమిట్ట, తాళ్లపాక, భద్రాచలం ఆలయ ప్రాంగణాల్లో శాస్త్రీయ సంగీతం, సాహిత్యాల పునరుజ్జీవనమే లక్ష్యంగా నాదోపాసన శ్రేణి ద్వారా శాస్త్రీయ సంగీత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. రేపు 21న ఒంటిమిట్ట, 22న రాజంపేటలో నాదోపాసన కార్యక్రమాలు వాగ్దేవి కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఈ గోడపత్రికలను గురువారం ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ ఆవిష్కరించారు. ఈనెల 22వ తేదీన రాజంపేటలోని అన్నమయ్య ధ్యాన మందిరంలో తిరుపతికి చెందిన సాంప్రదాయ పాఠశాల విద్యార్థులచే అన్నమాచార్య సంకీర్తనల గానం ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో వరుసగా 24 వేల శ్లోకాలను సంస్కృతంలో రచించిన వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా తెలుగులోకి అనువదించి "ఆంధ్ర వాల్మీకి" గా ప్రఖ్యాతిగాంచిన వావిలికొలను సుబ్బారావు, శ్రీమద్భాగవతాన్ని ఆంధ్రీకరించిన బమ్మెర పోతనామాత్యుల వారి స్మృతిలో, తొలి వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వారి స్మృతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని, భగవంతుడి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళా సమితి ప్రతినిధులతో పాటు ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, సిహెచ్ రామచంద్రరావు, ఎం. మురళి కుమార్, కంపెనీ సెక్రటరీ బివిఎస్ ప్రకాష్, ఎస్ఈ సివిల్ డి. తిరుమలరావు పాల్గొన్నారు.



# గజల్ శ్రీనివాస్‌కు శ్రీకృష్ణదేవరాయ పురస్కారం

విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు భాషకు చేస్తున్న విశిష్ఠ సేవలకు గాను ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, ప్రఖ్యాత గజల్ గాయకుడు డా.గజల్ శ్రీనివాస్‌కు శ్రీకృష్ణదేవరాయ పురస్కారం లభించింది. శ్రీకృష్ణదేవరాయ జయంతి సందర్భంగా గజల్ శ్రీనివాస్‌ను ఎమ్.ఎస్.బాలసుబ్రహ్మణ్యం కళా సంస్థ కె.వి.బ్రహ్మానందం, తెలుగు కళా వాహిని సంస్థలు సంయుక్తంగా విజయవాడ కాతా పూర్ణానంద హాలులో శ్రీకృష్ణదేవరాయ పురస్కారం- స్వర్ణకంకణ ప్రదానంతో ఘనంగా సత్కరించాయి. విశ్వ గజల్ గాయన సార్వభౌమ అన్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాల కృష్ణ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ మాతృభాషా అభ్యున్నతికి చేస్తున్న కృషి అమోఘం అన్నారు. భాషోద్యమంలో కళాకారులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. గజల్ శ్రీనివాస్ గాన ప్రతిభను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా గోళ్ల నారాయణ రావు, విశిష్ఠ అతిథులుగా రోటరీ పూర్వ గవర్నర్ ఎమ్.సి.దాసు, ప్రముఖ రచయిత రసరాజు, రచయిత కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అమ్మకం దారులు అరెస్ట్

## - 340 గ్రాముల గంజాయి స్వాధీనం

నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: రాష్ట్రాల నుంచి నెల్లూరుకు గంజాయి తీసుకొచ్చి విక్రయాలు జరిపే వ్యక్తితో పాటు మరో వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 340 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోతిలాల్ స్థానిక ఆటోనగర్ లో గ్యాస్ వెల్డర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అతను ఉత్తరప్రదేశ్ నుండి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి ఆటోనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతూ ఉంటాడు. రామకోటయ్య నగర్‌కు చెందిన షఫీ గంజాయి సేవించడంతో పాటు మోతులాల్ వద్ద కొనుగోలు చేసి ఇతరులకు గంజాయి విక్రయిస్తుంటాడు. గంజాయి అమ్మకాలపై పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ఆటోనగర్‌లో సోదాలు నిర్వహించగా, షఫీ గంజాయి సేవిస్తూ దొరికాడు. అతని ఇచ్చిన సమాచారంతో మోతిలాల్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 340గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



చిల్లకూరు (నెల్లూరు), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: చిల్లకూరు లోని వరగలి క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న భారత్ పెట్రోల్ బంకు వద్ద బుధవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాగా ఇద్దరికి గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గూడూరు పట్టణంలోని బొగ్గుల దిబ్బకి చెందిన మైపాడు సాయి మహేష్‌గా స్థానికులు గుర్తించారు. స్థానిక పోలీసులు మైపాడు సాయి మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బూతులు మాట్లాడేవారిని నియంత్రించేలా చట్టం చేయాలి

## అసెంబ్లీలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: బూతులు మాట్లాడుతున్న రాజకీయ నాయకులను నియంత్రించేలా ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అసెంబ్లీలో కోరారు. గురువారం ఉదయం జీరో అవర్‌లో యార్లగడ్డ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు, ఉప ముఖ్యమంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులను అసభ్య పదజాలంతో, బండబూతులు తిడుతున్న రాజకీయ నాయకులకు కళ్లెం వేసేలా రూలింగ్ ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఇటీవల ఓ మాజీ మంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రిని బండబూతులు తిట్టడం దారుణమని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీలోనూ మండలిలోనూ సభ్యులపై వ్యక్తిగత ధూషణలు జరుగకుండా సభా మర్యాదలను కాపాడేలా చూడాలన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తున్న సమస్యలకు మంత్రులు సమాధానం ఇస్తూ అవును, కాదు, లేదు, ఉత్పన్నం కాదు అంటూ జవాబులు చెప్పటం వల్ల టివిల్లో అసెంబ్లీ సమావేశాలు చూస్తున్నవారికి ఏ సమస్యకి ఏ సమాధానం ఇస్తున్నారో తెలియన పరిస్థితి నెలకొంటుందన్నారు. క్లుప్త ంగా ప్రశ్నను దాని జవాబును చెప్పేలా చూడాలన్నారు. జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావిస్తున్న సమస్యలకు మంత్రుల నుండి సరైన స్పందన ఉండటం లేదని, తాము ప్రస్తావించిన సమస్యలు ఏమయ్యాయే తెలియని అయోమయ పరిస్థితి ఎదురవుతుందన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన నందమూరి తారక రామారావులకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసారు. భావితరాలకు తెలిసేలా సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్, బకించంద్ర చటర్జీ, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ తదితర 40మంది ప్రముఖుల విగ్రహాలను రాజధానిలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్‌కు దిక్సూచి అని కొనియాడారు. ఆశతో ఉన్నవారికి అధికారం ఇస్తే దోచుకుంటారని, ఆశయం ఉన్నవారికి ఇస్తే అభివృద్ధి చేస్తారని 1962 సంవత్సరం పుచ్చలపల్లి సుందరయ్య అసెంబ్లీలో చెప్పిన మాటలను ఊటంకిస్తూ గత పాలకులు రాష్ట్రాన్ని దోచుకోగా ఈప్రభుత్వం ప్రజలకు మేలు చేసేలా బడ్జెట్‌ను రూపొందించటమే కాకుండా రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందని యార్లగడ్డ ప్రశంసించారు.



# డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య కీలకపాత్ర

**హత్యకేసులో కొత్త కోణం.. బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్**



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 19 ప్రభాత వార్త: తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడైన తన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలో అనంతబాబు భార్య అనంతలక్ష్మి దుర్గ కీలకపాత్ర ఉన్నట్లు ప్రాసిక్యూషన్ పేర్కొనడం సంచలనంగా మారింది. ఈ కేసులో ఆమెను ఏ2గా చేరుస్తూ రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. హత్య అనంతరం కాల్ డేటా, సీసీఫుటేజ్ ఆధారంగా కారు డ్రైవర్ సుబ్ర హ్మణ్యంను 2022 మే 19న హత్య చేసి మృతదేహాన్ని కారులో తీసుకువెళ్లి డోర్ డెలివరీ చేసే సమయంలో ఆమె కూడా ఉన్నట్లు నిర్ధారణ చేశారు.

ఎమ్మెల్సీ అనంతబాబు భార్య అనంతలక్ష్మి అలియాస్ రోజా కోసం పోలీసులు గాలిస్తున్నారు. అనంత బాబు తన భార్యను అరెస్టు చేయకుండా మందస్తు బెయిల్ కోసం ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై వైసిపి ప్రభుత్వం హయాంలో దర్యాప్తు ముందుకు జరగలేదని బాధిత కుటుంబీకులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో ప్రాసిక్యూషన్ అనుమతితో విచారణకు రావడంతో డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి హామీ ఊపిరి తీస్తున్నారు

## - కేంద్రం తీరుపై పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం




గుంటూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: వైఎస్సార్ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలంలో షర్మిల పర్యటించారు. వేల్పూరు గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో షర్మిల మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, నాటి పిఎం మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఉపాధి హామీ పథకం తీసుకువచ్చారని అన్నారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కరువు, వలసలు, ఆకలి చావులు తగ్గాయని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. పేదల కడుపు నింపే ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని బిజెపి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఉపాధిలో ఊపిరి తీసి తెచ్చిన కొత్త చట్టం ద్వారా గ్రామాల్లో ఉపాధి లేకుండా చేశారని అన్నారు. మన్రేగా కింద గ్రామంలో ఏం పని కావాలో గ్రామ సభలు నిర్ణయించేవని అయితే కొత్త చట్టం జి రామ్ జి ద్వారా గ్రామాల్లోని పనులు ఢిల్లీలో నిర్ణయిస్తారంట అని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ శ్రామికులను కాంట్రాక్టులకు లేబర్ సప్లయ్ చేసే వ్యవస్థగా మారుస్తున్నారని తెలిపారు. ఉపాధి పథకం ఊపిరి తీస్తుంటే చంద్రబాబు, జగన్, పవన్ నోరు విప్పడం లేదని ధ్వజమెత్తారు. జి రామ్ జి అక్రమ చట్టానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. వైఎస్సార్ ఆశయాల నుంచి పుట్టిన పథకాన్ని చంపుతుంటే జగన్ నోరువిప్పకపోవడం అన్యాయమని షర్మిల ఆవేదన వ్యక్తంచేశారు.

# విద్యుత్ సుంకం పెంపు ఉపసంహరించుకోవాలి: సిపిఎం

విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు, కుటీర పరిశ్రమలపై, వాణిజ్య కనెక్షన్స్‌కు యూనిట్‌కు ఆరు పైసలు గా ఉన్న విద్యుత్ సుంకాన్ని ఒక రూపాయికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించడం కూటమి ప్రభుత్వ హామీకి విరుద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యుత్తు సుంకం తగ్గించాలన్నారు. "ఇప్పటికే ఫెర్రో ఎల్లాయెస్, టెక్స్‌టైల్ మిల్స్, చిన్న వ్యాపారస్తులు దారుణంగా నష్టపోతున్న స్థితిలో ఈ భారం మోపడం అన్యాయం. ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీలతో చిన్న పరిశ్రమలు, వ్యాపారస్తులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని అవకాశం ఉంటే తగ్గిస్తామని చెబుతూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సుంకాన్ని 15 రెట్లు పెంచడం దారుణం. గత వైసిపి ప్రభుత్వం చేసిన పెంపుదలను టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు చట్టబద్ధం చేయడం ద్వారా విద్యుత్తు సంస్కరణల విషయంలో రెండు పార్టీలు ఒకటేనని రుజువు అవుతోంది. ఇప్పటికైనా పెంపుదల బిల్లును ఉపసంహరించుకొని విద్యుత్ సుంకాన్ని గతంలో మాదిరిగా ఆరు పైసలు చొప్పున మాత్రమే వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని శ్రీనివాసరావు అన్నారు.

# అసెంబ్లీలో నూజివీడు విద్యార్థులు

ఏలూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త బ్యూరో: ఆంధ్రప్రదేశ్ శాసనసభను విద్యార్థులు సందర్శించారు. ఈ అవకాశాన్ని దక్కించుకున్న నూజివీడు నియోజకవర్గానికి చెందిన 40 విద్యార్థులకు అక్కడ ఎమ్మెల్యేలు మంత్రులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని ఉత్సాహపరుస్తూ పలువురు మంత్రులు పలు హామీలను ఇచ్చారు. విద్యలో ప్రతిభ చూపించిన వారికి ఆర్థికంగా సహకరిస్తానని గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీనిచ్చారు. ఏపీ శాసనసభ వ్యవహారాలను పరిశీలించి, అవగాహన పొందేందుకు రాష్ట్ర శాసనసభ ఇచ్చిన అవకాశం మేరకు గురువారం ఉదయం శాసనసభ వ్యవహారాలను వీఐపీ గ్యాలరీలో ఉండి పరిశీలించిన విద్యార్థులు బయటకు వచ్చిన అనంతరం వారితో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సవితమ్మ సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రాష్ట్ర శాసన వ్యవస్థపై, చట్టాలపట్ల అవగాహన పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఈ అవకాశాన్ని మన రాష్ట్ర విద్యార్థులకు అందిస్తోందన్నారు. రాష్ట్ర సంక్షేమం కోసం ప్రభుత్వం చట్టాలు ఎలా చేస్తుంది? ప్రజా సమస్యల మీద శాసనసభలో ఎలాంటి చర్చలు చేస్తుంది? ప్రజల హక్కులు, చట్టాలపై ఎలాంటి చర్చలు జరుగుతాయి అనే ప్రతి అంశాన్ని విద్యార్థులు గమనించి, అవగాహన పొందాలనేది దీని ఉద్దేశమని వివరించారు. విద్యార్థి దశలో వీటిపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ఆసక్తి ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ మరింత ఉత్తమంగా చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలంటే ఇది ఒక మంచి ప్రయత్నం అని సూచించారు.



విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: మంత్రి సవితమ్మ

శాసనసభకు వెళ్లిన నూజివీడు విద్యార్థులతో మంత్రి సవితమ్మ సరదాగా కాసేపు ముచ్చటించారు. ఎలా చదువుతున్నారని విద్యార్థులను మంత్రి సవితమ్మ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులంతా బాగా రాణించాలని సూచించారు. క్రీడారంగంలోనూ భవిష్యత్తులో చాలా మంచి అవకాశాలు వస్తాయని, వాటిని కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. సబ్జెక్టు మక్కువ ఉన్న సబ్జెక్టుపై శ్రద్ధ పెట్టి చదవాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని సూచించారు. తదనంతరం విద్యార్థులతో మంత్రులు పార్థసారథి, సవితమ్మ ఫొటోలు దిగి విద్యార్థులకు సంతోషాన్ని నింపారు.

# అయేషా మీరా కేసును సిటింగ్ జడ్జితో విచారించండి

## - న్యాయస్థానానికి అయేషా తల్లిదండ్రుల విజ్ఞప్తి

విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఆయేషా మీరా హత్య కేసులో సిబిఐ రిపోర్టుపై ఆమె తల్లిదండ్రుల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసారు. 18 ఏళ్ళ కితం ఇబ్రహీంపట్నంలో ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా దారుణంగా అత్యాచారానికి గురయ్యారు. ఆమెను కిరాతకంగా చంపేసారు. ఈ కేసులో నందిగామకు చెందిన పిడతల సత్యంబాబును పోలీసులు నిందితునిగా అరెస్ట్ చేసారు. కోర్టు అతనికి యావజ్జీవ ఖైదు శిక్షను విధించింది. అయితే 8ఏళ్ళకు పైగా సత్యంబాబు రాజమండ్రి జైలు శిక్ష అనుభవించారు. అయితే ఏడేళ్ళ కితం ఈ కేసును హైకోర్టు కొట్టేసింది. అనంతర పరిణామాల్లో ప్రభుత్వం ఈ కేసులో సిబిఐ విచారణను న్యాయస్థానం మేరకు ఆదేశించింది. సిబిఐ విచారణ నివేదికపై అయేషామీరా తల్లిదండ్రులు విచారణ సందర్భంలో అభ్యంతరం వ్యక్తం చేసారు. దాంతో కేసులు స్వయంగా విచారణ జరిపించుకుంటారా అని ఆయేషా తల్లిదండ్రులను న్యాయమూర్తి అడిగారు. తమ దగ్గర డబ్బులు లేవని ఆయేషా తల్లి దండ్రులు కోర్టుకు తెలిపారు. 18 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా న్యాయం జరగలేదని కోర్టుకు తెలిపిన ఆయేషా మీరా తల్లిదండ్రులు. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది. సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి. సిబిఐ దర్యాప్తు సరిగా జరగలేదని ఆయేషా తల్లిదండ్రులు కోర్టులో వాదించారు.

# నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుల రిమాండ్ గడువు పెంపు

**మద్యం స్కాం కేసులో బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా**

విజయవాడ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి: నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుల రిమాండ్ గడువుని విజయవాడ ఎక్సైజ్ కోర్టు పొడిగించింది. రిమాండ్ గడువుని మార్చి 5వ తేదీ వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గురువారం సిట్ అధికారులు నకిలీ మద్యం తయారీ కేసు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. విజయవాడ, నెల్లూరు, మదనపల్లె జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న 10మంది నిందితులను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయస్థానంలో హాజరుపరిచారు. బెయిల్‌పై ఉన్న వారిలో 12 మంది నిందితులు కోర్టుకు హాజరయ్యారు. అయితే జోగి రమేశ్, జోగి రాము ఈ విచారణకు హాజరుకాకుండా గైర్హాజరు పిటిషన్‌ని దాఖలు చేశారు. ఇక ఎపి మద్యం కుంభకోణం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్లపై విచారణని విజయవాడ ఏసిబి కోర్టు ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

## జంట హత్యల కేసులో నిందితులు అరెస్టు

### భూ సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి: సిఐ

శింగనమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: శింగనమల మండలం తరిమెల గ్రామంలో ఇటీవల జరిగిన జంట హత్య కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కౌలుట్లయ్య హత్యకు దారితీసిన పరిస్థితులు, నింధితులు ఉపయోగించిన ఆయుధాలు, అరెస్టు వివరాలు తదితరాలను మీడియాకు తెలియజేశారు. ఈ నెల 2వ తేది రాత్రి 10:30 గంటల సమయంలో మండల పరిధిలోని తరిమెల గ్రామంలో దండోరా నల్లప్ప అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు. అతను చనిపోయిన తర్వాత భూమి, ఇల్లు విషయంలో తన రెండోభార్య అయిన దండోరా యల్లమ్మ, ఆమె కుమారుడు దండోరా అంబేద్కర్ అలియాజ్ చిన్నలు నల్లప్ప, మొదటి భార్య లక్ష్మిదేవి, కుమారులకు తెలియకుండా యల్లమ్మ ఆమె పేరు మీదికి భూమి ఇల్లు మార్చుకున్నారని ఆ విషయంలో మొదటి భార్య లక్ష్మిదేవి, కుమారుడు దండోరా మాదిగ జగజ్జీవన్‌రామ్ అలియాజ్ మోహన్, దండోరా ఓంకార్‌లు, అతని స్నేహితులైన శ్రీనివాసులు, సాయికిరణ్‌లు కలిసి రెండోభార్య వారి స్వగృహంలో మాట్లాడుకుంటున్న సమయంలో మొదటి భార్యకు చెందిన కుమారులు, స్నేహితులు మారణాయుధాల (కొడవళ్ళ)తో దాడిచేసి విచక్షణ రహితంగా నరికారు. ఈ సంఘటనలో కొడుకు అక్కడికక్కడే పడిపోవడంతో తల్లి మాత్రం ఎదురింటిలోకి పరుగులు తీసింది. కొన ఊపిరితో ఉన్న అతనిని బండరాయి వేసి దారుణంగా హతమార్చారు. అనంతరం ఎదురింటిలోకి పరుగులు తీసిన దండోరా యల్లమ్మపై దాడిచేసి గొంతుకోసేసి తలను మొండెంను వేరుచేసి తలను పట్టుకుని వీధిలో తిరిగి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు తమకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం(18వతేది) సాయంత్రం పాత కల్లూరు, తరిమెల రోడ్డు పక్కన ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఎదురుగా నింధితులు ఉన్నారన్న పక్కా సమాచారంతో అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.

**భూ సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి:** గ్రామాలలో భూ సమస్యలు ఏర్పడితే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, సమస్యల పరిష్కారానికి మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు, జిల్లా రెవెన్యూ అధికారులు అనేక మంది ఉన్నారని, అనవసరంగా ఆవేశానికి లోనై ఘర్షణలకు, దాడులు, హత్య యత్నాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించు కోలేరని ఆయన హెచ్చరించారు. ఈ పత్రికా సమావేశంలో శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్, నార్పల ఎస్ఐ సాగర్, గార్లదిన్నె ఎస్ఐ మహ్మద్ గౌస్, శింగనమల ఏఎస్ఐ చితంబరయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## తిరుమలలో ఇద్దరు బాలికలు మిస్సింగ్

### చిన్నారులను సురక్షితంగా రక్షించిన పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తప్రతినిది: ఈ నెల 16వ తేదీ తిరుమలలోని నాదనీరాజనం ప్రాంతంలో నవదుర్గ (05) అశ్విని(03) ఇద్దరు బాలికలు కనిపించకపోవడంతో కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు ఆధారంగా ప్రత్యక్ష సాక్షుల నుండి సమాచారం సేకరించారు. ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పడి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టగా, అన్నమయ్య జిల్లా కలకడ మండలానికి చెందిన గుండ్లూరు శివమ్మ (42) చిన్నారులను అపహరించినట్లు వెలుగులోకి వచ్చింది. నిందితురాలు చిన్నారులను తిరుమల నుండి తిరుపతి మీదుగా రైలులో తీసుకెళ్లి, 17న కొవ్వూరు రైల్వే స్టేషన్ వద్ద ఉండగా రైల్వే పోలీసులు ముద్దాయిని మరియు చిన్నారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుమల పోలీసుల సూచనల మేరకు చిన్నారులను రాజమహేంద్రవరం బాలల సంరక్షణ గృహానికి అప్పగించి, నిందితురాలిని మహిళల హోంకు తరలించారు. పోలీసుల విచారణలో గుండ్లూరు శివమ్మ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తిరుమలకు వచ్చి బిక్షాటన చేస్తూ ఉండగా, ఒంటరిగా ఉన్న చిన్నారులను గమనించి, వారిని అపహరించి బలవంతంగా బిక్షాటన చేయించేందుకు ప్రణాళిక రచించినట్లు నేరాన్ని అంగీకరించింది. ఆమె తన నేరాన్ని స్వచ్ఛందంగా అంగీకరించినందున, గుండ్లూరు శివమ్మను అరెస్ట్ చేశారు. తదుపరి ఇద్దరు చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం తిరుపతిలోని సిడబ్ల్యూసి ద్వారా తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు తమ చిన్నపిల్లలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులపై విశ్వాసం ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తిరుమల పోలీసులు సూచించారు. చిన్నారుల భద్రతకు భంగం కలిగించే విధంగా ఎవరైనా చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన తిరుమల టు టౌన్ సీఐ రాముడు, వన్ టౌన్ ఎస్ఐలు డి. రమేశ్ బాబు, సి.చలపతి, సీసీఎస్ ఎస్ఐ నరేష్ సిబ్బందిని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు అభినందించారు.




## రాష్ట్రాల సమన్వయంతో వ్యవసాయ పథకాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి జరిపిన కేటాయింపులను వినియోగించే విషయంలో రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖల మంత్రి శివ రాజ్‌సింగ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. వ్యవ సాయ రంగానికి సంబంధించి 2026-27 కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రకటనలను సంబంధిత రాష్ట్రాలతో సంప్రదించి అమలుచేయడానికి యుద్ధ ప్రాతిపదికన పని చేయాలని మంత్రి మంత్రిత్వ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. రబీ పంటల విత్తనాల తాజా స్థితి, కీలకమైన వ్యవసాయ వస్తువుల ధరల ధోరణులను అంచనా వేయ డానికి నిర్వహించిన ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ పథకాల అమలులో వెనుకబడిన రాష్ట్రాలతో సమీక్షలు నిర్వహించి, సకాలంలో అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీలోని కృషి భవన్‌లో ప్రస్తుత రబీ విత్తనాలు, ధరల పరిస్థితి, పథకాల అమలును కేంద్ర మంత్రి సమీక్షించారు. రబీ సీజనుకు సంబంధించి విత్తనాల పంపిణీ సకాలంలో సరిపడా చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల పరిస్థితిని కూడా నిశితంగా పరిశీలించబడుతోందని పేర్కొన్నారు. కృషోన్నతి యోజ న, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాల కింద రాష్ట్రా లకు నిధుల విడుదల వాటి వినియోగం పట్ల రాష్ట్రాలను అప్రమత్తం చేయాలన్నారు. సకాలంలో, సమర్థవంతంగా ఆయా పథకాలు అమలు జరిగేలా చూసుకోవడానికి, ముఖ్యంగా నిధుల వినియోగం అంచనా స్థాయిల కంటే తక్కువగా ఉన్న సందర్భాల్లో, రాష్ట్ర ప్రభుత్వాలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి న అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో, వివిధ రబీ పంటల ప్రస్తుత విత్తనాల స్థితి, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు ఇతర ఆహార ధాన్యాల ధరల పరిస్థితులను గూర్చి చర్చించారు. ఫలితాల ఆధారిత పాలన యొక్క ప్రాముఖ్యతను చెబుతూ, వ్యవసాయ పథకాల వాస్తవ ప్రభావాన్ని అంచ నా వేయడానికి, తుది వినియోగదారుల నుండి ముఖ్యం గా రైతుల నుండి ప్రత్యక్ష అభిప్రాయాన్ని పొందాలని చౌహాన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది, అధికారులు పాల్గొన్నారు.







# విశాఖ కేవలం ఆతిథ్య నగరమే కాదు... తూర్పు సముద్ర తీరానికి హృదయం!

### ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేయడమే కాదు.. పర్యాటక అభివద్ధికి దోహదం గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉద్ఘాటన

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 ప్రభాతవార: విశాఖ కేవలం ఆతిథ్య నగరం మాత్రమే కాదు.. ఇది మన తూర్పు సముద్ర తీరానికి హృదయమని, దీని గుర్తింపు ఎల్లప్పుడూ సముద్రం ద్వారా రూపొందించబడిందంటూ ఏపీ రాష్ట్ర గవర్నర్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కొనియాడారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ భాగంగా గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో మిలాన్2026 సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్‌లో ఆయన మాట్లాడారు. ముందు బంగాళాఖాతం, మన చుట్టూ లక్షలాది మంది గర్వించదగిన పౌరులతో ఇక్కడ నిలబడటం తనకు చాలా గర్వంగా, వ్యక్తిగతంగా ఆనందంగా ఉందన్నారు. తరతరాలుగా, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అవకాశం, శ్రేయస్సు, విస్తృత ప్రపంచంతో సంబంధం కోసం ఈ జలాల వైపు చూస్తున్నారని, ఈ రాత్రి, ఆ జలాలు మన తీరంలో లంగరు వేయబడిన ప్రపంచ సముద్ర భాగస్వామ్యానికి శక్తివంతమైన చిహ్నమైన భారత నావికాదళం గర్వ వేదికలతో పాటు స్నేహపూర్వక విదేశీ నావికాదళ నౌకలు, విమానాల అసాధారణ సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్నాయన్నారు. గత కొన్ని రోజులుగా, మన నగరం అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష, ఖండాంతరాల నుంచి నౌకలు, విమానాలు, ప్రతినిధులను ఒకచోట చేర్చే వ్యాయామం మిలాన్ నిర్వహణను చూసిందన్నారు.

భారత రాష్ట్రపతి సమీక్షించిన ఈ ఫ్లీట్ సమీక్ష సముద్రంలో ఒక గంభీరమైన దృశ్యమన్నారు. నేడు, ఈ అంతర్జాతీయ నగర కవాతు ఆ స్ఫూర్తిని ఒడ్డుకు తీసుకువెళుతుందన్నారు. ఈ వ్యూహాత్మక సహకారాన్ని ప్రజలతో పంచుకునే వేడుకగా మారుస్తుందని వివరించారు. ఈ సాయంత్రం అందరిదీ.. ఈ సాయంత్రం సాయుధ దళాలకు మాత్రమే కాదని.. ఇక్కడ గుమిగూడిన ప్రతి పౌరుడికి కూడా చెందుతుందని రాష్ట్ర గవర్నర్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వివరించారు. భారత నావికాదళ నౌకలు, విమానాల ద్వారా నైపుణ్యం, ఖచ్చితత్వం, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించే అద్భుతమైన కార్యాచరణ ప్రదర్శనను మనం చూశాము. సైన్యం, నావికాదళం, వైమానిక దళం, కోస్ట్ గార్డ్ యొక్క మార్చింగ్ కంటింజెంట్లు, సైనిక బృందాలు క్రమశిక్షణతో సామరస్యంతో కదులుతాయన్నారు. ఇది మన సాయుధ దళాల ఐక్యతను ప్రతిబింబిస్తుంది. దేశాల మధ్య స్నేహం, నమ్మకం మరియు పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తూ విదేశీ విమానాలు, కవాతు బృందాలు, వారి బృందాలు భారత గడ్డపై గర్వంతో కవాతు చేయడాన్ని చూడటం కూడా తమకు గౌరవమని పేర్కొన్నారు.

నేషనల్ క్యాడెట్ కార్ప్స్, సీ క్యాడెట్ కార్ప్స్, స్కూల్ పిల్లలు పాల్గొనడం నాకు ఆనందం కలిగిస్తుందన్నారు. యూనిఫాంలో ఉన్న ఈ యువ బాలబాలికలను చూసినప్పుడు, తనకు క్రమశిక్షణ, ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం కనిపిస్తుందన్నారు. వారు మన దేశ భవిష్యత్తును సూచిస్తారని, సేవ ద్వారా ప్రేరణ పొంది, విలువల ద్వారా మార్గనిర్దేశం చేయబడతారున్నారు. సాయం సంధ్య వేళలో తాము చూసిన సాంస్కృతిక బృందాలు, శకటాలు భారతదేశ నాగరికత లోతు, కళాత్మక గొప్పతనాన్ని అందంగా ప్రతిబింబిస్తాయన్నారు. సాంస్కృతిక వ్యక్తీకరణతో సైనిక వేడుకల కలయిక వారసత్వం, మానవత్వంలో లంగరు వేయబడినప్పుడు బలం అత్యంత అర్థవంతమైనదని మనకు గుర్తు చేస్తుందని వివరించారు.

#### పర్యాటకాభివృద్ధికి దోహదం

భారత నావికాదళం.. ఇక్కడ ప్రధాన కార్యాలయం ఉన్న తూర్పు నావికాదళ కమాండ్‌తో లోతైన, శాశ్వత బంధాన్ని పంచుకుంటుందని రాష్ట్ర గవర్నర్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ వివరించారు. మన జలాల్లో చాలా స్నేహపూర్వక విదేశీ నౌకలు, విమానాలు ఉండటం విశాఖపట్నం ప్రపంచ సముద్ర నగరంగా దాని స్థానాన్ని పెంచుతుందన్నారు. ఇది ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేయడమే కాదు.. పర్యాటక అభివద్ధికి ఎంతో దోహదం చేస్తోందన్నారు. తూర్పు సముద్ర తీరంలో రాష్ట్రం వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందన్నారు. మరీ ముఖ్యంగా, ఇది సద్భావనను బలోపేతం చేస్తుందని, ఈ సద్భావన శాశ్వత శాంతికి బలమైన పునాదిగా మిగిలిపోయిందన్నారు. మన సాయుధ దళాలు, మన పౌరుల మధ్య బంధం బలమైనదని, గర్వంగా శాశ్వతమైనదన్నారు. ఈ అంతర్జాతీయ నగర కవాతును జరుపుకుంటున్నప్పుడు, శత్రుత్వంపై భాగస్వామ్యాన్ని, విభజనపై సామరస్యాన్ని, సంఘర్షణపై సహకారాన్ని జరుపుకుందా మన్నారు. బలోపేతమైన స్నేహాలు నిరంతరం వృద్ధి చెందాలని, మన సముద్రాలు సురక్షితంగా, తెరిచి ఉండాలి. విశాఖపట్నం గమ్యం నగరంగా మాత్రమే కాకుండా, సముద్ర ఐక్యతకు దారిచూపేదిగా ప్రకాశిస్తూనే ఉండాలని కొనియాడారు.

## ఇంజనీరింగ్ పరిశ్రమల అభివృద్ధికి కృషి

### - రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి




మిని పరిశ్రమ కవితల నుండి వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సచివాలయం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: ఇంజనీరింగ్ రంగ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పారిశ్రామిక వర్గాలకు ఎదురవుతున్న సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ, సాధికారత, సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఏపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులతో వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఇంజనీరింగ్ రంగ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, ఉత్పత్తి ప్రమాణీకరణ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశంలో చర్చించారు. గుర్తించిన పారిశ్రామిక వాడల్లో సరైన పన్ను విధింపు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించడం ముడిసరుకు సరఫరా కోసం ఎన్ఎస్ఐసి సేవలను వినియోగించుకోవడం, సీజిటిఎంసిఈ పథకం కింద మరిన్ని ఎంఎస్ఎంఈ రుణాలకు గ్యారంటీ కల్పించడం చిన్న పరిశ్రమలకు నగదు లభ్యత కోసం టిఆర్ఈడిఎస్ అమలును వేగవంతం చేయడం, ఏపిసిపిడిసిఎల్ అమలు చేస్తున్న విద్యుత్ టారిఫ్ సమస్యలను పరిష్కరించడం, ఇంజనీరింగ్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల పెంపు, ఉత్పత్తుల సేకరణ ధరలపై ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. దీనిపై స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా సభ్యులు పలు సూచనలు చేశారు. సభ్యుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ఇతర రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈ విద్యుత్ టారిఫ్, ప్రాపర్టీ ట్యాక్స్ విధింపులో ఉన్న అత్యుత్తమ విధానాలను అధ్యాయనం చేసి తగు పరిష్కారాన్ని కనుకొంటామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధంగా ఎంఎస్ఎంఈ లకు ఎదురయ్యే సమస్యలను స్టేక్ హోల్డర్స్ భాగస్వామ్యంతో పరిష్కరించడానికి, వారికి అండగా ఉండటానికి "కార్పొరేట్ మిత్ర" ఏర్పాటుపై తగిన ప్రతిపాదనలతో రావాలని మంత్రి ఛాంబర్ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు, బి.రాజశేఖర్, బయన వెంకటరావు, ఆర్.వి.సుబ్బారావు, గద్దె విజయ్ కుమార్, వెలగపూడి సాంబశివరావు, గుర్జిత్ సింగ్ సాహ్నీ, కె.వి.సుబ్రహ్మణ్యం, మోహన్ పాటి సెంతుర్, జి.వకాల రావు, గుడివాడ జయకుమార్, కోనేరు విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

## అత్యాధునిక సాంకేతితతో లడ్డూపోటు, అన్నదాన భవనం

### - ఇంద్రకీలాద్రిపై ఇఓ శీనా నాయక్ ఆకస్మిక తనిఖీ



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: దుర్గమ్మ వారి ఆలయంట నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద తయారీ భవనం, లడ్డూ పోటు భవనాలు అత్యాధునిక సాంకేతికతతో నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. తిరుపతి తిరుమల దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన కిచెన్, లడ్డూపోటును శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ప్రత్యేక బృందం పరిశీలించి 3 రోజుల్లో నివేదికను ఇస్తామని వెల్లడించారు. ఈ మేరకు తిరుపతి తిరుమల దేవస్థానంకు పరికరాలు అందించిన టెక్నాలజిక్ ఇంజనీర్స్ సంస్థ అదికారులు రఘునాథన్, పార్థసారది, ఎం కోటేశ్వరరావు, హరిప్రసాద్ లు





ఇఓ వికె శీనా నాయక్‌తో సమావేశమై గురువారం పలు అంశాలను వివరించారు. అనంతరం ఇఓ మాట్లాడుతూ అత్యాధునికతతో లడ్డూపోటు, అన్నప్రసాద తయారీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె సీన నాయక్ గురువారం ఆలయ పరిసరాల్లోని వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు అందుతున్న సేవలను స్వయంగా పర్యవేక్షించి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. కొబ్బరికాయల కౌంటర్‌లో కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న కొబ్బరికాయల పరిమాణాన్ని పరిశీలించారు. పాడైపోయిన స్టాక్‌ను వెంటనే కాంట్రాక్టర్‌కు వెనక్కి పంపాలని సంబంధిత క్లర్కును ఆదేశించారు. దేవస్థాన చీరల విక్రయ కౌంటర్‌లో విక్రయాలను, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లోక్ రూమ్ చెప్పుల స్టాండ్ పరిశీలించి భక్తుల నుంచి నిర్ణీత ధరల కంటే అదనంగా వసూలు చేయకూడదని సిబ్బందిని హెచ్చరించారు. సెల్ ఫోన్ కౌంటర్ వద్ద ఫ్లోరింగ్ దెబ్బతినడంతో తక్షణమే అక్కడ కొత్త ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో భక్తులకు తాగునీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కియోస్క్ మెషీన్ పరిశీలించారు. ఆలయ ప్రాంగణంతో పాటు స్కానింగ్ పాయింట్ల వద్ద టికెట్ల తనిఖీ విధానాన్ని పరిశీలించి, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నారాయణమ్ రాజేష్, నాగలక్ష్మి కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళం గురువారం అందించారు. గుడివాడకు చెందిన జలందరరావు, మల్లేశ్వరి కుమార్దు సత్యనారాయణ, మాధవి పేరిత ఉచిత ప్రసాద వితరణకు రు.1,55,599ల విరాళం అందించారు. గుడివాడకు చెందిన సత్యనారాయణ, మాధవి, వెంకట నారాయణ, వెంకటరత్నమ్మ, మసిముక్కు జలందరరావు, మల్లేశ్వరి లు రు.2లక్షల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## పల్నాడులో భూ ప్రకంపనలు

గుంటూరు ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలో భూ ప్రకంపనలు కలకలం రేపాయి. వినుకొండ ప్రాంతంలో తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. తెల్లవారుజామున సుమారు 2:35 గంటలకు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత3.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. వినుకొండకు వాయవ్య దిశలో సుమారు 20 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గాఢనిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా ఇళ్లలోని వస్తువులు కదలడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వినుకొండతో పాటు పల్నాడు, ప్రకాశం జిల్లాల సరిహద్దు గ్రామాల్లో కూడా ప్రకంపనలు రావడంతో జనం ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సిసి టీవీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ స్వల్ప భూకంపం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. గుండ్లకమ్మ నది ప్రవాహమార్గాల్లో చోటుచేసుకునే మార్పుల వల్ల గతంలో కూడా ఈ ప్రాంతంలో స్వల్ప ప్రకంపనలు వచ్చాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే రాబోయే రోజుల్లో మరిన్ని భూకంపాలు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఫిల్మ్ అవార్డు జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి

### ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 జ్యూరీ కమిటీలో కీలక మార్పులు చేశారు. కమిటీలో స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు రాఘవేంద్రరావు వ్యవహారిస్తుండగా, ఆయన స్థానంలో భరద్వాజకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 19న అవార్డులను ప్రదానం చేయనున్నా రు. ఈ పురస్కారాలకు ఎంపికైన చిత్రాల స్క్రీనింగ్ ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభమైంది. తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, భారతీయ సినీ రంగానికి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిభ, పారదర్శకత ప్రమాణంగా గద్దర్ సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని వెల్లడించింది. ఈ పురస్కారాలకు ఎంపిక చేసే సినిమాల్లో వాణిజ్య అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో మంచి సినిమాలను మరింత ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఇటీవల తెలిపింది. గత ఏడాదిలాగే ఇప్పుడూ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని పేర్కొంది.


## జిహెచ్ఎంసి విభజనపై హైకోర్టులో పిటిషన్

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజించడంపై తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజన చేస్తూ జీవో నంబర్ 55 జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ వ్యాపారి గురువారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. 2027 జనాభా లెక్కల ప్రకారం కేంద్ర సర్క్యులర్‌గా ఇది విరుద్ధమని, జనగణన ముగిసే వరకు ఈ జీవోపై స్టే విధించాలని కోరారు. మున్సిపల్ సరిహద్దులు మార్చడం, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ చట్ట విరుద్ధమని పిటిషనర్ తెలిపారు. జీవో నంబర్ 55ను రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. జిహెచ్ఎంసిని యథావిధిగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## స్వదేశీ ఎఐ రూపకర్తలుగా వర్సిటీలు ఎదగాలి

### ఎఐయు సెంట్రల్ జోన్ విసిల సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** సాంకేతిక విప్లవ యుగంలో భారత విశ్వవిద్యా లయాలు కేవలం వినియోగదారులుగా కాకుండా స్వదేశీ ఆవిష్కరణల కేంద్రాలుగా ఎదగాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపు నిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ వైస్‌ఛాన్స లర్ల సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒయు చరిత్రాత్మక ఠాగూర్ ఆడిటోరి యంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు), సహకారంతో నిర్వహిస్తున్న రెండో సెంట్రల్ జోన్ వైస్‌ఛాన్స లర్ల సదస్సు 2025-26 గురువారం ఘనంగా ప్రారంభమైంది. 'ఎఐ, క్వాంటమ్ టెక్నా లజీల కలయిక కేవలం శాస్త్రీయ పురోగతికే పరిమితం కాదని, ఇది విద్యావ్యవస్థలో సమగ్ర మార్పులకు దారితీసే శక్తిగా నిలుస్తుంది' అని గవర్నర్ పేర్కొన్నారు. భవిష్యత్ ప్రపంచ పోటీలో నిలవాలంటే భారత ఉన్నత విద్యా సంస్థలు నైతిక విలువల ఆధారంగా స్వదేశీ ఎఐ పరిష్కారాలను రూపొందిం చాల్సి న అవస రం ఉందన్నారు. 'సాంకే తికత సమాజంలోని చివరి వ్యక్తికీ అందు బాటులోకి రావాలంటే విశ్వవిద్యాలయాలు సమా జంతో అను సంధానమై పనిచేయాలని సూచిం చారు. వికాసం అందరికీ చేరాలని, సాంకేతిక పురోగతి సమానత్వాన్ని పెంపొం దించాలి' అని స్పష్టం చేశారు. ఎఐ ఆధారిత పరిశోధనలు, క్వాంటం సాంకేతి కతలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా దేశ అభివృద్ధి లక్ష్యాలు వేగవంతం అవుతాయని గవర్నర్ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడంలో విశ్వవిద్యా లయాల పాత్ర కీలకమని అన్నారు. ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం స్వాగతోపన్యాసంలో విద్యార్థులను భావి సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేయాల్సి న అవసరాన్ని వివరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యను ఎఐ, క్వాంటమ్ ఆధారిత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఒ.యూ రిజిస్ట్రార్ ప్రొ. గడ్డం నరేష్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల డీన్లు, ప్రిన్సి పాల్స్, డైరెక్టర్లు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

**విద్యలో కృత్రిమ మేధ వినియోగం - కొత్త దిశగా అడుగులు**

విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించేందుకు కార్యక్రమాన్ని ప్రకటిం చింది. విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు ఎఐపై అవగాహన పెంపొందించడం, పరిశోధనలను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. పారదర్శకతకు ప్రాధాన్యమనే ప్రధాన కార్యక్రమంలో భాగం గా విద్యలో ఎఐ, ఇతర సాంకేతిక పద్ధతుల వినియోగంపై టెక్నాలజీ ఆధారిత చర్చలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు పారదర్శకమైన విశ్వవిద్యాలయ పరిపాలనలో భాగంగా ఎఐ సంబంధిత ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు ప్రారంభించారు. స్వదేశీ పరిష్కారాల ప్రోత్సా హం, 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గోప్యతా హక్కులను కాపాడే విధంగా ఫ్రేమ్‌వర్క్ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

# అంతా భారత్‌మయం


కెనడా యువీ

* న్యూజిలాండ్‌పై యువరాజ్ సింగ్ సెంచరీ
* కెనడాపై ఆర్యాన్ష్ శర్మ సూపర్ హాఫ్ సెంచరీ
* నమీబియాపై కదం తొక్కిన కృష్ణమూర్తి
* సౌతాఫ్రికాను చీల్చి చెండాడిన నవ్‌నీత్ సింగ్
* కెనడాపై గెలుపందించిన రచిన్ రవీంద్ర
* నెదర్లాండ్స్‌పై 4 వికెట్లు తీసిన హర్మీత్ సింగ్

**న్యూఢిల్లీ:** భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్‌లో టాప్‌గా వినిపించిన పేర్లు. వీరందరూ టీమిండియాలో లేకున్నా చక్కని ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీరే కాదు చాలా మంది భారత సంతతి ఆటగాళ్లు పొట్టి ప్రపంచకప్‌లో మెరిశారు.

**యువరాజ్ సెంచరీ**

కెనడా యువీ పేరు ఈ ప్రపంచకప్‌లో మారుమోగింది. సెంచరీతో ఇరగదీశాడు. అదీ న్యూజిలాండ్‌పై. కివీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 65 బంతుల్లోనే 110రన్స్ సాధించాడు. ఇప్పటివరకు పొట్టి ప్రపంచకప్‌లో మూడు శతకాలు నమోదయితే అందులో యువరాజ్ సింగ్‌ది ఒకటి. ఇతనిదే ఇప్పటివరకు హైఎస్ట్ స్కోరు.

**అంతా మనవాళ్లే**

అమెరికా జట్టులోని శుభం సుభాష్ ఓ అర్ధసెంచరీతో పాటు 4 మ్యాచ్‌ల్లో 70.50 సగటుతో ఏకంగా 142 రన్స్ సాధించాడు. అలాగే కృష్ణమూర్తి కూడా చక్కగా రాణించాడు. ఓ మ్యాచ్‌లో అజేయంగా 68 పరుగులతో రాణించి సత్తా చాటాడు. ముక్కామల ఏకంగా 79 పరుగులు చేసి అమెరికా జట్టులో హైఎస్ట్ స్కోరర్‌గా నిలిచాడు. కెనడా జట్టులోని ధలీవాల్ కూడా అర్ధసెంచరీతో మెరుపులు మెరిపించాడు. యూఏఈకి ఆడిన ఆర్యాంష్ శర్మ.. కెనడాపై 74 పరుగులతో కదం తొక్కాడు.




**భారత పేర్ల జపం**

పొట్టి ప్రపంచకప్‌లో ఈసారి మొత్తం 16 జట్లు 4గ్రూప్‌లుగా తలపడ్డాయి. సంచనాలు లేకున్నా క్రికెట్ కూనలు పెద్ద జట్లకు గట్టి పోటీ ఇచ్చాయి. చెమటలు పట్టించాయి. ఏ కొద్ది అదృష్టం కలిసొచ్చినా విజయాలు దక్కేవి. టీ20 ప్రపంచకప్ లో కొత్త స్టాండర్డ్ నెలకొల్పాయి. ఈ జట్ల రాణింపులో భారత సంతతి క్రికెటర్లదే కీలకపాత్ర.

**ఏకంగా 40 మంది**

గ్రూప్‌స్టేజ్‌లో ఏ జట్టు ఆడుతున్నా భారత జట్టే ఆడుతోందా అన్న అభిప్రాయం కలిగింది. కారణం చాలా జట్లలో భారత సంతతికి ఆటగాళ్లు ఉండడమే. టీమిండియాతో పాటు ఇతర దేశాల తరపున ఆడిన భారత మూలాలున్న క్రికెటర్లు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. మొత్తం 40కు పైగా భారత ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నారై క్రికెటర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**పేరుకే కెనడా**

కెనడా తరపున అత్యధికంగా భారత మూలాలున్న ఆటగాళ్లు ఆడాడు. ఈ జట్టులో ఏకంగా 11 మందిఆడడమే గాక, చక్కగా రాణించి కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా యువరాజ్ సెంచరీతో ఇరగదీశాడు. అమెరికా జట్టులో 9 మంది, ఒమన్ జట్టులో 7 మంది, యూఏఈ జట్టులో 7మంది భారత సంతతి ఆటగాళ్లు ఆడారు. అమెరికా, ఒమన్ జట్ల స్కోర్లలో భారత సంతతి ఆటగాళ్లదే లీడ్ రోల్. న్యూజిలాండ్‌కు రచిన్ రవీంద్ర, సోదీ ఆడుతున్నారు. దక్షిణాఫ్రికా, వెసిండీస్, ఇటలీ, నెదర్లాండ్ జట్లలోనూ మన ఆటగాళ్లు కనిపించారు. మొత్తంగా ప్రపంచ క్రికెట్‌లో భారత సంతతి ప్రభావం గణనీయంగా కనబడింది.

**కెప్టెన్సీ కూడా మనవాళ్ల చేతుల్లోనే**

కెనడా, అమెరికా, ఒమన్ జట్లకు సారథులుగా కూడా మనవాళ్లే వ్యవహరించారు. మొత్తంగా చూస్తే... టీ20 ప్రపంచకప్‌లో మనవాళ్లు కీలకశక్తిగా ఎదిగారు. పొట్టి ప్రపంచకప్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


హర్మీత్ సింగ్

## జింబాబ్వే సంచలనం: శ్రీలంకకు షాక్



**కొలంబో:** టీ20ప్రపంచకప్‌లో జింబాబ్వే సంచలనంకొనసాగుతోంది. ఆస్ట్రేలియాను ఇంటిదారి పట్టించిన జింబాబ్వే... శ్రీలంకను దాని సొంతగడ్డపై చిత్తుచేసింది. గ్రూప్ స్టేజ్‌ను అజేయంగా ముగించింది.

కొలంబోలో జరిగిన గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 19.3 ఓవర్లలో అందుకుంది. తొలి వికెట్‌కు ఓపెనర్లు బ్రియాన్(48 బంతుల్లో 63 రన్స్), మరుమణి(34 రన్స్) తొలి వికెట్‌కు 69పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ర్యాన్ బూరీ కూడా 23 పరుగులతో రాణించాడు. సికిందర్ రజా వస్తూనే బ్యాట్ ఝుళిపించి 26 బంతుల్లోనే 45 రన్స్‌తో జింబాబ్వే విక్టరీ ఖాయం చేశాడు. జింబాబ్వేకు టీ20 క్రికెట్‌లో ఇది రెండో అత్యధిక రన్స్ చేధన. అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 రన్స్‌చేసింది. ఓపెనర్ పథుమ్ నిస్సాంక మరోసారి బ్యాట్ ఝుళిపిస్తూ 62 పరుగులు సాధించాడు. మిగతా వారిలో పవన్ రత్నాయకే 25 బంతుల్లో వేగంగా 44 రన్స్ చేశాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఇవాన్స్, క్రీమర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్ గెలుపుతో ఆస్ట్రేలియాపై విజయం గాలివాటం కాదని జింబాబ్వే నిరూపించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తూ మునపటి జింబాబ్వేను తలపిస్తోంది. సూపర్-8లో మరిన్ని సంచలనాలకు సిద్ధమవుతోంది.

**సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక-178/7(20 ఓవర్లలో)** (పథుమ్ నిసాంక 62, పవన్ రత్నాయకే 44, కుషాల్ పెరీరా 22, బ్రాడ్ ఇవాన్స్ 2/35, క్రీమర్ 2/27); **జింబాబ్వే-182/4(19.3 ఓవర్లలో)** (బెన్నెట్ 63, సికిందర్ రజా 45, మరుమణి 34, ర్యాన్ 23, దుషాన్ హేమంత 2/36)

## వింటర్ ఒలింపిక్స్‌లో దూసుకుపోతున్న నార్వే



**మిలాన్ :** ఇటలీ జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే దూసుకుపోతోంది. 34 మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది. అందులో 16 స్వర్ణాలు, 8 సిల్వర్, 10 బ్రాంజ్‌మెడల్స్ ఉన్నాయి. అతిథ్య ఇటలీ సొంతగడ్డపై గతంలో కంటే ఎక్కు వ మెడల్స్ సొంతం చేసుకుంది. ఇప్పటివరకు 26 మెడల్స్‌తో రెండో స్థానంలో ఉంది. ఇటలీ ఖాతాలో 9 స్వర్ణాలు, 5 రజతాలు, 12 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈసారి అమెరికా మెడల్స్‌లో వెనకబడింది. మూడో స్థానంతో సరిపెడుతోంది. ఏడు స్వర్ణాలు, 11 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్‌తో సహా మొత్తం 24 పతకాలతో ఉంది. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ కూడా టాప్-5లో కొనసాగుతున్నాయి. ఫ్రాన్స్ ఇప్పటివరకు 6 స్వర్ణాలు సహా 19 మెడల్స్, నెదర్లాండ్స్ 6 స్వర్ణాలు సహా 15 మెడల్స్‌తో ఉన్నాయి. గత వింటర్ ఒలిపిక్స్ కంటే ఈసారి పెద్ద సంఖ్యలో రికార్డులు బద్దలయ్యాయి. ఈ క్రీడలు ఆదివారంతో ముగుస్తాయి.

## చరిత్ర సృష్టించిన హార్మన్ ప్రీత్ కౌర్



**సిడ్నీ:** భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఒకే ఒక్క ప్లేయర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌తో కలిపి అన్ని ఫార్మాట్లలో 365 మ్యాచ్‌లు ఆడింది. గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్ ప్లేయర్ సూజీ బేట్స్ పేరిట ఉండేది. ఆ రికార్డును తాజాగా హార్మన్ ప్రీత్ కౌర్ అధిగమించారు. ఇప్పటివరకు 6 టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20లు ఆడారు. మూడు ఫార్మాట్లలో 8 వేలకు పైగా పరుగులు సాధించారు.

కాగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 19పరుగులతో ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 రన్స్ చేసింది. ఈ లక్ష్య చేధనలో తడబడ్డ భారత్ విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులకే పరిమితమైంది. హార్మర్ కౌర్(36) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

## అజేయంగా సూపర్-8లో విండీస్

### షాయ్ హోప్ అర్ధసెంచరీ -ఇటలీపై ఘనవిజయం



**కోల్‌కతా:** రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్ జోరు కొనసాగుతోంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇటలీని చిత్తుచేసి గ్రూప్-సి టాపర్‌గా నిలిచింది.

షాయ్ హోప్ విజృంభణతో మొదట బ్యాటింగ్ చేసిన వెసిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు చేసింది. బ్రాండన్ కింగ్, షిమ్రాన్ హెట్మైర్ సింగిల్ డిజిట్‌కే అవుటై నిరాశపరిచాడు. ఈ దశలో షాయ్ హోప్ విండీస్‌ను ఆదుకున్నాడు. ఇటలీ బౌలర్లపై విరుచుకుపడుతూ 4 సిక్స్‌లు, మరో 6 బౌండరీలతో 75రన్స్ చేశాడు. అతనికి తోడుగా ఛేజ్(24), రూథర్ ఫోర్డ్(24) కూడా రాణించడంతో విండీస్ 150 మార్కు దాటింది. 166 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ దెబ్బతీశారు. వీరి ధాటికి ఇటలీ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. 18 ఓవర్లలోనే 123 పరుగులకు ఆలౌటైంది. ఇటలీ ఇన్నింగ్స్‌లో స్మట్(24), బెన్ మనెంటి(26) మాత్రమే రాణించారు. ఏకంగా ఆరుగురు బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కు అవుటయ్యారు. జెపెఫ్ 4 వికెట్లు, మాథ్యూ 3 వికెట్లు పడగొట్టారు. వెస్టిండీస్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది గ్రూప్‌సిలో అగ్రస్థానంలో నిలిచింది.

**సంక్షిప్త స్కోర్లు: వెస్టిండీస్-165/6**(20 ఓవర్లలో) (షాయ్ హోప్ 75, రోస్టన్ ఛేజ్ 24, రూథర్‌ఫోర్డ్ 24, బెన్ మనెంటి 2/37); **ఇటలీ-123 ఆలౌట్** (18 ఓవర్లలో)(బెన్ మనెంటి 26, స్మట్స్ 24, షామర్ జోసెఫ్ 4/30, మాథ్యూ ఫోర్డె 3/19)




## డేటా సెంటర్ల విభాగంలో వచ్చే ఐదేళ్లలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ప్రపంచ టెక్ దేశాలకు ధీటుగా భారత్ 2030 నాటికి 200 బిలియన్ డాలర్ల మేర డేటా సెంటర్ సామర్థ్యం పెంపువిభాగంలో పెట్టుబడులు రాబట్టుకోగలదని డెల్లాయిట్ అంచనావేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మొత్తం 800 బిలియన్ డాలర్లమేర పెట్టుబడులురావచ్చని ఈ మొత్తంలోనే భారత్‌కు 200 బిలియన్ డాలర్లవరకూ పెట్టుబడులు వస్తాయని డెల్లాయిట్ టచ్ తోమట్సు ప్రకటించింది. వచ్చే నాలుగేళ్లలోనే 8 నుంచి 10 గిగావాట్ల డేటాసెంటర్ సామర్థ్యం ఏర్పాటుచేస్తామని సంస్థ డైరెక్టర్ విల్ సైమన్స్ తెలిపారు. డేటాసెంటర్ల బూమ్‌పై సంస్థ గురువారం ఒక తాజా నివేదికను విడుదలచేసింది. పునరుత్పత్తి విద్యుత్‌బేస్ పెరుగుతోందని, స్వచ్ఛ విద్యుత్ ఇపుడు భారత్‌లో కీలకం కానున్నదని అంచనావేసారు. తదుపరి దశ డేటా కేంద్రం వృద్ధికి స్వచ్ఛవిద్యుత్ మరింత దోహదం చేస్తుందన్నారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ గ్యాప్‌లు లేకుండా ఇపుడు ఈ గ్రీన్‌ఎనర్జీ కీలకభూమిక పోషిస్తుందన్నారు. వచ్చే నాలుగేళ్లలోనే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగలవని డెల్లాయిట్ భాగస్వామి అనిష్ మండల్ పేర్కొన్నారు. ఈ డేటా సెంటర్లు పీక్‌పవర్ డిమాండ్‌లో 10శాతం అదనపు సేవలు అందిస్తాయన్నారు. ప్రపంచంలోని డేటా వినియోగంలో 20శాతం భారత్‌లోనే వినియోగం అవుతోందని, అయితే డేటా సెంటర్లపరంగా గ్లోబల్‌గా 5శాతం తక్కువే ఉంటుందన్నారు. విదేశీ కంపెనీలు క్లౌడ్‌సేవలు అందించినపక్షంలో 2047 వరకూ వారికి పన్నువిరామం ప్రకటించాయి. క్లౌడ్‌కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు ఏర్పాటుచేస్తే మరింతగా ప్రోత్సాహకాలు కల్పించడమే ఇందుకు కీలకమని ఆయన అన్నారు. భారత్ డేటా సెంటర్ సామర్థ్యం 1.5 గిగావాట్లుగా ఉందని, 8నుంచి 10 గిగావాట్లకు రానున్న ఐదేళ్లలోనే పెరుగుతుందని, అదనంగా 40 నుంచి 45 టెరా వాట్ల వినియోగం జరుగుతుందన్నారు.

## కృత్రిమమేధలో రూ.10 లక్షలకోట్ల పెట్టుబడులు

### -ముకేష్ అంబానీ వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియోకలిసిభారీ పెట్టుబడులకు ముందకొచ్చాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షలకోట్ల వరకుపెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధికఖర్చు అని అంబానీఅన్నారు. ఈసవాలును అధిగమించేందుకు జియో ఇంటెలిజెన్స్ ద్వారా 3కీలక కార్యక్రమా



లను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్‌స్థాయి ఏఐరెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రెండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.




## రూ.7 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

### భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఫిబ్రవరి 19:** అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, అధిక ముడిచమురు ధరల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు రెండు వారాల్లో ఎన్నడూ లేనంతగా పతనమయ్యాయి. ఒక్కరోజులోనే రూ.7.5 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,236.11 పాయింట్లు నష్టపోయి 82,498.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 365 పాయింట్లు పడిపోయి 25,454.35 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు భారీ పతనం కావడం గమనార్హం. అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకుతోడు ఒక్కసారిగా పెరిగిన ముడిచమురుధరలు ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లపై అనిశ్చితి వంటివి తోడు కావడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ వంటి కీలక రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడిని మరింత పెంచింది. టెక్నికల్‌గా, నిఫ్టీ కీలకమైన 25,645-25,660 సపోర్ట్ స్థాయిని కోల్పోవడంతో అమ్మకాలు వేగవంతమయ్యాయనిట్రేడర్లు అంచనావేసారు. ఈ అమ్మకాల హోరులో సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ వంటి షేర్లు 3.2 శాతం వరకు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.59 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.27 శాతం చొప్పున పడిపోయాయి. రంగాలవారీగా నిఫ్టీ రియల్టీ, మీడియా, ఆటో రంగాలు అత్యధికంగా 2 శాతం మేర నష్టపోయాయి. మరోవైపు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఫిబ్రవరి మొదటి అర్ధభాగంలో వారు రూ.10,956 కోట్ల విలువైన ఐటీ స్టాక్స్‌ను విక్రయించారు. అంతర్జాతీయ అనిశ్చితి, ముడిచమురు ధరల అస్థిరత కారణంగా సమీప భవిష్యత్తులో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 1.54శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.16శాతం క్షీణించాయి. 1209 కంపెనీలషేర్లు మాత్రమే పెరిగితే 3011 షేర్లు కుదేలయ్యాయి. 159 కంపెనీలషేర్లు మాత్రం యథాతథంగా కొనసాగాయి. ఇక ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్‌రెండునాటి సెటిల్‌మెంట్లు రూ.1,55,879గా కొనసాగాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90.68 వద్దనే ఊగిసలాడింది.

## కృత్రిమమేధలో లక్షలకోట్ల పెట్టుబడులు

### గూగుల్, ఎన్విడియా, క్వాల్‌కామ్, మైక్రోసాఫ్ట్ సహా మరిన్ని సంస్థలు సిద్ధం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** కృత్రిమమేధ రంగంలో భారత్‌లో పెట్టుబడులపై పలు బహుళజాతి సంస్థలుసైతం ముందుకు వచ్చాయి. కృత్రిమ మేధ సాంకేతికత కొందరికే పరిమితం కాకుండా సామాన్యుల వరకు చేరవేసి వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నదే ప్రధాన లక్ష్యంగా భారత్ తెలిపింది. సుమారు 50 మందికిపైగా ఎంఎన్‌సీల సిఇఒలు హాజరై ఒకే వేదికపై నిలిచారు. భారత్‌లోపెట్టుబడులకు అత్యంత ఆసక్తిని చూపించారు. ఇదే వేదికపై ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. ఏఐ పరివర్తనలో భారత్ ముందంజలో ఉంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయనిఖీ అని తెలిపారు. ఏఐ రంగంలో భారత్ పురోగమిస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీని అందించే సామర్థం భారత్ వద్ద ఉంది. భారత్‌లోని స్టార్టప్ వ్యవస్థ అద్భుతంగా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే భారత్‌లో గూగుల్ 15 బిలియన్ డాలర్ల ఏఐ మౌలిక వసతుల పెట్టుబడులు పెట్టింది. ఇందులో భాగంగా సబ్‌సీ కేబుల్స్ నిర్మిస్తోంది. విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. వచ్చే 10 ఏళ్లలో భారత్ మరో 2 లక్షల కోట్ల డాలర్ల టెక్ మార్కెట్‌ను అందించేందుకు సిద్ధంగా ఉందని వీసీ సంస్థ యాక్సెల్ అంచనా వేసింది. కేవలం రూ.వందతోనే ఏఐతో వైద్య,




విద్యా సలహాలు అందే రోజులు అతి త్వరలోనే వస్తాయన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి గ్లోబల్ సౌత్ దేశాల్లో ఏఐ విస్తరణ కోసం ఏకంగా రూ.4.5 లక్షల కోట్లు పెట్టుబడి పెడతామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఇందులో భాగంగా వచ్చే 2030 నాటికి భారత్‌లో 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి తమ సంస్థల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. భారత్‌కు చెందిన ఏఐ స్టార్టప్‌ల కోసం క్వాల్‌కామ్ దాదాపు రూ.1,360 కోట్లు కేటాయించినట్లు తెలిపింది. ఆటోమోటివ్, రోబోటిక్స్ రంగాల్లోని స్టార్టప్ కంపెనీలకు ఈ నిధులు అందిస్తామని పేర్కొంది. దేశీయ తయారీ రంగం ఎఐతో మరింతగా బలోపేతమవుతుందని పేర్కొంది. భారత్ అత్యంత కీలకమైన ఏఐ హబ్‌గా మారుతోందని, దేశీయ క్లౌడ్ కంపెనీలతో కలిసి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం అధునాతన ప్రాసెసర్లను సరఫరా చేయనున్నట్లు ఎన్వీడియా వెల్లడించింది. ఎల్‌అండ్‌టీతో కలిసి గిగావాట్ స్కేల్ ఏఐ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని తెలిపింది.

## లాభాలు లేవని 'స్విగ్గీస్నాక్స్' మూసివేత




**ముంబయి, ఫిబ్రవరి 19:** స్విగ్గీ కేవలం పదినిమిషాల్లోనే డెలివరీచేస్తామని ప్రకటించిన సేవల విభాగం 'స్నాక్'ను లాభదాయకత కొరవడటంతో మూసివేసింది. ఈ విభాగంలో తొలగించిన ఉద్యోగులు అందరినీ అంతర్గతంగా ఇతర విభాగాలకు బదలాయిస్తామని ప్రకటించిన స్విగ్గీ స్నాక్ యాప్‌ను గత ఏడాది జనవరిలో ప్రారంభించింది. రెండు నగరాల్లో మాత్రమే ఈ సర్వీసు కొనసాగించింది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ పదినిమిషాల డెడ్‌లైన్ డెలివరీలను నిలిపివేయాలని గిగ్‌వర్కర్ల భద్రత దృష్ట్యా ఈ సర్వీసులు నిలిపివేయాలని ఆదేశించిన క్రమంలో స్విగ్గీ స్నాక్ ఈనిర్ణయం తీసుకుంది. పదినిమిషాల డెలివరీ అనేది పాపులర్ అయినప్పటికీ గిగ్ వర్కర్ల భద్రత సమస్యాత్మకం అవుతున్నదని డెలివరీ భాగస్వాములపై అనుకోని ఒత్తిడి పెరుగుతున్నదని కేంద్రం భావించి పదినిమిషాల డెలివరీ ఆప్షన్ నిలిపివేయాలని క్విక్‌కామర్స్ సంస్థలను కోరింది. రెడీ టు ఈట్ ఐటమ్స్‌గా పిలిచే స్నాక్ అనే పదాన్ని ఈ పదినిమిషాల డెలివరీకి వినియోగించిన స్విగ్గీ లాభదాయకం కాదని మూసివేతనిర్ణయానికి వచ్చింది. దీనికితోడు సంస్థ నష్టాలు కూడా పెరుగుతున్నాయి. డిసెంబరుత్రైమాసికంలో స్విగ్గీ నికరనష్టం 1065 కోట్లకు చేరింది. రాబడుల్లో మాత్రం కొంతమేర పెరిగింది. 39993 కోట్లనుంచి 6148 కోట్లవరకూ వచ్చినట్లు కంపెనీయే ఎక్స్ఛేంజిలకు ఫైలింగ్ ఇచ్చింది. ఇదేవిధంగా జెప్టో కేఫ్, బ్లింకిట్ బిస్ట్రోను ప్రారంభించాయి. మేనెలలో జొమాటో కూడా ఇలాగే హోంస్టైల్‌మీల్‌సేవలు నిలిపివేసింది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026
I


# సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించిన బోర్డ్ ఆఫ్ విజిటర్ బృందం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో** రాజమహేంద్రవరంసెంట్రల్ జైలు మరియు మహిళా ప్రత్యేక కారాగారాన్ని గురువారం సాయంత్రం బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సందర్శించింది. తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి మరియు ఇతర జిల్లా స్థాయి శాఖాధికారులు పాల్గొన్నారు. అధికారులు ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సందర్శన సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న భోజన వసతులు, బ్యారకుల పరిస్థితి, పరిశుభ్రత, జైలు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, బేకరీ విభాగం, జైలు కిచెన్, లైబ్రరీ, ఖైదీల స్కూల్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ కీర్తి చేకూరి స్వయంగా ఖైదీల భోజనాన్ని రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు కిచెన్ పరిశుభ్రత, ఆహార నాణ్యత, బ్యారకుల నిర్వహణ, హాస్పిటల్ సేవలపై బృందం ప్రశంసలు వ్యక్తం చేసింది. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుతున్న విధానం, బెయిల్స్ మంజూరు పరిస్థితి, షురిటీ లేని ఖైదీలకు వ్యక్తిగత బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకాలు ఇచ్చారు. ఖైదీలను కుల వివక్ష ఆధారంగా పనులు చేయిస్తున్నారా అనే అంశంపై విచారించగా, అలాంటి పరిస్థితులు లేవని ఖైదీలు తెలిపారు. జైలు ప్రాంగణంలోని పచ్చదనం, పరిశుభ్రత, క్రమశిక్షణ పట్ల బోర్డు సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. మహిళా ప్రత్యేక కారాగార పర్యవేక్షణాధికారిణి వసంత కుమారి మరియు సిబ్బంది సమన్వయంతో జైలు సమర్థవంతంగా నిర్వహించబడుతోందని ప్రశంసించారు. పరిశుభ్రతకు సంబంధించిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డా. పి. భావన (చీఫ్ మెడికల్ ఆఫీసర్), బి. దిలీప్ కుమార్ (డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్), ఎం.డి. ఘుజుద్దీన్ (జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్), కె. రాబర్ట్ పాల్ (జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసర్), డా. ఇందిరా భారతి రాయ్ (మెడికల్ ఆఫీసర్), కారు సుభాషిణి (డిప్యూటీ జైలర్), బి. నాగమణి (డిప్యూటీ జైలర్) తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి




**రావులపాలెం, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త)** : స్థానిక గ్రామ సచివాలయం వద్ద బోస్కో సేవాకేంద్రం సంస్థ ఆధ్వర్యంలో 'వుయ్ లీడ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వుయ్ లీడ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ దుర్గ కుమారి హాజరయ్యారు. నవోదయ మహిళా మండలి కోఆర్డినేటర్ కప్పల ప్రియాంక అర్జున్ ఆధ్వర్యంలో, సర్పంచ్ హెచ్ వి హేమలత అధ్యక్షతన 'మహిళల అభివృద్ధే మహిళా సాధికారత' అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దుర్గ కుమారి మాట్లాడుతూ పరిపాలనలో మహిళలు చురుకైన భాగస్వామ్యం కలిగి ఉండడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళల సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హెచ్ వి రామ శాస్త్రి, ఎంపీటీసీ దంగేటి నాగలక్ష్మి, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూలు నూరు శాతం పూర్తి చేయాలి..




**అంబాజీపేట,ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త):** ప్రతి గ్రామంలో టామ్ టామ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్నులను ప్రతీ గ్రామంలో నూటికి నూరు శాతం త్వరితగతిన వసూలు చేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి డి.శాంతాలక్ష్మి అన్నారు. మండలంలోని మాచవరంలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూలును గురువారం డీజీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీజీపీఓ శాంతాలక్ష్మి మాట్లాడుతూ ఆయా పంచాయతీ పరిధిలోని టీమ్లను పెంపు చేసి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం స్వర్ణపంచాయతీ పోర్టల్ నందు ఆన్లైన్లో క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటి పన్నుల నమోదును పరిశీలించారు. అంతకు ముందు నందంపూడి గ్రామంలో ప్రజలకు తడి చెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. నందంపూడి, తొండవరం, కె.పెదపూడి గ్రామాల్లో ఏవీఆర్ఎస్ కాల్స్ తక్కువ శాతం నమోదు అయ్యాయన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ఏవీఆర్ఎస్ కాల్సు స్పందించి ప్రజల స్పందన తెలియజేయాలని ప్రజలకు వివరించారు. ప్రతీ రోజు గ్రామాల్లో చెత్త సేకరణ జరుగుతుందా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కె.వి.వి.సత్యనారాయణ మూర్తి, కె.సురేష్,కొప్పినీడి ఈశ్వరరావు,సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ఘనంగా లక్ష తులసి మహోత్సవం...



**ఆత్రేయపురం, ఫిబ్రవరి, 19,(ప్రభాత వార్త )** భక్తుల కోర్కెలు తీర్చే బదిలీల స్వామిగా ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయంలోలక్ష తులసి పూజామహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.గురువారం ఆలయ అర్చకులు ఖండవిల్లి సీతారామాచార్యులు, అర్చకులు వాడపల్లి చిరంజీవి, నాగసాయి కుమార్, వాడపల్లి వెంకట సత్య కేశవ శేషాచార్యులు, టి.వి.ఫణి కుమార్, వేదపండితులు నేతృత్వంలో లక్షతులసి పూజా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు . ఈ పూజ మహోత్సవంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి దంపతులు శ్రీ స్వామి వారి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత పండితులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యః వచనం , మండపారాధన, అష్టోత్తర కలశారాధన, శ్రీ స్వామి వారికి విశేష అభిషేకం, అనంతరం బాలభోగం, తులసి పూజ, అమ్మవార్లకు కుంకుమ పూజ, క్షీర తర్పణాలు, శాంతి హోమం, పూర్ణాహుతి అనంతరం శాంతి కళ్యాణోత్సవం, మహాదాశీర్వాచనము, నీరాజన మంత్రాపుష్పములు తదితర కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. ఈ లక్ష తులసి పూజా మహోత్సవానికి అశేష సంఖ్యలో భక్తులు గ్రామస్తులు పాల్గొని స్వామివారిని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, ఏర్పాట్లు చేశారు.

## డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి



**కాకినాడ రూరల్ , ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాపురం, వలస పాకల వాకలపూడి, గోదారిగుంట ప్రాంతాల నుండి వస్తున్న మేజర్ డ్రైనేజీ కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని ఆ ప్రాంతాలన్నీ ముంపుకు గురవుతున్నాయని , తక్షణమే ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ సభాధ్యక్షులను కోరారు. గతంలో వైసిపి ప్రభుత్వ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు నిర్మించి కబ్జాలు చేశారని , వాటిని వెంటనే తొలగించి ముంపుకు గురవుతున్న రూరల్, సిటీ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నానాజీ

## ప్రమాదాలు నివారించేందుకు ఆనాధికార జంక్షన్ మూసివేత

### ప్రతిపాడు సీఐ సూర్య అప్పారావు



**శంఖవరం, ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త):** ప్రమాదాలను నివారించేందుకు జాతీయ రహదారిపై ప్రమాదకర జంక్షన్ లను మూసివేయడం జరుగుతుంది ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య అప్పారావు పేర్కొన్నారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ం అనధికార, ప్రమాదకరంగా ఉన్న హైవే రోడ్డు క్రాసింగ్ పాయింటును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్తర్వుల మేరకు పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి శ్రీహరి రాజు సూచనలతో అనాధికార ప్రమాద జంక్షన్ లను మూసివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కత్తిపూడి పెట్రోల్ బంక్ సమీపంలో గల జంక్షన్ వద్ద ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారని, పోలీసుల దృష్టికి రాకుండా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకే జంక్షన్ మూసివేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద, యాక్సిడెంట్లు అయిన కార్లకు రేడియం స్టిక్కర్లు అంటించి డేంజర్ ప్రాంతంగా బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే వాహన చోధకులు , జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు భద్రతా నియమాలు పాటిస్తూ, సురక్షితంగా గమ్యాలు చేరాలని సూచించారు. జాతీయ రహదారులపై అనాధికార జంక్షన్ లను దాటవద్దని వీటివల్ల ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఆయన వెంట అన్నవరం ఎస్సై శ్రీ హరిబాబు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# కార్మిక శాఖామంత్రి ఇలాకాలో.. కనీస సౌకర్యాలు కరువు..



### పారిశుద్ధ్య కార్మికుల గోడు పట్టని యంత్రాంగం... చేతికి గ్లౌజులు లేకుండా వ్యర్థాల సేకరణ...



**రామచంద్రపురం,ఫిబ్రవరి19, (ప్రభాతవార్త):** చాలా సందర్భాల్లో చెత్తగా ఉదాహరిస్తుంటారు. పైకి చెత్తని తేలిగ్గా తీసిపారేస్తారు. వాస్తవం లో చెత్తను సేకరించడం అంత తేలికకాదు.మాటల్లో చెత్త కబుర్లు చెప్పుకున్నంత సులువు కాదు.ఆ చెత్తను సేకరించడంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తుంది.ఇదంతా ఎందుకంటే ఆ చెత్తను సేకరించే పారిశుద్ధ్య కార్మికులు పడుతోన్న ఇబ్బందులు అటువంటివి.ఇదెక్కడో కాదు సాక్షాత్తూ కార్మిక శాఖ మంత్రి ఇలాఖాలో పారిశుద్ధ్య కార్మికుల విధుల నిర్వాహణలో నెలకొన్న దుస్థితి.పట్టణ ప్రజలు ఆరోగ్యంగా,సురక్షితంగా ఉండడం కోసం కార్మికులు శ్రమిస్తుంటే,కనీసం వారి ఆరోగ్య రక్షణ పట్ల అధికార యంత్రాంగం శ్రద్ధ తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.వివరాల్లోకి వెళితే రామచంద్రపురం నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇలాకాలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఎంతో కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు పనిలో అవసరమైన సామగ్రి అందించడంలో అధికారులు విఫలమయ్యారా...? అవుననే సమాధానం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల గొంతు నుండి వినిపిస్తుంది.పట్టణంలో వ్యర్థాల సేకరణ కోసం వీధుల్లో ఉంచిన మెటల్ స్కిప్ బిన్లు శిధిలా వ్యవస్థలో ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు.పూర్తిగా పాడైపోయిన మెటల్ స్కిప్ బిన్లతో వ్యవహరించేటప్పుడు ప్రమాదాలు మరియు సవాళ్లను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు సంవత్సరాల నుండి ఉన్న బిన్లులకు మధ్యకాలంలో రిపేర్ చేయించినప్పటికీ బిన్లు పూర్తిగా పాడైపోయాయని కార్మికులు తెలియపరిచారు.వ్యర్థాలు సేకరించడానికి ప్లాస్టిక్ డబ్బాల కొరత కూడా ఉందని అంటున్నారు.అలాగే సిబ్బంది కొరత కారణంగా నలుగురు మనుషులు చేయవలసిన పనిని ఒకరే చేస్తున్నామని వెల్లడించారు.సరిపడ డంపర్లు లేక ప్రజలు చెత్తను రోడ్లమీద వేయడంతో అధిక శ్రమ అవుతుందని అంటున్నారు.వ్యర్థాలను సహకరించి ట్రాలీలో వేసే పారిశుద్ధ్య సిబ్బంది ఆధునికమైన,బాగా నిర్వహించబడే పరికరాలు లేకపోవడం వల్ల కార్మికులు తరచుగా వ్యర్థాలను మానవీయంగా నిర్వహించవలసి వస్తుంది,పాత బిన్లపై పదునైన లోహపు అంచులతో ప్రమాదకరం మారిందని కార్మికులు చెబుతున్న వైనం.నిత్యం పట్టణంలో ఎండా,వానా,చలి లెక్క చేయకుండా పట్టణ పరిశుభ్రత కోసం అహర్నిశలు కృషి చేసే పారిశుద్ధ్య కార్మికులు తమ చేతులకు గ్లౌజులు లేకుండా కాళ్ళకు బూట్లు,తలకు టోపీ,శరీరానికి రెయిన్ కోట్లు ఏమీ లేకుండా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చెత్త చెదారాలను ఎత్తి చెత్త ట్రాలీలో వేస్తున్నామన్నారు.ఆరోగ్యానికి తీవ్ర హాని చేస్తుందని తెలిసినా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు.కొందరు కార్మికులు తమ సొంత ఖర్చులతో గ్లౌజులు కొనుక్కుని వాడుతున్నారని.మరికొందరైతే గ్లౌజులు లేని చేతులతో వ్యర్థాలను తీస్తున్నామని ఈ విధంగా గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కార్మికులు వాపోతున్నారు.తమకు మౌలిక సదుపాయలు కల్పించాలని ఎన్నిసార్లు అడిగినా మున్సిపల్ అధికారులు అదిగో ఇస్తాం ఇదిగో ఇస్తామంటూ కాలం గడిపేస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు.మేము పడుతున్న ఇబ్బందులని వార్త పత్రిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.ఈ విషయమై మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు..



## స్థానిక సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తారు.

### ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుక




**గోపాలపురం ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త):** ఛత్రపతి శివాజీ 396వ జయంతి వేడుకను గోపాలపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వై జంక్షన్ నుంచి చెక్ పోస్ట్ సెంటర్ వరకు తీన్మార్ డప్పులతో శివాజీ కట్ ఔట్ ను ఊరేగిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. కేక్ కట్ చేసి ఒకరికొకరి పంచుకున్నారు. శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జనసేన సమన్వయకర్త దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ.. సాంఘీక అసమానతలు ఉన్న ఆరోజుల్లో ఎవరిని లెక్క చేయకుండా ధైర్యంగా దాదాపు 300 కోటలను తన పోరాట పటిమతో జయించి భారతదేశ ముద్దు బిడ్డగా ఛత్రపతి శివాజీ వెలుగొందారని అన్నారు. ఆయన తల్లి జిజయభాయ్ నేర్పిన ధర్మం, పోరాటం, న్యాయం వంటి అంశాలతో అందరి మన్ననలు పొంది సామ్రాజ్యాన్ని విస్తరింపజేసారని అన్నారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, పెద్దలపై గౌరవభావంతో శివాజీ మెలిగే వాడని అన్నారు. ఛత్రపతి శివాజీ భావాజాలన్నీ, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వచ్చే జయంతి నాటికి గోపాలపురం సెంటర్లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేసే నిమిత్తం తమ వంతుగా రూ.10 వేలు చొప్పున ఇస్తామని ఎంపీపీ ఉండవల్లి, ఇన్ ఛార్జ్ సువర్ణరాజులు చెప్పడంతో.. మిగిలిన నాయకులు మేము సైతం విరాళాలు ఇస్తామని ప్రకటించారు. జిల్లా బీజేపీ కార్యదర్శి గెల్లా శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు పిల్లి వెంకటేశ్వరరావు, కొండేపాటి రత్నాజీ చౌదరి, వడ్డీ రాంలీలాధర్, బూరెడ్డి వాసు, మద్దిపాటి రమేష్, తానేటి రాఘవులు, పోసిన గణపతి, ఆకుల సుబ్రహ్మణ్యం తదితర నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## క్వాయర్ పరిశ్రమలు స్థాపన సన్నాహాలు - జిల్లా కలెక్టర్



**అమలాపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త)** కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి లో భాగంగా జిల్లాలోని మామిడికుదురు నందు అయిదు ఎకరాలు విస్తరణలో అన్ని రకాల కాంపోనెంట్ ఉత్పత్తుల తయారీ,క్వాయర్ పరిశ్రమలు స్థాపన సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా పరిశ్రమల కేంద్రం ఏపీఐఐసీసీ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికుదురు నుండి ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఎంఎస్ఎంఈ పార్క్, ఇంక్యుబేషన్ సెంటర్ లు ఏర్పాటు ద్వారా గ్రామీణ ఉపాధి సృష్టి, క్వాయర్ ఎగుమతుల పెంపుదలకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. అలాగే ఉప్పలగుప్తంశీ నందు రూ 13 కోట్ల 50 వేలు అంచనా వ్యయంతో క్వాయర్ ఉత్పత్తుల అభివృద్ధి కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మరియు ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపనకు నిర్మాణశీ క్వాయర్ ఆధారిత ఉత్పత్తులు క్వాయర్ యార్న్, మ్యాట్స్, కోకోపిట్, జియో టెక్స్టైల్స్, వుడ్, గార్డెన్ ఉత్పత్తులు మొదలైనవి తయారీకి సమగ్ర సౌక ర్యాలు అందించేందుకు సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిపిఆర్ రూపకల్పన ఉత్పత్తుల తయారీ నాణ్యత ఎగుమతుల ప్రోత్సాహకం వంటి అంశాలపై రీజనల్ క్వాయర్ బోర్డు అధికారి పవన్ కుమార్, ఏపీఐఐసీసీ జిల్లా జోనల్ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాధామణి, క్వాయర్ బోర్డ్ ప్రతినిధి పవన్ కిరణ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ లతో సమీక్షించారు.

## అధికారుల తీరుతో దళితులకు న్యాయం జరిగేనా ?



**కడియం ,ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త)** పెత్తందారూని ఇంట్లో ఆర్డీవో భోజనాలు చేయడం దారుణమని జేగురుపాడు ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ సాకా కిరణ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు చికిలే కిషోర్ కుమార్, మండల టీడీపీ ఎస్సి సెల్ కన్వీనర్ కొంబాబత్తుల సూర్యకుమార్, ప్రత్తిపాటి నాగరాజు, జనసేన నాయకులు మద్దుకూరి సూరిబాబు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ బళ్ళ అన్నవరం, దళిత నాయకులు మోటిక మునియ్యాలు అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 50 సంవత్సరాలుగా జేగురుపాడు రెవెన్యూలోని దళితుల స్వాధీనంలో సర్వేనెంబర్ 10లో ఎకరా 5-58సెంట్లు భూమిఉందన్నారు .1977 సంవత్సరంలో జిల్లా రెవెన్యూ అధికారులు దళితులకు కేటాయించారని తెలిపారు. ఇటీవల తమ భూమిపై అన్నందేవుల చంటి కన్నుపడిందని, భూ సమీపంలోగల చైతన్య నగర్ ప్రాంతం ( మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి) లో నివసిస్తున్న వివిధ కులాల వారిని రెచ్చకొట్టి , తమ మీదకు ఉసిగొల్పి గొడవలు సృష్టిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఇదే ప్రాంతంలో గతంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూముల్ని స్వాధీనంలో పెట్టుకున్నాడని, విషయం స్థానిక ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. అలాగే సర్వే నెంబర్ 10 లో గల తమ భూముల అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఆర్డీఓ, తహసీల్దార్లకు విచారణ చేయాలని ఆదేశించారని తెలిపారు. అయితే బుధవారం విచారణకు వచ్చిన ఆర్డీఓ, తహసీల్దార్ లు చంటి ఇంటిలో భోజనాలు చేయడం ద్వారా ఏమేరకు దళితులకు న్యాయం చేస్తారని వారు ప్రశ్నించారు. చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించాల్సిన అధికారులు అయన ప్రలోభాలకు తలొగ్గకుండా దళితులకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు. దీనిపై కడియం తహసిల్దార్ సునీల్ కుమార్ ను వివరణ కోరగా చైతన్య నగర్ సర్వే నెంబర్ 88 /2 , 88/3 లలో గల సుమారు 4 ఎకరాల భూముల్లో గత కొన్నేళ్లుగా కొందరు స్థానికులు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని, జిఓ 30 ప్రకారం రెగ్యులైజ్ చేసే పరిశీలనలో భాగంగా బుధవారం ఆ ప్రాంతాన్ని ఆర్డిఓ పరిశీలించడం జరిగిందన్నారు. సర్వే నెంబర్ 10 భూములకు ఈ పరిశీలనకు ఏవిధమైన సంబంధం లేదన్నారు. స్థానికుల అభ్యర్థన, గతంలో ఈ భూములకు సంబంధించి జరిగిన వివాదాల నేపథ్యంలో, యాదృచ్ఛికంగా ఆ భూముల వద్దకు వెళ్లడం జరిగిందనీ, అలాగే అదే ప్రాంతంలో గల మరి కొన్ని (మైనింగ్)భూముల్ని కూడా పరిశీలించడం జరిగిందని తెలిపారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**యు.కొత్తపల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) :** జనసేన పార్టీ స్థాపకులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, ఆదర్శాలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రావు అక్షయ్ కోరారు. గ్రామ ఇన్చార్జ్లు, పార్టీ నాయకులకు సభ్యత్వాల నమోదుపై గురువారం పలు సూచనలు చేశారు. సభ్యత్వాల నమోదులో గ్రామాలలోని వార్డ్, బూత్ ఇన్చార్జ్లు సమన్వయంతో కలిసి పనిచేసేలా అందరికీ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రతి కార్యకర్తకు బాధ్యతలు అప్పగించి భాగస్వాములుగా చేయడం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుంది. పార్టీ అధినేత నాయకత్వాన్ని విస్తరించేందుకు గొప్ప అవకాశం లభించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి గ్రామంలో జనసేన బలాన్ని పెంచాలన్నారు. కార్యకర్తల లక్ష్యం వ్యక్తిగత అభిరుచులు కాదని పార్టీ బలమనే ధ్యేయంతో ముందుకు సాగాలన్నారు.

## 150 కిలోల పంచదారతో అభిషేకం



**మామిడికుదురు.ఫిబ్రవరి 19(ప్రభాతవార్త)** మండలంలోని అప్పనపల్లి గ్రామంలో వెంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామివారి 16వ.వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంజనీపుత్ర తెలుగు సంఘం ఆధ్వర్యంలో 150 కిలోల పంచదార, 30 కిలోల తేనెతో అభిషేకం జరిపించారు. గంధ సింధూరం తమలపాకులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు దొంతుకుర్తి వెంకట సత్యనారాయణ శర్మ,చంద్రమౌళి బాపన్న శాస్త్రి ఆధ్వర్యంలో బొలిశెట్టి రామకృష్ణ, వసంత దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని ఈ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అర్చకుల నుంచి వేదాశీర్వచనాలు అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పోలీసులు మీ స్నేహితులు డీఎస్పీ రఘువీర్




**రామచంద్రపురం,ఫిబ్రవరి19,(ప్రభాతవార్త):** పోలీసులు ప్రజల స్నేహితులేనని రామచంద్రపురం డిఎస్పి రఘువీర్ పేర్కొన్నారు గురువారం మండల తాళ్లపాలెం గ్రామంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా తాళ్ల పాలెం గ్రామం వద్ద రామాలయంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పి రఘువీర్ మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల అవగాహన కలిగి ఉండాలని.రెచ్చగొట్టే పోస్టులు వివాదాల సృష్టించే వార్తలు షేర్ చేయకూడదని గ్రామాల్లో ప్రశాంత వాతావరణ ఉండేలా సహకరించాలని సూచించారు.గ్రామాలలోని అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని తద్వారా నేర నియంత్రణ సులువు అవుతుందని తెలిపారు. సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించే సూచనలు తప్పక పాటించాలని తెలియజేశార.ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా పట్ల ఆకర్షితులై నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారని తల్లితండ్రులు గుర్తించి సరియైన మార్గంలో నడిపించాలని సూచించారు.సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే పోలీసు వారు దృష్టికి వెంటనే తీసుకురావాలని ఏదైనా నేరం జరిగినప్పుడు పోలీసువారికి తక్షణమే తెలియజేయడం ద్వారా నేర నియంత్రణ సులభతరం అవుతుందన్నారు అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు, ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్,గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు..

# దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సాయం



రావులపాలెం, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) : వెదిరేశ్వరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థులైన సుధీర్, ప్రశాంత్, సాయి గణేష్, సిద్ధు విలాస్, సాయి లకు ఒక్కొక్కరికి రూ.3,000 చొప్పున మొత్తం రూ.15,000 లను ఎంఈఓ శ్రీనివాసరాజు చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం వి మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ద్వారా ఈ సహాయం అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల చైర్మన్ మారే సుబ్బాయమ్మ మాట్లాడుతూ 'ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' (పి ఎం శ్రీ యోజన) కింద రావులపాలెం మండలంలో తమ పాఠశాల ఎంపిక కావడం ఆనందకరమని అన్నారు. ఈ పథకం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ప్రభాకరరావుకి నివాళులు



అమలాపురం,ఫిబ్రవరి19, ప్రభాతవార్త రాష్ట్ర మాజీ వాణిజ్య పన్నుల శాఖా మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం నడిపూడి లాకుల వద్ద నున్న దివంగత ప్రభాకర రావు విగ్రహానికి ఎమ్మెల్సీ పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సర్ధార్ కాటన్ ఉమ్మడి తూర్పు గోదావరి ప్రాంతంలో కాలువల ఆధునికరణ ద్వారా సస్యశ్యామలం చెస్తే దివంగత ప్రభాకర్ రావు మాజీ డ్రైనేజీ బోర్డు చైర్మన్ గా పంటకాలువలు ఆధునీ కారణచేసి రైతులకు మేలు చేకూర్చారన్నారు.ఆయన మంత్రిగా హయాంలో గిడ్డంగుల నిర్మాణానికి,వాణిజ్య పంటల ఎగుమతులకు మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వీరత్వానికి ప్రతీక "చత్రపతి శివాజీ"..



అంబాజీపేట, ఫిబ్రవరి 19,(ప్రభాతవార్త): యావత్ భారతదేశంలో వీరత్వానికి ప్రతీకగా కొలిచే చత్రపతి శివాజీ 396వ జన్మదిన వేడుకలను అంబాజీపేటలో కూటమి శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైందవ మతంను జాగృతం చేస్తూ హిందువుల ప్రాణమానాలను కాపాడి, శౌర్య-పరాక్రమ ధర్మ పాలనకు చిహ్నమైన చత్రపతి శివాజీ జన్మదిన వేడుకలను జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన ఆశయాలను ప్రజలలో ఇనుమడింప చేయడాన్ని గొప్ప విషయంగా భావిస్తూ హైందవ మతాన్ని కాపాడుతూ పోరాటం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దొమ్మేటి సాయికృష్ణ, కముజు శ్రీనివాసరావు,అరిగెల బలరామమూర్తి, నాగాబత్తుల సుబ్బారావు, మైపాల తాతాజీ,పితాని రామకృష్ణ, అంతర్వేది దేవీ సూర్యలక్ష్మి, అప్పన గణపతిరావు అయ్యగారి కృష్ణ సుందరం, ఆకెళ్ళ సూరిబాబు, పితాని సత్యనారాయణ,ఉందుర్తి నాగబాబు, గొలకోటి నరేష్, బండారు అబ్బులు, నేదునూరి రాజకుమార్, పితాని కేశవ, పరమట గోపి, పళ్ళ శ్రీనివాస్, సత్తాల నాగరాజు, మట్టపర్తి రమేష్, బొక్కా శ్రీహరి పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు పంపిణీ పై విచారణ జరిపించాలి : టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జి



కొత్తపేట, ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త) గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్తపేట నియోజక వర్గంలో వందలాది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు ఆ మేరకు పెద్ద ఎత్తున స్థలాలు కొనుగోలు చేశారు స్థలాలు కొనుగోలులో భారీ అవినీతి చోటుచేసుకుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి టిడిపి యూనిట్ ఇంచార్జ్ ఎలవెల్లి జగన్నాథం రావులు విమర్శించారు నాడు ఎకరం విలువ కన్నా నాలుగు ఐదు రెట్లు ఎక్కువ చెల్లించి భూములను కొనుగోలు చేశారన్నారు ఈ భూములను పేదలకు పంపిణీ పేరుతో పట్టాలు అందించారన్నారు అయితే నేటికీ ఆ స్థలాలు ఎక్కడున్నాయో చాలామంది పేదలకు తెలియదని అన్నారు వీరిలో చాలామంది గత నెల ప్రజా దర్బార్లో తమకు స్థలాలు కేటాయించాలంటూ వినతులు అందిస్తున్నారని తెలిపారు ఒకవైపు వైసీపీ నేతలు తాము వేల సంఖ్యలో పట్టాలు పంపిణీ చేశామని చెబుతున్నారన్నారు ఇల్లు వస్తుందని ఆశ చూపి కాగితాలు చేతిలో పెట్టి సర్కారు పేరుతో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం చేశారని విమర్శించారు స్థలాలు కొనుగోలులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ఈ అక్రమాలు అన్నింటి పైన ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి తక్షణమే విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు సమావేశంలో పంచాయతీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## సోమేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు



కె.గంగవరం,ఫిబ్రవరి 19,( ప్రభాతవార్త): మహాశివరాత్రి సందర్భంగా కోటిపల్లి పుణ్యక్షేత్రం లో వేంచేసినటువంటి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు గురువారం నిర్వహించబడినట్లు కార్యనిర్వహణాధికారి జె భీమ శంకర్రావు తెలియజేశారు. ప్రసాద విక్రాల ద్వారా రూ. 25,000, విరాళాల ద్వారా రూ. 35,317, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా రూ.96,000,హుండీల ద్వారా రూ.4,83,710, శీఘ్రదర్శన టికెట్ల ద్వారా రూ. 5,92,500 వెరసి మొత్తం ఆదాయం రూ. 12,32,527 వచ్చినట్టు ఆయన తెలియజేశారు. గత సంవత్సరం రూ 10,92,348 రాగా ఈ సంవత్సరం రూ 1,40,179 పెరుగుదల నమోదు అయినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆర్ బాలాజీ రాంప్రసాద్ గ్రామ సర్పంచ్ ఏమ్మెల్ బేబీ సత్తిబాబు, పోలీస్ సిబ్బంది,ఆలయ సిబ్బంది, పప్పుల సాయిబాబు వెంటాపే వీరఘావ చౌదరి,సత్యం, రామకృష్ణ,సోమేశ్, స్థానిక నాయకులు ,సేవా సమితి సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



కొత్తపేట, ఫిబ్రవరి 19,(ప్రభాతవార్త) హిందూ సామ్రాజ్య స్థాపకుడు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు మండల పరిధిలో గో రక్షకులు హిందూ ధార్మిక నాయకులు కోటిపల్లి రఘురాం నేతృత్వంలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొన్నారు ముందుగా బోడి పాలెం వంతెన సెంటర్ వద్ద శివాజీ మహారాజ్ ఫ్లెక్సీ కి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా బయలుదేరి వాడపాలెం పంచాయతీ సెంటర్ వద్ద ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి జై భవానీ వీర శివాజీ అంటూ కొనియాడారు బొజ్జ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడని శివాజీ తల్లి జిజాబాయి తండ్రి షాహాజీ భోంస్లే ల మార్గదర్శకత్వంలో చిన్న వయస్సులోనే తోర్నా కోటను గెలిచి గెరిల్లా యుద్ధతంత్రం (గనిమి కావా) ద్వారా మొఘల్ బీజాపూర్ సుల్తానులను ఎదిరించి స్వరాజ్యాన్ని నెలకొల్పారని అన్నారు 16 ఏళ్ల వయస్సులోనే తోర్నా కోటను స్వాధీనం చేసుకుని రాజ్గడ్ కొండన పురందర్ కోటలను గెలుచుకున్నారు గెరిల్లా యుద్ధతంత్రం శివాజీ గెరిల్లా యుద్ధ విధానంలో నిపుణుడు అతను మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యాలను మెరుపు దాడులతో విస్తుపోయేలా చేశారని కొనియాడారు 1674 జూన్ 6న రాయఘడ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకుని స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని ప్రకటించారన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కోటిపల్లి సుబ్రహ్మణ్యం కోటిపల్లి దామోదర్ గంగారాం అంజిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు

## ఎలకల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వనరుల కేంద్ర ఏవో



కె.గంగవరం, ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త): గంగవరం మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో గురువారం రబీ-25-26 సీజన్ కు గాను సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ సద్గురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కుందూరు లో జరిగిన ఎలుకలు నిర్మూలన కార్యక్రమం లో రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బి నాగ కుమార్ మాట్లాడుతూ రంగు, రుచి, వాసన లేని ఈ మందును తగుపాళ్ళలో నూకలు, నూనె కలిపి పొట్లాలుగా పెట్టడం ద్వారా సమర్థవంతంగా ఎలుకలు నిర్మూలించవచ్చని తెలిపారు. జిల్లా వనరులు కేంద్రం ఏవో జె మనోహర్ మాట్లాడుతూ రైతులు అందరూ తప్పనిసరిగా ఒకే సమయంలో ఈ ఎర మందు చేలో పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుందూరు సొసైటీ చైర్మన్ జగతా రమణ,కట్టా నాగేశ్వరరావు,స్థానిక కూటమి నాయకులు, వివిఏ పి రేవతి, రైతులు పాల్గొన్నారు.

# రూరల్ మండలంలో రెవిన్యూ సర్వే ఉద్యోగుల నిరసన



కాకినాడ రురల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త ):విఆర్వోల డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షులుఅమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు పిలుపు మేరకు కాకినాడ రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో నిరసన చేపట్టారు.ఈనెల 16నుండి 19 తేది వరకు భోజన విరామం సమయం లో సమయపాలన లేకుండా పని వత్తిడి తగ్గించాలని న్యాయమైన కోర్కెలు తీర్చాలని విఆర్ఓ లు మండల,విలేజ్ సర్వేయర్లు, నల్ల రిబ్బన్ దరించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యస్ యల్ వి కుమారీ , ఉపతహసీల్దార్లు రావు కళ్యాణ్ చక్రవర్తి,కాకర సురేష్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ భావానీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



కాకినాడ రూరల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ కోలుకున్న బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీ సానా సతీష్ బాబు సిఫార్సు మేరకు 8 చెక్కులను కార్యాలయ ఇన్చార్జ్ మేకా లక్ష్మణరావు, గౌరీ శంకర్, టిడిపి నాయకురాలు మీసాల సునీత చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆపద సమయంలో పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని ,ఎంపీ సానా సతీష్ బాబు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

# నేడు కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ట



కె.గంగవరం, ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త): గంగవరం మండలం బ్రహ్మపురి గ్రామంలో వేంచేసినటువంటి శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపతి పూజతో ప్రారంభించి గురువారం గోపూజ, మూలమంత్ర,జపములు, ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు,ఉదకశాంతి, ధాన్యధివాసము మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడగా, శుక్రవారం ఉదయం ఉత్తరాభారత నక్షత్రమున మేష లగ్నం పుష్కరాంశ శుభ ముహూర్తాన శ్రీ కనకదుర్గ దేవి అమ్మవారి ఆలయ ప్రతిష్ట జరుగునని బ్రహ్మపురి ఆలయ కమిటీ వారు తెలియజేశారు. పూర్ణాహుతి,ప్రాణ ప్రతిష్ట,బలి హోరణ అనంతరం అమ్మవారి దర్శనం, కుంబాభిషేకం, మంత్రపుష్పం జరుగునని, అనంతరం జరగబోయే అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ వారు, అర్చకులు, గ్రామ పెద్దలు తెలియజేశారు.

## వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కి వినతి..



ఆత్రేయపురం, ఫిబ్రవరి, 19,(ప్రభాత వార్త ) గ్రామ వీఆర్వోలు తాము ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం కాదని, కానీ తమపై విపరీతంగా పని భారం మోపుతున్నారని గ్రామ వీఆర్వోలు ఆవేదన వ్యక్తంచేస్తూ నిరసన చేపట్టారు.గ్రామ రెవెన్యూ అధికారులు సంఘశే వారి ఆధ్వర్యంలో గురువారం , భోజన విరామం సమయంలో ఆత్రేయపురం తహసీల్దార్ కార్యాలయంలో నందు నాలుగవ రోజు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి కి వినతి పత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు శేషగిరి మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ పరంగా పనులు కాకుండా సచివాలయం సర్వే ల నుండి మినహింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించాలని,సర్వే ప్రక్రి యను వంద రోజుల్లో పూర్తి చేయాలని టార్గెట్ విధించడం తగ దంటూ అధికారులు తీరుపై మండిపడ్డారు.సర్వేను హడా వుడిగా చేయడం వల్ల తప్పులు వచ్చే ప్రమాదం ఉందని ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు శేషగిరి, సెక్రెటరీ వేమగిరి సురేష్, మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



జగ్గంపేట ఫిబ్రవరి19 (ప్రబాత వార్త) జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా.డి. చెన్నారావు ఆధ్వర్యంలో చరిత్ర విభాగం యందు వీరమహానుభావుడు ఛత్రపతి శివాజి మహారాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చత్రపతి శివాజీ మహారాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ, శివాజీ మహారాజు దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం గురించి విద్యార్థులకు వివరిస్తూ, ఆయన జీవిత చరిత్ర యువతకు ఆదర్శమని పేర్కొన్నాడు. తదుపరి హిస్టరీ అధ్యాపకులు రాయుడు శ్రీను మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఒక గొప్ప యోధుడు, రాజకీయ వేత్త మరియు హిందూ ధర్మాన్ని రక్షించిన మహా పురుషుడు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కూడా శివాజీ మహారాజు జీవితం, స్వరాజ్య స్థాపనలో ఆయన పాత్ర, సమాజానికి చేసిన సేవల గురించి ప్రసంగించారు. కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో సాగి విద్యార్థుల్లో చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందించింది.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇతర అద్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రస్ట్ నడిపేందుకు దాతలు ముందుకు రావాలి



రామచంద్రపురం,ఫిబ్రవరి19,(ప్రభాతవార్త): అన్నదాత సుఖీభవ! రామచంద్రపురం పట్టణం పాత బస్టాండ్ నందు సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాలుగా నిరుపేదలకు నిత్య అన్నదానం జరుగుతోందన్న సంగతి అందరికీ తెలిసిందే.ఈ సుఖీభవ ట్రస్ట్ ను నడిపిస్తోంది ఓ సామాన్య పూల వ్యాపారి అన్న విషయం ఎంతమందికి తెలుసు? అయితే తాజాగా మన సుఖీభవ ట్రస్ట్ నిత్యా న్నదానం మెనూలో ప్రతి బుధవారం గుడ్డును చేర్చారు.అనే విషయాన్ని విశేషంగా చెప్పుకోవచ్చు.ట్రస్ట్ చైర్మన్ నాగిరెడ్డి వెంకన్న మాతృమూర్తి నాగిరెడ్డి భవాని ఇటీవల స్వర్గస్తులైనారు.ఈ నేపథ్యంలో వారి తల్లి గారు జ్ఞాపకార్థం నాగిరెడ్డి సోదరులు సుఖీభవ ట్రస్ట్ మెనూలో ప్రతివారం గుడ్డును చేర్చినట్లు నిర్వాహకులు వివరించారు.అలాగే ఎవరైనా తమ వివాహాది శుభకార్యాలకు, పెద్దల జ్ఞాపకార్థం వందమంది పేదలకు భోజనాలు పెట్టదలుచుకుంటే సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ నందు సంప్రదించి, తమ సంస్థకు చేయూతనివ్వాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న దాతలందరినీ ఆ సంస్థ నిర్వాహకులు కోరుతున్నారు...

## హైందవ సంస్కృతి, సంప్రదాయాలు రక్షించుకోవాలి :



యు.కొత్తపల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) : ప్రతిఒక్కరూ హైందవ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ ( ఆర్.ఎస్. ఎస్) సభ్యులు అన్నారు. మండలంలోని ఉప్పాడ వీవర్స్ కోలనీలో మహిళలు, యువకులు గురువారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ భావి తరాల మనుగడకు హైందవ ధర్మాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. స్వధర్మాన్ని రక్షించుకోకపోతే పరధర్మం అధర్మ పాలన చేస్తుందన్నారు. బానిసలా బ్రతకడంకన్నా ఎదిరించి బ్రతకడం వీరుల లక్షణమన్నారు. ఐకమత్యమే మన బలమని, ఐకమత్యాన్ని పెంచడానికి ప్రతీ ఇంటి నుంచి తమ వంతు కృషి చేయాలన్నారు. హిందువులందరూ తమ ఇళ్ళపై కాషాయ ధ్వజాన్ని ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో మత్సా మల్లిబాబు, నారాయణ రెడ్డి, కోటి శ్రీను, దంగేటి దత్తు, ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.60 వేల విరాళాలతో వంట షెడ్డు నిర్మాణం



మామిడికుదురు.ఫిబ్రవరి 19(ప్రభాతవార్త) నగరం మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రాంగణంలో దాతల విరాళాలు రూ.60 వేలతో వంటషెడ్డు నిర్మించారు. ఈ మండల విద్యాశాఖాధికారి.1 శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు.ప్రధానోపాధ్యాయుడు భావిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి పాల్గొన్నారు.విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాతలు ఎంతో మంది ముందుకు వస్తున్నారని ఎంఈఓ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన దాతలను అభినందించారు.కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్బోర్డు డైరెక్టర్ హాజీ ముకరం హుస్సేన్,జాలెం సుబ్బారావు,జాలెం శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల విముక్తి రథం ప్రారంభించిన జిల్లా కలెక్టర్



అమలాపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) గృహహింస లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా నిరోధించుట వంటి అంశాలలో ఈ కేంద్రం సహాయ పడుతుందన్నారు. వన్ స్టాప్ కేంద్రం నకు అనుబంధంగా 'బాల్య వివాహాల విముక్తి రథం" వాహనాన్ని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వన్ స్టాప్ కేంద్రం ఆపదలో ఉన్న మహిళలు కు అత్యవసర సేవలు చేరువ చేసేలా ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా ఒక ముఖ్యమైన అడుగులో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బాల్య వివాహాల ముక్తాభారత్ కార్యక్రమం కొరకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏర్పాటు చేసిన బాల్య వివాహాల విముక్తి రథాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. బాల వివాహ ముక్తాభారత్ చొరవతో అవగాహన బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల పట్ల అవగాహన పెంచడం, బాలికలకు ప్రకాశంవంతమైన భవిష్యత్తును నిర్ధారించడమే లక్ష్యం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాల్య వివాహాలు నిర్వహించడం 1098 హెల్ప్ లైన్ ద్వారా కూడా బాధిత వర్గాలకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పథక సంచాలకులు నాగమణి ,సిడిపివోలు విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం



రామచంద్రపురం,ఫిబ్రవరి19,(ప్రభాతవార్త): జేఈఈ ఫలితాలలో మోడరన్ జి.ఆర్.సి.జూనియర్ కాలేజీ విద్యార్థులు 20 మంది అత్యుత్తమ పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్ కి అర్హత సాధించిన సంగతి విధితమే.ఈ నేపథ్యంలో గురువారం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో,అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు ఆధ్వర్యంలో జేఈఈ ర్యాంకర్స్,వారి తల్లిదండ్రులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే సెషన్ -2 కి ప్రిపరేషన్ విధానంతో పాటు, అడ్వాన్స్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే ప్రక్రియ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు జి.వి.రావు పేర్కొన్నారు.సెషన్ 2 లో మరింత అత్యుత్తమ పర్సంటైల్ సాధించే దిశగా ఇప్పటికే పటిష్ట ప్రణాళిక సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేష్ తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు స్పందిస్తూ తమ చిన్నారులకు కేవలం నామమాత్రపు ప్రోగ్రాం ఫీజు చెల్లించామని, జెఈఈ లో ఊహించని ఘన విజయం దక్కేలా మోడరన్ జూనియర్ కాలేజీ అధ్యాపక బృందం విశేషమైన కృషి చేసిందని కొనియాడారు.లక్ష్య సాధనకు లక్షల ఫీజు ప్రామాణికం కాదని మోడరన్ జూనియర్ కాలేజీ మరోసారి రుజువు చేసిందని పేరెంట్స్ అభినందించారు...

## డ్రోన్ వినియోగంతో ద్రావణాల పిచికారీపై అవగాహన



ఆలమూరు, ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త) వరిలో గ్రోత్ ప్రమోటర్గా కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణం పనిచేస్తుందని, ప్రకృతి వ్యవసాయ విధానంలో ద్రావణాలు పిచికారీకి డ్రోన్ వినియోగం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయని ఆలమూరు మండల ప్రకృతి వ్యవసాయాధికారులు కర్రా సూర్యప్రకాష్, మేరేటి శ్రీనివాస్ లు తెలిపారు. ఆలమూరు మండలం నర్సిపూడిలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ తో ద్రావణాల పిచికారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ వినియోగించి కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణం పిచికారీ చేశారు. ఈ ద్రావణాన్ని గ్రోత్ ప్రమోటర్గా వ్యవహరిస్తారని వారు తెలిపారు. వరిలో చీడపీడల నివారణకు, పేనుబంక అరికట్టడానికి ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దొంగ నాగసూర్యపతి, తోరాటి నాగమహేశ్వరావు, నాగుబాబు, కె జ్యోతి, ఆర్ రాజ్యం తదితరులు పాల్గొన్నారు. ।

## నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



మామిడికుదురు.ఫిబ్రవరి 19(ప్రభాతవార్త) ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిన మామిడికుదురు ఆల్ క్యాస్ట్ కాలనీకి చెందిన అగ్ని ప్రమాద బాధితులు 14 మందికి నామన ఫౌండేషన్ ద్వారా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు.నిత్యావసర వస్తువులు కూడా అందించామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని నామన తెలిపారు. కార్యక్రమంలో వర్ధినేని వెంకటరామయ్య,యింటి మహేంద్ర,యర్రంశెట్టి తాతబుజ్జి,సాపే ఏకాదశి పాల్గొన్నారు.

# కృష్ణ మాదిగ వ్యాఖ్యలపై దళితుల నిరసన



మామిడికుదురు.ఫిబ్రవరి 19(ప్రభాతవార్త) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దళిత సంఘాల నేతలు గురువారం నిరసన తెలిపారు.మామిడికుదురు అంబేద్కర్ సామాజిక భవనంలో దళిత నేతలు సమావేశమై కృష్ణ మాదిగ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు.అంబేద్కర్ కు కృష్ణ మాదిగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో అమలాపురంలో జరిగే పర్యటనను అడ్డుకుంటామన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో జాలెం శ్రీనివాసరాజు,బొంతు మణిరాజ్,భూపతి వెంకటపతి,బత్తుల జనార్ధనరావు,మట్టా సత్తిబాబు,కలిగితి పల్లంరాజు,ఉండ్రు శ్రీరామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..: సర్పంచి శాంతకుమారి..



అంబాజీపేట,ఫిబ్రవరి 19, (ప్రభాతవార్త): గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్ ల సమైక్య అధ్యక్షురాలు, మాచవరం గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. అంబాజీపేట సాయిలక్ష్మీ నర్సింగ్ హోమ్ (డాక్టర్ ఢిల్లీ బాబు)లో అమలాపురం ఆకాశం ఆసుపత్రి వారిచే సత్య సాయి సేవా సంస్థలు అంబాజీపేట సబ్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంను సర్పంచి శాంతకుమారి గురువారం ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్,పిడియాట్రిక్స్, సాధారణ వైద్య సేవలందించారు.సుమారు 150 మంది బాధితులకు వైద్య పరీక్షలు జరిపి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ సాయిరామ్, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, కొప్పినీడి ఈశ్వరరావు,రెడ్డి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps